
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 116
మంగళవారం 10-1-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వన్డేలకు మోగిన విజిల్
నేడు గువాహటిలో శ్రీలంకతో భారత్ తొలి వన్డే మ్యాచ్ - 12లో




సెన్సెక్స్ బౌన్స్‌బ్యాక్
మూడు రోజుల నష్టాలకు చెక్.. సెన్సెక్స్ 847 పాయింట్లు జంప్ - 13లో



భారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లు
రాబోయే 25 ఏళ్లలో ప్రవాస భారతీయుల పాత్ర కీలకమని.. వారే భారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లు అని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



తొలి సిక్కు మహిళా జడ్జి
అమెరికాలోని హ్యారిస్ కౌంటీ జడ్జిగా భారత సంతతికి చెందిన మన్‌ప్రీత్ మోనికా సింగ్ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు.
వివరాలు 6లో ▸



రాజకీయ రంగు పులమొద్దు
'మతమార్పిళ్లు చాలా సీరియస్ విషయం. దీనికి రాజకీయ రంగు పులమొద్దు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
వివరాలు 6లో ▸



విమానంలో అసభ్య ప్రవర్తన
ఢిల్లీ నుంచి పట్నా వెళ్తున్న ఇండిగో విమానంలో మద్యం మత్తులో ఇద్దరు ప్రయాణికులు ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

లైంగిక దాడి కేసులో రాజీకి హైకోర్టు అనుమతి



లైంగిక దాడి కేసులో రాజీకి హైకోర్టు అనుమతిచ్చింది. చట్ట ప్రకారం ఇందుకు ఆస్కారం లేకపోయినప్పటికీ, ఫిర్యాదుకు దారి తీసిన పరిస్థితులు, ఇరుపక్షాలు రాజీ చేసుకుని ఎవరి జీవితాలు వారు గడపాలనుకోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది.
వివరాలు 14 ▸

విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించగలం



పేద పిల్లల చదువుకు ధనవంతులు తగిన సాయమందించాలని గవర్నర్ హరిచందన్ కోరారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉపకార వేతనాల ప్రదానోత్సవంలో పాల్గొన్న గవర్నర్.. ట్రస్ట్‌కు రూ.2 లక్షల విరాళం ప్రకటించారు.
వివరాలు 14 ▸

మంచు కురుస్తున్న వేళ..



పశ్చిమ గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. పలు ప్రాంతాల్లో పొగ మంచు కమ్మింది. అల్లూరి సీతారామరాజు మండలం జి.మాడుగులలో అత్యల్పంగా 1.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరు, డుంబ్రిగూడ, చింతపల్లి, అరకు చలికి గజగజ వణుకుతున్నాయి.
వివరాలు 3 ▸

రణరంగంగా మారిన బ్రెజిల్



బ్రెజిల్ రాజధానిలో మాజీ దేశాధ్యక్షుడు జైర్ బోల్సోనారో మద్దతుదారులు దురాక్రమణకు దిగారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకపోయిన బోల్సోనారో మద్దతుదారులు దేశాధ్యక్షుడి అధికార నివాసం, కాంగ్రెస్, సుప్రీంకోర్టు భవనాల గోడలెక్కి అద్దాలు, కిటికీలు ధ్వంసం చేశారు.
వివరాలు 6 ▸

సరికొత్త 'జీవన శైలి'

దీర్ఘకాలిక జబ్బుల బాధితులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు
- 30 ఏళ్లు దాటిన 2.09 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు
- మధుమేహం, రక్తపోటు బాధితుల వివరాలు యాప్‌తో అనుసంధానం
- క్రమం తప్పకుండా సందర్శిస్తూ సేవలందిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్లు'




సాక్షి, అమరావతి: దేశంలో 66 శాతం మరణాలకు జీవనశైలి జబ్బులే ప్రధాన కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. 2019 గణాంకాలే ఇందుకు నిదర్శనం. బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ అవసరం. తరచూ పరీక్షలతోపాటు జబ్బు తీరు ఆధారంగా మందుల డోసు మారుస్తుండాలి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా బాధితులకు మెరుగైన వైద్యం అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి సీఎం జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ట్రయల్ రన్
మిగతా 2వ పేజీలో ▶

3.38 కోట్ల హెల్త్ ఐడీలు

- రాష్ట్రంలో ఇంటింటి సర్వేతో ఆరోగ్య పరీక్షలు
- మధుమేహం, క్యాన్సర్, రక్తహీనత గుర్తించేలా ప్రాథమిక పరీక్షలు

14 లో



పాడి రైతులకు బోనస్ పంపిణీ చేసిన సీఎం

2 లో

కర్నూలు మిల్క్ యూనియన్ రైతుల బోనస్ చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

గవర్నర్ 'వాకౌట్'

తమిళనాడు అసెంబ్లీలో కనీవినీ ఎరగని దృశ్యాలు

తమిళనాట గవర్నర్‌కు, డీఎంకే ప్రభుత్వానికి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఆ రాష్ట్ర అసెంబ్లీలో కనీవినీ ఎరగని ఘటనలు చోటుచేసుకున్నాయి. సభనుద్దేశించి గవర్నర్ రవి చేసిన ప్రసంగం వివాదాన్ని రాజేసింది. ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పట్టించుకోకుండా.. పెరియార్, అన్నాదురై వంటి దిగ్గజాల పేర్లు పలకకుండా.. ద్రవిడ ప్రస్తావనను విస్మరిస్తూ ఆయన ప్రసంగించారు. దీంతో గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెట్టేందుకు సీఎం స్టాలిన్ సిద్ధమై మాట్లాడుతుండగా.. గవర్నర్ లేచి సభ నుంచి నిష్క్రమించారు.

6 లో



తమిళనాడు సీఎం మాట్లాడుతుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న గవర్నర్

వారెవ్వా వందే భారత్!

సాక్షి, హైదరాబాద్: దేశంలో సెమీ బుల్లెట్ రైలుగా గుర్తింపు పొందిన వందేభారత్ రైలు ఎట్టకేలకు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరుగుపెట్టబోతోంది. ఇటు రూపు, అటు తీరు.. రెండూ అభివృద్ధి చెందిన దేశాల్లోని రైలు తరహాలో ఉండటంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. పూర్తిస్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు కోసం అన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఏడు రైళ్ల పట్టాలెక్కగా, ఈనెల 19న సికింద్రాబాద్–విజయవాడ మధ్య ఎనిమిదో రైలు పరుగు ప్రారంభించనుంది. తెలుపు వర్ణం, దానిపై నీటి రంగు చారలు, బుల్లెట్ రైలు తరహాలో లోకో ముందు రూపు, వెడల్పాటి కిటికీ వరస.. ఇలా ఆకట్టుకునే రూపంతో ఉన్న ఈ రైలు సికింద్రాబాద్–విజయవాడ మధ్య పరుగుపెట్టబోతోంది. ఆ తర్వాత దాన్ని విశాఖ వరకు పొడిగించే యోచనలో ఉన్నారు.


ఆటోమేటిక్ తలుపులు...

ఈ రైలు వెలుపలి రూపు ఏరోడైనమిక్ డిజైన్‌తో రూపొందించారు. గరిష్టంగా 180 కి.మీ. వేగాన్ని అందుకునేలా డిజైన్ చేశారు. ఈ వేగాన్ని ప్రయోగదశలో మాత్రమే పరీక్షించి చూశారు. ప్రస్తుతం నిర్వహణ దశలో దాని గరిష్ట వేగ పరిమితి మాత్రం గంటకు 160 కి.మీ. మాత్రమే. ఈ గరిష్ట వేగాన్ని 140 సెకన్లలో అందుకుంటుంది. సికింద్రాబాద్–విజయవాడ మధ్య ట్రాక్ వేగ పరిమితిని గంటకు 110 కి.మీ నుంచి 130 కి.మీ.కు పెంచారు. పుల్లీ సస్పెండెడ్ ట్రాక్షన్ మోటార్‌తో రూపొందించిన ఆధునిక బోగీలను ఈ రైలులో వినియోగించారు. దీంతో రైలు ఎంత వేగంతో వెళ్లినా కుదుపులు ఉండవు. ఈ రైలుకు ప్రత్యేకంగా లోకోమోటివ్‌ను జత చేయాల్సిన అవసరం ఉండదు. రైలులో అంతర్భాగంగానే ఇంజిన్ ఉంటుంది. దీనికి మన ఎంఎంటీఎస్ రైలు తరహాలో లోకోపైలట్ కేబిన్‌లు రెండు చివర్లా ఉంటాయి. ఇందులో సీట్ల ప్రత్యేకతే వేరు. అవి 180 డిగ్రీల కోణంలో తిప్పుకోవచ్చు. వెడల్పాటి కిటికీ ఉన్నందున, దాని నుంచి బయటకు చూస్తూ ఉండాలనుకున్నప్పుడు సీటును కిటికీ వైపు తిప్పుకోవచ్చు. కుటుంబసభ్యులు రెండు సీట్లను పరస్పరం ఎదురెదురుగా తిప్పుకుని కూర్చోవచ్చు. కోచ్‌లో 32 అంగుళాల డిజిటల్ స్క్రీన్ ఉంటుంది. అందులో ప్రయాణికులకు రైలు వేగంతో సహా అన్ని వివరాలు డిస్‌ప్లే అవుతుంటాయి. ఆడియో అలర్ట్‌లు కూడా ఉంటాయి. ఈ రైలుకు ఆటోమేటిక్ తలుపులుంటాయి. వాటి నియంత్రణ లోకోపైలట్ వద్దే ఉంటుంది. మధ్యలో ప్రయాణికులు వాటిని తెరవలేరు, మూయలేరు. రైలు ఆగిన కొన్ని క్షణాలకు డోర్లు తెరుచుకుంటాయి. బయలుదేరటానికి కొన్ని సెకన్ల ముందు మూసుకుంటాయి. లోపలి వైపు, బయటి వైపు సీసీటీవీ కెమెరాలుంటాయి.



గుడ్డు.. కొత్త రికార్డు

- అంతకంతకూ పెరుగుతున్న గుడ్డు ధర
- పౌల్ట్రీ చరిత్రలో తొలిసారి
- రూ.5.54కు చేరిన రైతు ధర
- నాలుగేళ్ల తర్వాత అత్యధికం
- రిటైల్ మార్కెట్‌లో రూ.7



మండపేట: గుడ్డు ధర అంతకంతకూ పెరుగుతోంది. పౌల్ట్రీ రంగంలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. గుడ్డు రైతు దగ్గర ధర రూ.5.54కు చేరింది. నాలుగేళ్లలో ఇదే అత్యధిక ధర. మరోపక్క రిటైల్ మార్కెట్‌లో గుడ్డు రూ. 7కు చేరడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పౌల్ట్రీల్లో గుడ్డు పెట్టే కోళ్లు 1.4 కోట్ల వరకు ఉండగా రోజుకు 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 60 శాతం పశ్చిమబెంగాల్, ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా మిగిలినవి స్థానికంగా వినియోగిస్తున్నారు. శీతాకాలంలో ఉత్తరాది రాష్ట్రాల్లో చేపల లభ్యత తక్కువగా ఉండటంతో గుడ్ల వినియోగం పెరుగుతోంది. ఫలితంగా ఎగుమతులు పుంజుకొని రైతులకు అత్యధిక ధర లభిస్తుంది. 2017వ సంవత్సరం సీజన్‌లో రైతు దగ్గర ధర అత్యధికంగా రూ.5.45 లభించింది. అయితే, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో పౌల్ట్రీలు విస్తరించడం, ఎగుమతుల్లో ఇతర రాష్ట్రాల పోటీతో నాలుగేళ్లుగా పౌల్ట్రీ రంగం గడ్డు కాలం ఎదుర్కొంటోంది. సీజన్‌లో రైతు ధర రూ.5 దాటడం గగనమైంది. ఈ సీజన్‌లో శీతలం ఎక్కువగా ఉండటంతో
మిగతా 3వ పేజీలో ▶

శత్రు సైన్యంపై మూషికాస్త్రం!

- వినూత్న ప్రయోగాలు చేస్తున్న డీఆర్‌డీఓ
- ఎలక్ట్రానిక్ పరికరాలతో ఎలుకల సామర్థ్యం పెంపు
- మొదటి దశ ప్రయోగం విజయవంతం

- వివరాలు 6లో



బాబు భుజం కాయడమే పవన్ అజెండా

- జనసేన ఆవిర్భావం నుంచి వారిద్దరూ కలిసే ఉన్నారు
- అపవిత్ర కలయికను సమర్థించుకునేందుకే పరామర్శలు, ప్రజాస్వామ్య పరిరక్షణ డ్రామాలు
- బాబు ప్రచార పిచ్చితో 11 మంది పేదలు చనిపోతే పవన్ ఎందుకు పరామర్శించలేదు?
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

3 లో

ఇదండీ సంగతి




ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోతుంటే.. మళ్లీ పొత్తు ప్రశ్నలేంటయ్యా?

భూగర్భ జలాల పరిరక్షణలో ఏపీ అగ్రగామి

నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు అమలులో తొలిస్థానంలో రాష్ట్రం

- 13.09 లక్షల జల సంరక్షణ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల పెంపు
- 2017తో పోలిస్తే 2020 నుంచి ఏటా సగటున 208 టీఎంసీలు పెరుగుదల
- 1,254 పిజియోమీటర్ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- 14 లక్షల హెక్టార్లలో సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ అమలు

5 లో



- తద్వారా ఏటా సగటున 48 టీఎంసీలు తగ్గిన వినియోగం.. ఫలితంగా కేవలం 5.65 మీటర్లలోనే భూగర్భజలాలు


నెల్లూరు రూరల్ పరిధిలోని చంద్రమౌళినగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


నంద్యాల జిల్లా రోళ్లపాడులో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

గడప గడపకు మన ప్రభుత్వం


కృష్ణా జిల్లా వానపాములగ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం 47వ డివిజన్‌లో ఓ అవ్వ యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

క్లుప్తంగా...

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ నియామకానికి నోటిఫికేషన్

దరఖాస్తు దాఖలుకు గడువు 31వ తేదీ

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ (వీసీ) నియామకం కోసం సోమవారం రిజిస్ట్రార్ (ఎఫ్ఏసీ) డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు నోటిఫికేషన్ విడుదల చేశారు. విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాన్ని అందుబాటులో ఉంచారు. అర్హులైన వైద్యులు దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలి. ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తులు అందజేయవచ్చు. వీసీ ఎంపికకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ ఏర్పాటు చేసింది. గవర్నర్ నామినేట్ చేసిన విశ్వభారతి వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ గజ్జల వీరాంజిరెడ్డి, విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కమిటీ నామినేట్ చేసిన శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్, వీసీ డాక్టర్ వెంగమాంబ, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ 45 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుత వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ పదవీకాలం ఈ నెల 12వ తేదీతో ముగియనుంది.

ధార్మిక పరిషత్ సభ్యులుగా నలుగురి నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సభ్యులుగా మాకా బాలాజీ, రతన్ సుభాషిణి, ఆగమపండితులు చర్లావూరి శ్రీరామశర్మ, శ్రీరామమూర్తిలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి (ఎఫ్ఏసీ) హరిజవహర్‌లాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఈ నలుగురు ధార్మిక పరిషత్ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మా 'విడాకులు' తెగుతున్నాయ్

భారత్‌లో పెరుగుతున్న 'సిల్వర్ డైవర్సీ' కేసులు

50 ఏళ్ల వయసు దాటాక విడాకులు కోరుతున్న జంటలు

విశాఖ ప్రాంతానికి చెందిన దంపతులు 30 ఏళ్లు కుటుంబ బాధ్యతల్లో ఎంతో గొప్పగా మెలిగారు. భర్త కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కాగా.. ఆయన భార్య కొడుకు స్థిరపడ్డాక సొంతంగా వ్యాపారం ప్రారంభించారు. ఇదే వీరిద్దరి మధ్య మూడు దశాబ్దాల బంధాన్ని విచ్ఛిన్నం చేసింది. తనకు విడాకులు ఇప్పించాలంటూ అతడి భార్య కోర్టుకెళ్లారు. విజయవాడ ప్రాంతానికి చెందిన 48 ఏళ్ల ప్రియాంక తన 31 ఏళ్ల వైవాహిక బంధం నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నారు. కుటుంబంలో కలతలు ఉన్నా పిల్లల పెంపకం కోసం సర్దుకుపోయానని.. అయినా భర్త తనను అర్థం చేసుకోవడం లేదని పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితులు పాశ్చాత్య దేశాలకే పరిమితం. ఇప్పుడు మన దేశంలోని పట్టణాలకూ ఇది పాకింది. నడివయసు దాటిన వారు.. వైవాహిక జీవితంలో కొందరు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతుంటే.. చాలామంది విడిగా ఉంటున్నారు.

బాధ్యతలు తీరాక కొందరు.. ఆర్థిక భద్రతతో మరికొందరు | దేశంలో 45–49 ఏళ్ల వయసులో విడిపోతున్న స్త్రీలు 1.1 శాతం | యూఎన్‌వో 'ప్రోగ్రెస్ ఆఫ్ ది వరల్డ్స్ ఉమెన్' నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి : పాతికేళ్ల వైవాహిక జీవితం గడిపినవారు విడిపోవడాన్ని 'సిల్వర్ డైవర్సీ' లేదా 'గ్రే డైవర్సీ'గా చెబుతారు. రాష్ట్రంలోని ఒక్క విశాఖ జిల్లాలోనే కుటుంబ న్యాయస్థానానికి ఏటా 3 వేలకు పైగా విడాకుల కేసులు వస్తుండగా.. వాటిలో కనీసం 15 నుంచి 20 శాతం వరకు 25 ఏళ్లకు మించి వైవాహిక జీవితం గడిపిన జంటలు ఉంటున్నాయి. వివాహ బంధాన్ని ఎంతో పవిత్రంగా భావించే మన దేశంలో నడివయసు దాటినవారు విడిపోవాలని కోరుకుంటున్న తీరుపై ఐక్యరాజ్య సమితి (యూఎన్‌వో) ఆశ్చర్యం వ్యక్తం చేసింది. యూఎన్‌వో 'ప్రోగ్రెస్ ఆఫ్ ది వరల్డ్స్ ఉమెన్ రిపోర్టు–2010' ప్రకారం భారతదేశంలో 45–49 ఏళ్ల వయసు మహిళల్లో విడాకులు తీసుకుంటున్న వారు 1.1 శాతం ఉండగా.. 2019–20 నాటికి రెండింతలైనట్టు అంచనా వేసింది.

అపోహలు.. అనర్థాలతో తెగదెంపులు

మన దేశంలోనూ విడాకులు కోరుకుంటున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. వీరిలో వృద్ధాప్యానికి చేరువైన వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. 'భర్తను, ఇద్దరు బిడ్డలను మెప్పించేందుకు ఎంతో శ్రమించాను. భర్త, పిల్లలు సహా నన్ను అర్థం చేసుకునేవారు ఎవరూ లేరు. ఇన్నేళ్ల నా సంసార జీవితంలో నాకంటూ ఏమీ లేదు. బాగా అలసిపోయాను. అందుకే విడాకులు తీసుకుంటున్నాను' అంటున్న వారు ఎక్కువ మందే కనిపిస్తున్నారు. 'ఉద్యోగరీత్యా ఇన్నేళ్లూ ఊళ్లు పట్టుకు తిరుగుతూ భార్యాబిడ్డల్ని పుట్టింట్లోనే ఉంచేశారు. ఏ అవసరం వచ్చినా మీరు నా పక్కన లేరు. ఇప్పుడు రిటైరై తిరిగొచ్చాక మీ అవసరం నాకు ఏముంటుంది' అంటూ ఓ భార్య వైవాహిక బంధాన్ని తెగదెంపులు చేసుకున్నారు. కుటుంబంలో భార్యాభర్తల మధ్య జరిగే మాటల యుద్ధం, బంధువులు, సన్నిహితులు ఇచ్చే ఉచిత సలహాలు బంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయంటున్నారు సైకాలజిస్టులు. ఇటీవల 50 ఏళ్లు దాటిన వారిలో ఇది ఎక్కువ కనిపిస్తోందంటున్నారు. స్త్రీ, పురుషుల్లో ఆర్థిక స్వేచ్ఛ, ప్రపంచ సంస్కృతులు ఇందుకు కారణమవుతున్నాయంటున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. విడాకుల కేసుల్లో మహారాష్ట్ర మొదటి స్థానం, గుజరాత్ రెండు, పశ్చిమ బెంగాల్ మూడు, ఉత్తర ప్రదేశ్ నాలుగు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉన్నాయి.

ఒకరి ఉనికిని మరొకరు గౌరవించుకోవాలి

గతంలో పురుషులు సంపాదించాలి.. స్త్రీ ఇల్లు చక్కదిద్దాలని ఉండేది. మన సమాజంలో సంపాదించే స్థాయిలో ఉన్నవారు ఇల్లు చూసుకునే వారికి విలువ ఇవ్వరు. అక్కడే సమస్య మొదలవుతుంది. ఏళ్ల తరబడి మనసులో ఉన్న అసహనం పెల్లుబుకుతుంది. అప్పటికీ పిల్లల భవిష్యత్ కోసం మానసిక క్షోభను భరిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ కొన్ని ఇష్టాయిష్టాలు ఉంటాయి. ఒకరి ఉనికిని మరొకరు గౌరవించుకుంటే ఇబ్బంది రాదు. కానీ జరుగుతున్నది వేరు. అందువల్ల పిల్లలు స్థిరపడ్డాక విడిపోయేందుకు భార్యాభర్తలు సిద్ధమవుతున్నారు. ఆ సమయంలో ఒకరినొకరు అర్థం చేసుకునేలా చేస్తే విడిపోయే ప్రసక్తి ఉండదు.

– డాక్టర్ జి.పద్మజ, విభాగాధిపతి, సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ హెచ్‌ఓడీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

విడాకులు బాగా పెరిగాయి



గతంతో పోలిస్తే పట్టణాల్లో ఆర్థిక స్వేచ్ఛ పెరిగింది. సంపాదనలో ఆడ, మగా సమానంగా ఉంటున్నారు. కుటుంబంలో సమస్య వచ్చినప్పుడు సర్దుబాటు చేసుకోవడం లేదు. తక్కువ వయసులో వివాహం చేసుకున్న వారిలో ఎక్కువ మంది విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. అదే 35 ఏళ్లు తర్వాత పెళ్లి చేసుకున్న వారిలో ఈ సమస్య కనిపించడం లేదు. రెండో పెళ్లిళ్లు కుదిర్చేందుకు 1997లో మ్యారేజ్ బ్యూరో ఏర్పాటు చేశాం. అప్పట్లో తక్కువ వయసు వారే రెండో వివాహ సంబంధానికి వచ్చేవారు. ఇప్పుడు నెలకు 10–12 మంది సంప్రదిస్తుంటే వారిలో కనీసం నలుగురు 50–55 ఏళ్లు పైబడి, విడాకులు తీస్తున్న వారు ఉంటున్నారు. ఇటీవల మహిళలు కూడా ఎక్కువగా వస్తున్నారు.

– పి.వెంకట్‌రెడ్డి, తోడు–నీడ మ్యారేజ్ బ్యూరో

పాడి రైతులకు బోనస్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా పంపిణీ

సాక్షి, అమరావతి/కర్నూలు(అగ్రికల్చర్) : కర్నూలు మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) పాడి రైతులకు సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం బోనస్ పంపిణీ చేయించారు. కర్నూలు మిల్క్ యూనియన్ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి రూ.7.20 కోట్ల బోనస్ చెక్కును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందించగా.. సీఎం జగన్ ఆ చెక్కును మహిళా పాడి రైతు సరళమ్మకు అందించి బోనస్ పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. పాడి రైతుల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే తమ సహకార సమితి రెండేళ్లలో రూ.27 కోట్ల లాభాలు గడించిందని చైర్మన్ చెప్పారు. కర్నూలు మిల్క్ యూనియన్ సమగ్ర పనితీరును వివరించడంతో పాటు రానున్న రోజుల్లో డెయిరీని మరింత అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళతామని చైర్మన్‌తో పాటు కర్నూలు మిల్క్ యూనియన్ ఎండీ పరమేశ్వరరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రాజేష్, సొసైటీ డైరెక్టర్లు విజయసింహారెడ్డి, రమణలు సీఎం జగన్‌కు వివరించారు. వారి వెంట ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులున్నారు.

ఆస్తుల విభజనపై తెలంగాణకు 'సుప్రీం' నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆస్తులు, అప్పుల విభజనపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ సర్కార్‌కు నోటీసులు జారీ చేసింది. ఆస్తులు, అప్పుల విభజనను వేగంగా పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కోర్టు ఆదేశాల మేరకు పిటిషన్ కాపీలను ప్రతివాదులకు అందజేసినట్లు ఏపీ తరపు సీనియర్ న్యాయవాది విశ్వనాథన్ తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల విభజన మాదిరిగా ఏకసభ్య కమిషన్ నియమించాలని ఆయన కోర్టును కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ కేసులో ఆ విధంగా చేయలేమని వ్యాఖ్యానించింది. విచారణకు కేంద్రం, తెలంగాణ తరఫున న్యాయవాదులు హాజరు కాకపోవడంతో నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. రిజాయిండర్ దాఖలుకు 4వారాల గడువిచ్చింది.

సరికొత్త 'జీవన శైలి'

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది.

పోటెత్తుతున్న బీపీ

రాష్ట్రంలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, ఇతర జీవనశైలి జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించేందుకు 30 ఏళ్లు దాటిన వారందరికీ వైద్య ఆరోగ్య శాఖ స్క్రీనింగ్ నిర్వహిస్తోంది. 2,09,65,740 మందికి ఇప్పటివరకు పరీక్షలు చేశారు. వీరిలో 14.87 లక్షల మందికి రక్తపోటు ఉన్నట్లు నిర్ధారణ కాగా 33.84 లక్షల మంది హైరిస్క్ గ్రూప్‌లో ఉన్నట్లు తేలింది. ఇక 11.17 లక్షల మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించగా మరో 36 లక్షల మంది డయాబెటిస్ హైరిస్క్ గ్రూప్‌లో ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ యాప్‌లో డేటా

మధుమేహం, రక్తపోటు ఉన్నట్లు నిర్ధారించిన వారి వివరాలను ఫ్యామిలీ డాక్టర్ యాప్‌తో అనుసంధానించి వైద్యులు గ్రామాలకు వెళ్లినప్పుడు బాధితుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 4,33,157 మంది రక్తపోటు బాధితులు ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌కు హాజరు కాగా 90 శాతం మందికిపైగా వ్యక్తుల్లో సమస్య అదుపులో ఉన్నట్లు తేలింది. 3.23 లక్షల మంది మధుమేహం బాధితులు క్లినిక్‌లకు హాజరు కాగా 78 శాతం మందిలో సమస్య అదుపులోకి వచ్చింది.

క్యాన్సర్ రోగులకు సాంత్వన

క్యాన్సర్ బాధితులకు ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పలు రకాల వైద్య సేవలు గ్రామాల్లోనే లభిస్తున్నాయి. పీహెచ్‌సీ వైద్యులు గ్రామాలకు వెళ్లినప్పుడు ఆయా చోట్ల క్యాన్సర్ రోగుల ఆరోగ్యం గురించి వాకబు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకూ నోటి క్యాన్సర్ బాధితులు 2,959 మంది, ఛాతీ క్యాన్సర్ బాధితులు 757 మంది, గర్భాశయ క్యాన్సర్‌తో బాధ పడుతున్న 3,332 మంది గ్రామాల్లోనే వైద్య సేవలు అందుకోవడం ఊరట కలిగిస్తోంది.

వ్యయ ప్రయాసలు తొలిగాయి



నాకు బీపీ ఉంది. గతంలో వైద్యం కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా ఊరిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటైంది. ఇక్కడే బీపీ చెకప్ చేసి మందులు కూడా ఇస్తున్నారు. డాక్టర్ మా గ్రామానికే వస్తుండటంతో వ్యయ ప్రయాసలు తొలిగాయి.

– ఏపూరి భాగ్యమ్మ, కామేపల్లి, పిడుగురాళ్ల మండలం, పల్నాడు జిల్లా

బీపీ, షుగర్ బాధితులకు ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు ఇప్పటివరకు ఇలా

జిల్లా	రక్తపోటు	మధుమేహం
ఏఎస్ఆర్	2,637	774
అనకాపల్లి	22,601	10,779
అనంతపురం	12,747	9,027
అన్నమయ్య	12,396	9,027
బాపట్ల	16,475	13,358
చిత్తూరు	17,964	15,954
తూర్పు గోదావరి	17,123	14,445
ఏలూరు	15,477	1,3151
గుంటూరు	17,391	14,755
కాకినాడ	33,312	21,600
కోనసీమ	32,470	22,524
కృష్ణా	31,833	25,358
కర్నూలు	11,467	7,216
నంద్యాల	16,167	11,404
ఎన్టీఆర్	15,382	13,018
పల్నాడు	21,106	17,126
పార్వతీపురం మన్యం	8,016	4,480
ప్రకాశం	21,167	18,593
నెల్లూరు	21,206	17,902
శ్రీసత్యసాయి	1,0121	7,029
శ్రీకాకుళం	13,955	9,020
తిరుపతి	12,819	11,492
విశాఖపట్నం	1,891	1,384
విజయనగరం	14,959	8,764
పశ్చిమ గోదావరి	20,192	1,6141
వైఎస్సార్	12,283	8,579

తిరుపతి, నెల్లూరులో జియో ట్రూ 5జీ సేవలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని తిరుపతి, నెల్లూరు నగరాల్లో రిలయన్స్ జియో ట్రూ 5జీ సేవలను సోమవారం లాంఛనంగా ప్రారంభించింది. ఇప్పటికే తిరుమల, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరులో రిలయన్స్ జియో తన ట్రూ 5జీ సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో జియో ట్రూ 5జీ సేవలను విస్తరించడం రాష్ట్ర అభివృద్ధి పట్ల జియోకు ఉన్న అపారమైన నిబద్ధతను సూచిస్తోందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామంలో జియో ట్రూ 5జీ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. ఏపీని డిజిటలైజ్ చేసి ముందుకు తీసుకువెళ్లడంలో సహకరించిన ప్రభుత్వానికి జియో ఏపీ సీఈవో మందపల్లి మహేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నాడు–నేడు పథకానికి లారస్ ల్యాబ్స్

రూ.4 కోట్ల విరాళం

క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు అందజేత

సాక్షి, అమరావతి: విద్యారంగంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఏపీ ప్రభుత్వం చేపట్టిన 'నాడు–నేడు' కార్యక్రమానికి లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.4 కోట్ల విరాళం అందించింది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో డా.సత్యనారాయణ చావా సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసి విరాళాన్ని అందజేశారు. అనకాపల్లి ప్రభుత్వాస్పత్రిలో కాలిన గాయాలకు సంబంధించి వార్డు నిర్మాణానికీ రూ.5 కోట్లు ఇస్తామని సీఎంతో చెప్పారు. నాడు–నేడు పథకం కింద లారస్ ల్యాబ్స్ ఈ విరాళాన్ని అందించడం ఇది మూడోసారి. కార్పొరేట్ డెవలప్‌మెంట్, సింథసిస్, ఇంగ్రిడియంట్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ చైతన్య, హెచ్‌ఆర్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నరసింహారావు, సీఎస్ఆర్ హెడ్ సౌమ్య ఉన్నారు.


సీఎం జగన్‌కు చెక్కు అందిస్తున్న డాక్టర్ సత్యనారాయణ చావా, కృష్ణచైతన్య, నరసింహారావు, సౌమ్య

పోటాపోటీగా పేటెంట్లు

- 80 శాతం ఫీజు రాయితీలతో కేంద్రం వెన్నుదన్ను
- నూతన ఆవిష్కరణలకు ఆర్థిక సహకారం
- మేథో సంపత్తిని పెంచేలా కార్యాచరణ
- క్రమేణా కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో పెరుగుతున్న పేటెంట్ల సంఖ్య
- వాటికి తీసిపోని రీతిలో పోటీపడుతున్న ప్రైవేటు వర్సిటీలు
- ఫెసిలిటేటర్ల సర్వీస్ ఛార్జీల నుంచి వర్సిటీలకు మినహాయింపు
- ఏటా 10వేల పేటెంట్ల లక్ష్యంగా ప్రోత్సాహకాలు



పేటెంట్లలో ముందున్నవి ఇవే..

ఇక కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ వంటి పరిశోధనా సంస్థలు అత్యధిక సంఖ్యలో పేటెంట్‌లను దాఖలు చేయడంలో ముందున్నాయి. కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్, ట్రేడ్‌మార్క్ (సీజీపీడీటీఎం) నివేదిక ప్రకారం 2019–2020లో టాప్–10 విద్యాసంస్థలు అందించిన పేటెంట్ల సంఖ్య 2,533 కాగా.. 2020–21లో ఆ సంఖ్య 3,103కి పెరిగింది. 2019–20లో ఐఐటీలు 664 పేటెంట్లను దాఖలు చేశాయి. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, చండీగఢ్ వర్సిటీ వంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తక్కిన పేటెంట్లకు దరఖాస్తు చేశాయి. అలాగే, 2020–21లో ఐఐటీలు 640 పేటెంట్లు ప్రకటించగా తక్కిన సంస్థల్లో అవి మరింత మెరుగుపడ్డాయి. ఈ వర్సిటీల్లో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్లను ఏర్పాటుచేసి ఈ పేటెంట్లను దాఖలు చేశాయి.

సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జాతీయ ఉన్నత విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు యూనివర్సిటీలు, విద్యాసంస్థలు పేటెంట్ల విషయంలో పోటీపడుతున్నాయి. వీటిల్లో పరిశోధనా కార్యక్రమాలను మరింత పగడ్బందీగా కొనసాగిస్తుండడంతో కొత్త ఆవిష్కరణలతో స్వయం సమృద్ధికి వీలుగా మేథో సంపత్తి హక్కుల (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) సాధనలో పురోగతి సాధిస్తున్నాయి. కేంద్రం కూడా ఈ ఉన్నత విద్యా సంస్థల్లో చేపట్టే ఆవిష్కరణలకు పేటెంట్లు కల్పించడంలో 80 శాతం ఫీజు రాయితీలు ఇవ్వడం కూడా నూతన ఆవిష్కరణలకు కారణమవుతున్నాయి. ఫలితంగా ఈ సంస్థలలో పేటెంట్ల సంఖ్య క్రమేణా పెరుగుతోంది.

నిజానికి.. ఏదైనా సంస్థ పేటెంట్ దాఖలు చేయాలంటే ముందుగా రూ.20వేల ఖర్చుపెట్టాలి. ఆ తరువాత వాటి పరిశీలన తదితర ప్రక్రియలలో మరికొంత మొత్తాన్ని ఛార్జీలుగా చెల్లించాలి. దీనికి అదనంగా.. పేటెంట్ చేసే వ్యక్తి 20 ఏళ్లపాటు దాని నిర్వహణ రుసుమును కూడా జమచేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఇప్పటివరకు ఉన్నత విద్యాసంస్థల్లో పేటెంట్లపై ఆసక్తి కనబర్చలేదు. అయితే, కేంద్ర ప్రభుత్వం పరిశోధన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా చట్టాన్ని సవరించి 80 శాతం రాయితీలను ప్రకటించడంతో క్రమేణా పేటెంట్లు పెరిగేందుకు ఆస్కారమేర్పడుతోంది. నూతన జాతీయ విద్యావిధానం–2020లో కూడా ఉన్నత విద్యా సంస్థల్లో నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలని.. వాటి ద్వారా ఆయా సంస్థలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రణాళికలు అమలుచేయాలని సూచించింది. సమగ్ర పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు చేసే వారికి ఆర్థిక సహకారం కూడా అందించేలా మార్గనిర్దేశం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏటా అధ్యాపకులు, పరిశోధక అభ్యర్థులకు నిధులు కూడా ఇస్తోంది. ఇలా ఏటా 10వేల పేటెంట్ల లక్ష్యంగా ఈ ప్రోత్సాహకాలను అందిస్తోంది. పేటెంట్ల వాణిజ్యీకరణను ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ పేటెంట్ ర్యాంకింగ్స్‌లో స్థానాన్ని మెరుగుపర్చుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

ఏయూలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

ఈ పేటెంట్లను ప్రోత్సహించడానికి రాష్ట్రంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం తన క్యాంపస్‌లో మేథో సంపత్తి హక్కుల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఈ కేంద్రం డాక్యుమెంటేషన్ ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటు దాఖలుకు అయ్యే ఖర్చును కూడా భరిస్తోంది. అనేక విద్యాసంస్థల విద్యార్థులు తమ మెంటార్ల మార్గదర్శకత్వంలో వినూత్న ప్రాజెక్టుల పేటెంట్ల దాఖలుకు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు.. 2020–21లో విద్యాసంస్థలు, ఇతర పరిశోధనా సంస్థలు అందించిన పేటెంట్ దరఖాస్తులు 58,503గా ఉన్నాయి. అందులో ప్రధానంగా మహారాష్ట్ర 4,214, తమిళనాడు 3,945, కర్ణాటక 2,784, యూపీ 2,317, తెలంగాణ 1,662, పంజాబ్ 1,650, ఢిల్లీ 1,608, గుజరాత్ 921, హర్యానా 765, ఆంధ్రప్రదేశ్ 709, పశ్చిమ బెంగాల్ 505 రాజస్థాన్ 449, కేరళ 426, మధ్యప్రదేశ్ 398, ఒడిశా 144, పాండిచ్చేరి నుంచి 139 దరఖాస్తులు వచ్చాయి.

2016-17 నుంచి 2020-21 వరకు పేటెంట్ల పురోగతి ఇలా..

2016-17	45,444
2017-18	47,854
2018-19	50,659
2019-20	56,267
2020-21	58,503

2019-20లో టాప్-10 విద్యాసంస్థలు పేటెంట్లు..

ఐఐటీలు	664
లవ్లీ వర్సిటీ	442
చండీగఢ్ వర్సిటీ	400
భారత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చి	251
చండీగఢ్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్	210
అమిటీ వర్సిటీ	179
సాంస్క్రీట్ వర్సిటీ	150
శిక్షా అనుసూదన్ వర్సిటీ	101
శూలినీ వర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ మేనేజ్‌మెంట్ సైన్సెస్	80
ఎస్సారెమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ	56

2020-21లో టాప్-10 విద్యాసంస్థల పేటెంట్లు..

ఐఐటీలు	640
లవ్లీ వర్సిటీ	545
చండీగఢ్ వర్సిటీ	416
చండీఘర్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్	352
సాంస్క్రీట్ వర్సిటీ	301
అమిటీ వర్సిటీ	208
గాల్గోటియాస్ యూనివర్సిటీ	180
ఎస్సారెమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ	161
జీఎల్ఏ యూనివర్సిటీ మధుర	118

క్లుప్తంగా...

మళ్లీ టీడీపీ ప్రభుత్వంతోనే తెలుగు ప్రజలకు పూర్వవైభవం

ఎన్టీఆర్ తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 40 ఏళ్లయిన సందర్భంగా చంద్రబాబు



చంద్రబాబును కలిసిన రజనీకాంత్

సాక్షి, అమరావతి: మళ్లీ తమ పార్టీ ప్రభుత్వం ఏర్పడితేనే తెలుగు ప్రజలకు పూర్వవైభవం వస్తుందని, రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతుందని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు తెలుగు ప్రజల జీవితాల్లో పెనుమార్పులకు నాంది పలికిన రోజని తెలిపారు. రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కింది తెలుగుదేశం ఆవిర్భావంతోనేనని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వంలో, పాలనలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ఎదుగుదలకు నాంది పలికామని తెలిపారు. గ్రామాల్లో, మండల, జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున స్కూళ్లు, కాలేజీలు, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం ద్వారా అణగారినవర్గాలకు విద్యను చేరువచేసింది టీడీపీయేనని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన దిశగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి కంకణబద్ధులమై పనిచేద్దామని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబుతో రజనీకాంత్ భేటీ

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం చంద్రబాబుతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని బాబు నివాసానికి వచ్చిన రజనీకాంత్‌ను ఆయన సాదరంగా ఆహ్వానించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఇది మర్యాదపూర్వక కలయికేనని పేర్కొన్నాయి.

టీడీపీతో పొత్తుకు అవకాశం లేదు

తమ నేతలకు బీజేపీ అంతర్గత సందేశం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలు లేవంటూ పరోక్షంగా బీజేపీ స్పష్టంచేసింది. తమ పొత్తు జనం, జనసేనతో మాత్రమే అని తెలిపింది. ఈ మేరకు తమ పార్టీ నేతలకు అంతర్గత సందేశాలు పంపింది. చంద్రబాబును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసిన నేపథ్యంలో బీజేపీ తమ నేతలకు పలు ఆదేశాలిచ్చింది. కుటుంబ, అవినీతి, వారసత్వ పార్టీలకు బీజేపీ దూరంగా ఉంటుందని స్పష్టం చేయాలని నేతలకు సూచించింది. టీవీ చర్చల్లో, మీడియా ప్రతినిధులతో మాట్లాడే సమయంలో పార్టీ విధానం గురించి అధికార ప్రతినిధులు స్పష్టంగా చెప్పాలంటూ ఆ సందేశాల్లో సూచించింది. పవన్, చంద్రబాబు భేటీపై ఎలాంటి వ్యాఖ్యలు, అపోహలు అవసరం లేదని, ఇలాంటి భేటీలు రాజకీయాల్లో సర్వసాధారణ అంశంగా చూద్దామంటూ నేతలకు సూచించింది.

మంచు కురుస్తున్న వేళ..

చలికి వణుకుతున్న రాష్ట్రం

- రాష్ట్రవ్యాప్తంగా పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- జి మాడుగులలో 1.9 డిగ్రీలు నమోదు
- అరకు లోయలో గడ్డకడుతున్న మంచు
- పశ్చిమ గాలుల ప్రభావం



పాడేరు ఎస్పీ కార్యాలయం వద్ద ఓ కారుపై గడ్డ కట్టిన మంచు

సాక్షి, అమరావతి/సాక్షి, పాడేరు: రాష్ట్రం చలికి వణుకుతోంది. పశ్చిమ గాలుల ప్రభావంతోనే చలి తీవ్రత పెరిగింది. పలు ప్రాంతాల్లో పొగ మంచు కమ్మింది. ఉత్తర భారతదేశంతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతోపాటు చలి గాలులు వీస్తుండటం వల్ల రాష్ట్రంలోనూ చలి పెరిగిందని వాతావరణ శాఖ తెలిపింది. విశాఖ ఏజెన్సీ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ పరిసర ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 1 నుంచి 4 డిగ్రీల వరకు పడిపోయాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా జి మాడుగులలో సోమవారం తెల్లవారుజామున అత్యల్పంగా 1.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరు, డుంబ్రిగూడ, చింతపల్లి, అరకు తదితర ప్రాంతాలు చలికి గజగజ వణుకుతున్నాయి. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురవడంతో పలు ప్రాంతాలలో మంచు గడ్డ కట్టింది. పాడేరుకు సమీపంలోని ఎస్పీ కార్యాలయం ఎదుట నిలిపిన కారుపై మంచు పేరుకుపోవడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. పంట భూముల వద్ద మంచు పొరలు ఏర్పడ్డాయి. ఏజెన్సీలో మంచు గడ్డకట్టిన దృశ్యాలను ఎప్పుడూ చూడలేదని స్థానికులు తెలిపారు.

రాష్ట్రంలోని మిగిలి ప్రాంతాల్లో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీల మేర పడిపోయాయి. రాయలసీమలోని పలు ప్రాంతాల్లోనూ అరకు మాదిరిగానే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కర్నూలు జిల్లా మంత్రాలయంలో 6.3, ఆలూరు మండలం కమ్మరచేడులో 6.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల, సత్యసాయి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 డిగ్రీలకంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరో 3, 4 రోజులు చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 1.9 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 2 డిగ్రీలు, కుంతలం, హుకుంపేటలో 2.3, జీకే వీధిలో 2.6, చింతపల్లిలో 2.8, అరకు, డుంబ్రిగూడలో 3.2, పాడేరులో 3.6, కొక్కిసలో 4.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లా మంత్రాలయంలో 6.3, కమ్మరచేడులో 6.5, జి.శింగవరంలో 6.6, కె.నాగలాపురంలో 6.8 డిగ్రీలు నమోదయ్యాయి. విశాఖపట్నం అక్కిరెడ్డిపాలెంలో 11.6, తిరుపతిలో 14.7, విజయవాడ రూరల్ నున్నలో 14.9, విజయవాడ గుణదలలో 16.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

అన్నమయ్య జిల్లా కోళ్లబైలులోని స్వాధీన స్థలంలో హెచ్చరిక బోర్డు



స్వాధీనం చేసుకున్న స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం కోళ్లబైలు పంచాయతీలో ఆక్రమణదారుల చెరలో ఉన్న రూ.10 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని సోమవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తూ ప్లాట్లు అమ్ముకుంటున్నారని కోళ్లబైలు గ్రామస్తులు గత సోమవారం స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై ఆర్డీవో ఎం.ఎస్.మురళి తక్షణమే స్పందించారు. వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు హుటాహుటిన కోళ్లబైలు సర్వే నంబర్లు 889/5లోని 1.11 ఎకరాలు, 891/1లోని 0.62 సెంట్ల భూమికి జారీ చేసిన పట్టాను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలం ప్రభుత్వ భూమి అని అందులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆ భూమిలోకి ప్రవేశిస్తే చట్టప్రకారం శిక్షార్హులుగా పేర్కొన్నారు. అయితే అప్పటికే సదరు స్థలంలో ఆక్రమణదారులు అధికారుల కళ్లుగప్పి అక్రమ నిర్మాణాలు చేస్తుండటంతో వారందరికీ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అంతటితోనే నిలిపేయాలని హెచ్చరించారు.

పేర్లే వేర్వేరు.. ఆ ఇద్దరూ ఒక్కటే

షరతులతో సభలు, రోడ్‌షోలు నిర్వహించుకోవాలని చెబితే రాద్ధాంతమెందుకు?

40 ఇయర్స్ ఇండస్ట్రీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని మళ్లీ గద్దెనెక్కించేందుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తాపత్రయపడుతున్నారని పలువురు మంత్రులు ఎద్దేవా చేశారు. జీఓ నం.1ను చదవకుండానే దానిపై దుష్ప్రచారం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ప్రజాస్వామ్యం గురించే మాట్లాడే పవన్.. జనసేన శ్రేణులు మంత్రులను అడ్డుకోవడానికి యత్నించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన అధినేతలు భేటీ కావడంపై సోమవారం పలువురు మంత్రులు స్పందించారు.

- సీఎం జగన్‌ను ఎదుర్కోలేక విపక్షాలు భయపడుతున్నాయి
- మంత్రిని అడ్డుకునేందుకు జనసేన రోడ్డెక్కటం అప్రజాస్వామికం
- ఏదో విధంగా రెచ్చగొట్టి సమాజాన్ని నాశనం చేయాలనుకుంటున్నారు
- చంద్రబాబు, పవన్‌ల తీరుపై పలువురు మంత్రుల మండిపాటు

జనసైనికులు సంఘవిద్రోహ శక్తులు



దాచేపల్లి: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలిసే ఉంటారు.. కలిసే పోటీచేస్తారు.. వాళ్లిద్దరూ ఎప్పుడూ విడిపోలేదని ఎప్పటినుంచో చెబుతున్నాను. చంద్రబాబుని పవన్‌కళ్యాణ్ కలవటంపై కొంతమంది ఆశ్చర్యపడి ఉండవచ్చేమో కానీ నాకు ఆశ్చర్యం కలగలేదు. ఈ విషయంలో మేం చాలా క్లారిటీతో ఉన్నాం. జీఓ నంబర్-1 అప్రజాస్వామికమని చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ గగ్గోలు పెడుతున్నారు. దాచేపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి, శంకుస్థాపనలకు వస్తే అడ్డుకుంటామని జనసైనికులు రోడ్డెక్కటం ప్రజాస్వామ్యమా? జనసేన వాళ్లు ఒక మంత్రి కార్యక్రమం అడ్డుకోవటానికి వస్తున్నారంటే వాళ్లు జనసైనికులా.. లేక రౌడీ సైనికులా? ఏదో ఒక విధంగా రెచ్చగొట్టి సమాజాన్ని నాశనం చేయాలనే ఆలోచనతో జనసైనికులు సంఘ విద్రోహశక్తుల్లా పనిచేస్తున్నారు. – మంత్రి అంబటి రాంబాబు

ముందు ఆ జీఓ చదవడం నేర్చుకోండి



కొవ్వూరు (తూర్పు గోదావరి జిల్లా): కందుకూరు, గుంటూరు వంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా, ప్రజల రక్షణ కోసమే జీఓ నంబర్-1ను తీసుకొచ్చాం. షరతులతో కూడిన నిబంధనలను అనుసరించి సభలు, రోడ్‌షోలు నిర్వహించుకోవాలని ఈ జీఓ ఉద్దేశం. ఎక్కడా ప్రతిపక్షాలు నోరెత్తకూడదని, ఏ కార్యక్రమం చేయవద్దని చెప్పడంలేదు. అలాగే, ఈ జీఓ ఎవరికీ ఇబ్బంది కలిగించేలాలేదు. డిపాజిట్లు రాని వాళ్లు, ప్రతిపక్ష నేతలు ఈ జీఓ గురించి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ముందు జీఓ చదవడం నేర్చుకోవాలి. కందుకూరు, గుంటూరులో పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించడంవల్లే ఎంతోమందిని కాపాడగలిగారు. లేదంటే మరిన్ని ప్రాణాలు పోయేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యంలేక ప్రతిపక్ష నేతలు డైపర్స్ తడుపుకుంటున్నారు. – హోంమంత్రి తానేటి వనిత

చంద్రబాబుకు పవన్ కోవర్టు



కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): చంద్రబాబుకు పవన్‌కళ్యాణ్ దత్తపుత్రుడే కాకుండా కోవర్టుగా మారాడు. పవన్ కళ్యాణ్ ఎక్కడ సమావేశాలు నిర్వహించాలన్నా చంద్రబాబు అనుమతితో పాటు, డైలాగ్ స్క్రిప్టు కూడా అవసరం. పవన్ నిజమైన ప్రజా సేవకుడైతే చంద్రబాబు ఆరాట సభలో మృతిచెందిన వారికి రూ.కోటి చొప్పున అందించాలి. అతనికి దమ్ము, ధైర్యం ఉంటే 175 స్థానాల్లో పోటీచేసి తన సత్తా చాటుకోవాలి. చిల్లర రాజకీయాలతో ప్రజలను రెచ్చగొట్టే విధానాన్ని మానుకోవాలి. ఇక ప్రచారం కోసం 11 మంది అమాయకుల ప్రాణాలను బలిగొని రాక్షసానందాన్ని పొందుతున్న వ్యక్తి చంద్రబాబు. – ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి

బాబును గద్దె ఎక్కించడానికి పవన్ తాపత్రయం



మహారాణిపేట (విశాఖ దక్షిణ): చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ పేర్లు వేర్వేరు. కానీ, వారిద్దరూ ఒక్కటే. వీరికి ప్రజలే బుద్ధిచెబుతారు. చంద్రబాబును గద్దె ఎక్కించాలని పవన్ తాపత్రయం పడుతున్నారు. వీరిద్దరే కాదు.. ఎన్ని పార్టీలు కలిసినా వైఎస్సార్ సీపీ వెంటే ప్రజలున్నారు. జీఓ నెంబర్ వన్‌పై చంద్రబాబు, పవన్ అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు. అమాయకపు ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయంలో ప్రజలు ఆయనకు బుద్ధిచెబుతారు. – మంత్రి విడదల రజిని

ఒక్కరిని ఢీకొట్టేందుకు ఇంతమందా?



ఆలూరు: సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మనసును చూరగొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొనేందుకు ఇన్నేళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే నాయకులు ఒక్కొక్కరుగా రాలేక, గుంపు కడుతున్నారు. ఎంతమంది వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరు. చంద్రబాబు, పవన్, పచ్చమీడియా.. ఇలా ఎంతమంది ఏకమైనా ప్రజల అండదండలు ఉన్నంత వరకు సీఎం వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరు. – మంత్రి గుమ్మనూరు జయరాం

గుడ్డు.. కొత్త రికార్డు

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలోని గుడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ పెరిగి, ధర పెరిగింది. ఈ ధర ఆశాజనకమే అయినప్పటికీ, మేత ధర ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో ప్రయోజనం అంతంత మాత్రమేనని కోళ్ల రైతులు అంటున్నారు. కోళ్లకు వేసే వ్యాక్సిన్లు, మందుల ధరలు, కార్మికుల జీతాలు పెరిగిపోవడం పౌల్ట్రీల నిర్వహణ వ్యయాన్ని పెంచేసిందంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏడాది సగటు ధర రైతు దగ్గర రూ.5 ఉంటేనే కానీ గిట్టుబాటు కాదని, గత ఏడాది సగటు ధర రూ. 4.39 మాత్రమే ఉండటంతో నష్టాలు వచ్చాయని చెబుతున్నారు. కోడి మేతకు వినియోగించే మొక్కజొన్న, సోయా, నూకలు తదితర వాటిని పౌల్ట్రీలకు రాయితీపై సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరలు తగ్గితేనే ఊరట



గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో గుడ్డు అత్యధిక రైతు ధరను నమోదు చేసుకుంది. ప్రస్తుత ధర ఆశాజనకంగా ఉన్నా కోడి మేత ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. మేత రేట్లు అందుబాటులోకి వస్తేనే పరిశ్రమకు ఊరట. కోడి మేతను సబ్సిడీపై పౌల్ట్రీలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ

నాలుగేళ్ల 'ప్రజా సంకల్పం'

- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సంబరాలు
- కేక్ కోసి పార్టీ నేతలు, కార్యకర్తల ఆనందోత్సాహం
- ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన నాయకుడు వైఎస్ జగన్: సజ్జల

సాక్షి, అమరావతి: సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు చూసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 98.4 శాతానికి పైగా హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ నిత్యం ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపిన విశ్వసనీయ నాయకుడని కొనియాడారు. సీఎం జగన్ ప్రజా సంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పాదయాత్రను గుర్తు చేసుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. వరుసగా ప్రతి ఎన్నికల్లో ప్రజల అపూర్వ ఆదరణతో సీఎం జగన్ పాలన జనరంజకంగా సాగుతోందని సజ్జల పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి అధికారం చేపట్టేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐదేళ్ల పాటు పూర్తిగా అధికారంలో కొనసాగి వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని మరోసారి అధికారంలోకి వస్తామన్నారు.

చిరస్థాయిగా నిలుస్తుంది..


పాదయాత్ర సందర్భంగా దాదాపు 2 కోట్ల మంది నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకున్న సమస్యలను మేనిఫెస్టోలో పొందుపరిచామని మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నియుగాలు గడిచినా వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చిరస్థాయిగా నిలుస్తుందని ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. మరో 30 ఏళ్ల పాటు ప్రజలు వైఎస్ జగన్‌ను సీఎంగా గెలిపిస్తూనే ఉంటారన్నారు. వైఎస్ జగన్ నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్ర దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలుస్తుందని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చేర్చిన ప్రతి అంశాన్ని పాదయాత్రలో ఎదురైన అనుభవాలు, ప్రజల కష్ట నష్టాలను తెలుసుకుని పొందుపరిచారని తెలిపారు. తొలుత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం సజ్జల, ఉమ్మారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, పార్టీ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గంజి చిరంజీవి, ఎం.మనోహర్‌రెడ్డి, పానుగంటి చైతన్య, ఈద రాజశేఖర్‌రెడ్డి, బొప్పన భవకుమార్, బందేల కిరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, నందిగం సురేష్ తదితరులు

వైజాగ్ టు హైదరాబాద్

- మరో రెండు ఎయిర్ ఏసియా ఫ్లైట్లు
- ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం–హైదరాబాద్‌ల మధ్య మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఎయిర్ ఏసియా సంస్థ వీటిని రోజుకు రెండు సర్వీసులు చొప్పున నడపనుంది. ఫిబ్రవరి 13 నుంచి ఒకటి, మార్చి మూడో తేదీ నుంచి మరొక విమాన సర్వీసును ప్రారంభించనుంది. ఫిబ్రవరి 13న ప్రారంభమయ్యే మొదటి విమానం ఉదయం 7.55 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 8.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరిగి ఈ విమానం 9.15 గంటలకు బయల్దేరి 10.30 గంటలకు చేరుతుంది. అలాగే మార్చి 3వ తేదీ నుంచి నడిచే మరో విమానం విశాఖలో సాయంత్రం 3.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.40 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. అదే విమానం సాయంత్రం 5.15 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 6.10 గంటలకు విశాఖ వస్తుంది.

విశాఖ–సికింద్రాబాద్ మధ్య సంక్రాంతి స్పెషల్స్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు విశాఖపట్నం–సికింద్రాబాద్ మధ్య పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–సికింద్రాబాద్ (08505) సంక్రాంతి స్పెషల్ విశాఖలో ఈనెల 11,13,16 తేదీల్లో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో ఈనెల 12,14,17 తేదీల్లో రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఇరు మార్గాల్లో దువ్వాడ, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, కాజీపేట, జనగాం స్టేషన్‌లలో ఆగుతాయి. ఈ రైళ్లు 4–సెకండ్ ఏసీ, 12–థర్డ్ ఏసీ, 1–సెకండ్ క్లాస్ కమ్ లగేజీ కమ్ దివ్యాంగులు, 1–జనరేటర్ మోటార్‌కార్ కోచ్‌లతో ప్రయాణిస్తాయి.

బాబు భుజం కాయడమే
పవన్ అజెండా

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: రాజకీయంగా రోజురోజుకూ పతనమవుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును నిలబెట్టడమే అజెండాగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. జనసేన ఆవిర్భావం జరిగిన 2014 నుంచే వారిద్దరూ కలిసే ఉన్నట్లు తాము ఆది నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు. 'చంద్రబాబు ఎప్పుడు ఇబ్బందుల్లో ఉంటే అప్పుడు పవన్ రక్షించడానికి వస్తాడు. ప్యాకేజీ తీసుకుని పరిమితంగా రాజకీయాలు చేస్తుంటాడు. ఇందులో భాగంగానే కొన్నిసార్లు కలసి ఉంటాడు. కొన్నిసార్లు విడిపోయినట్లు నటిస్తుంటాడు' అని ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.

అపవిత్ర కలయికను సమర్థించుకునేందుకే

- తమ అపవిత్ర కలయికను సమర్థించుకునేందుకు పరస్పర పరామర్శలు, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో చంద్రబాబు, పవన్ డ్రామాలాడుతున్నారు. ప్రజల పట్ల పవన్‌కు నిజంగానే ప్రేమ ఉంటే చంద్రబాబు ప్రచార పిచ్చికి బలైన 11 బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించ లేదు? రాజకీయాల్లో పొత్తులు తప్పు కాకున్నా వాటిని బహిర్గతం చేసి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత పార్టీలపై ఉంది.
- ప్రచార పిచ్చితో ఇరుకు సందుల్లో సభలు నిర్వహించి చింతపండు, చీరలు ఇస్తామంటూ 11 మంది పేదలను చంద్రబాబు పొట్టన పెట్టుకోవడం వల్లే ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేలా జీవో 1 జారీ చేశాం.
- వెంటిలేటర్‌పై ఉన్న టీడీపీని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం చేస్తున్నారు. ప్రజాబలంతో తిరుగులేని నేతగా ఎదిగిన సీఎం జగన్‌ను ఎదుర్కొనేందుకు కుట్రదారులంతా ఏకమవుతున్నారు. పవన్, చంద్రబాబు కలయికను స్వాగతిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.. బీజేపీ కూడా వారితో కలిసొస్తే ఏం సమాధానం చెబుతారు? సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న ప్రజాబలం ముందు ఎవరూ నిలవలేరు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ఘన విజయం సాధించడం ఖాయం. సీఎం జగన్ షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్తారు.

ఓఎస్‌ఆర్టీసీకి సహకారం

- ఒడిశా ఆర్టీసీతో ఏపీఎస్‌ఆర్టీసీ ఒప్పందం
- ట్రాఫిక్, లాజిస్టిక్స్, బస్సుల నిర్వహణల్లో శిక్షణ
- ఈనెల 25 తర్వాత ఆ రాష్ట్రానికి ఆర్టీసీ అధికారులు





సాక్షి, విశాఖపట్నం: మెరుగైన ప్రయాణికుల రవాణా వ్యవస్థతో దేశంలోనే గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) పనితీరు పొరుగు రాష్ట్రాలను ఆకర్షిస్తోంది. మన ఆర్టీసీ మెరుగైన పనితీరు, సాధిస్తున్న ప్రగతి, బస్సుల నిర్వహణ, మానవ వనరులు, ఇక్కడున్న మౌలిక సదుపాయాలు వంటివి ఇందుకు దోహదం చేస్తోంది. వీటికి ఆకర్షితులైన ఒడిశా స్టేట్ రోడ్డు రవాణా సంస్థ (ఓఎస్‌ఆర్టీసీ) తాజాగా ఏపీఎస్ ఆర్టీసీతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఇందులోభాగంగా ఏపీఎస్‌ఆర్టీసీ సమర్థవంతంగా నిర్వహిస్తున్న హెచ్‌ఆర్ (మానవ వనరులు), తక్కువ మైలేజీతో బస్సులు నడపడం, తక్కువ నిర్వహణ వ్యయం తీరుతెన్నులు, ఏపీఎస్‌ఆర్టీసీ కార్యకలాపాలు, బస్సుల నిర్వహణ, పర్సనల్ మేనేజ్‌మెంట్, టీమ్ వర్కు, అకౌంట్స్, లాజిస్టిక్స్, స్టోర్స్ తదితర అంశాలపై ఓఎస్‌ఆర్టీసీ అధికారులకు మన ఆర్టీసీ అధికారులు శిక్షణ ఇస్తారు. 40 రోజులపాటు వీరికి శిక్షణ ఉంటుంది. అంతేకాదు.. ఒడిశా ఆర్టీసీ బస్సులకు విజయనగరంలో ఉన్న జోనల్ వర్క్‌షాపులో బస్సుల బాడీ బిల్డింగ్, అరిగిన బస్సు టైర్ల రీట్రేడింగ్ (రీబటన్)తో పాటు గ్యారేజీ వర్కులను కూడా చేపడతారు. ఓఎస్‌ఆర్టీసీ మునుపటికంటే తమ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుకుంటోంది. ఫలితంగా వాటి నిర్వహణకు మౌలిక సదుపాయాల కల్పన ఆర్థికంగా భారమవుతుంది. ఇప్పటికే సమర్థవంతమైన ఈ వ్యవస్థ మన ఆర్టీసీకి ఉండడంతో ఒడిశా బస్సుల నిర్వహణ వ్యయం తగ్గుతుంది. వీటన్నిటికీ ఓఎస్‌ఆర్టీసీ.. ఏపీఎస్‌ఆర్టీసీకి కొంత మొత్తం చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇది ఏపీఎస్‌ఆర్టీసీకి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది. మరోవైపు పరస్పర సహకారంతో కార్గో (లాజిస్టిక్స్) రవాణా కూడా చేపట్టాలని నిర్ణయించారు. మన ఆర్టీసీ బుక్ చేసిన సరకులను ఓఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనూ, వాళ్లు బుక్ చేసిన కార్గోను ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనూ రవాణా చేసేలా పరస్పర అవగాహన కుదుర్చుకున్నారు.

వర్క్ కల్చర్‌పై కూడా..

ప్రధానంగా మన ఆర్టీసీ వర్క్ కల్చర్‌ను తమ సిబ్బందికి నేర్పమని ఓఎస్‌ఆర్టీసీ యాజమాన్యం కోరింది. దీంతో జోన్–1 (ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని) ఆర్టీసీ ఉన్నతాధికారులు అందుకవసరమైన చర్యలు చేపట్టారు. ఓఎస్‌ఆర్టీసీ పర్సనల్ విభాగానికి చెందిన ఉన్నతాధికారి దుర్గామాధవ్ మహాపాత్ర నేతృత్వంలోని 17 మంది సీనియర్ అధికారులు సోమవారం వచ్చారు. వీరికి విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, ఎస్‌టీసీ ప్రిన్సిపాల్ సుధాబిందు సారథ్యంలో 40 రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. అదే సమయంలో డిపోలు, వర్క్‌షాపుల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తూ అన్ని యూనిట్లను చూపిస్తారు.

త్వరలో ఒడిశాకు వెళ్తాం..

ఏపీఎస్‌ఆర్టీసీ పనితీరుకు ఓఎస్‌ఆర్టీసీ ఆకర్షితులైంది. మన ఆర్టీసీకున్న వనరులను వినియోగించుకోవడంతో పాటు ఒడిశా ఆర్టీసీ అధికారులకు వివిధ అంశాలపై శిక్షణ కూడా ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. తాజాగా వారికి విజయనగరం జోనల్ స్టాఫ్ కాలేజీలో శిక్షణ కూడా ప్రారంభమైంది. మూడు నెలల్లో మరో బ్యాచ్‌కు శిక్షణకు ఇస్తాం. ఈనెల 25 తర్వాత ఆర్టీసీ చీఫ్ మేనేజర్, వర్క్స్ మేనేజర్‌తో కలిసి ఒడిశాకు వెళ్తాం. ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి పొందే సేవలకు చెల్లింపులు, పరస్పరం కార్గో రవాణా సంబంధించిన అంశాలపై ఓఎస్‌ఆర్టీసీ అధికారులతో చర్చిస్తాం. – చింతా రవికుమార్, జోన్–1, ఈడీ

> స్త్రీ నించి పొందే ఆనందాన్ని ఆకాశపు నీలత్వంలోంచి,
> నీళ్ల చల్లదనంలోంచి, గడ్డి మెత్తదనంలోంచి,
> పువ్వుల మెరుగులోంచి పొందాలి. ఇవన్నీ స్త్రీ ఇచ్చేటంత ఆనందాన్ని ఇవ్వాలి.
>
> – చలం

సాక్షి

మంగళవారం, జనవరి, 10


ఎవరి పాపం ఇది?!

అది సాక్షాత్తూ శంకరాచార్యుడు నడయాడిన నేల. ఆయన ప్రవచనాలు విని పులకించిన పుణ్య భూమి. ఆయన చేతుల మీదుగా దేశంలో ఏర్పాటైన నాలుగు ప్రధాన పీఠాల్లో ఒకటైన జ్యోతిర్మఠం ఇక్కడిదే. ఈ పట్టణం పేరు దాన్నుంచే వచ్చింది. హిరణ్యకశిపుడిని వధించిన ఉగ్ర నరసింహుడు శాంతమూర్తిగా మారింది ఈ ప్రదేశంలోనేనని వ్యాస విరచిత స్కంధపురాణం అంటుంది. నిత్యం వేలాదిమంది భక్తులతో కిటకిటలాడే పుణ్యక్షేత్రాల్లో ఇదొకటి. ఇక్కడి ఎత్తయిన హిమవన్నగాలు, దట్టమైన అడవులు, నిత్యం గలగలపారే హిమానీ నదాలను వీక్షించటానికి వచ్చే పర్యాటకులు కూడా తక్కువేమీ కాదు. పైగా చైనా సరిహద్దును ఆనుకునివున్న ప్రాంతంగనుక వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. హిమశిఖరాల అధిరోహణకు తరలివెళ్లే బృందాలు ఈ ప్రాంతం మీదుగానే సాగుతాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఇంతటి ఘనమైన పౌరాణిక, చారిత్రక, పర్యాటక ప్రదేశమైన జోషిమఠ్‌కు సంబంధించి కొన్ని వారాలుగా వెలువడుతున్న వార్తలు హడలెత్తిస్తున్నాయి. అక్కడి నివాస గృహాలు ఉన్నట్టుండి బీటలు వారుతుండటం, నేల నెర్రెలుబారడం స్థానికులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. జోషిమఠ్ ఉన్న చమోలీ జిల్లాలోనే కర్ణప్రయాగ్, గోపేశ్వర్ పట్టణాలు... తెహ్రీ జిల్లాలోని ఘన్సాలీ, పిథోర్‌గఢ్ జిల్లా మున్సియారి, ధార్చులా... ఉత్తరకాశీ జిల్లా భట్వారీ... ఇంకా పౌరీ, నైనిటాల్ తదితర పట్టణాలకు సైతం ఇలాంటి ముప్పే పొంచివున్నదని నిపుణులంటున్న మాట.

ఇది ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చిన ముప్పు కాదు. గత కొన్ని దశాబ్దాలుగా మనుషులు చేసిన, చేస్తున్న పాపాల పర్యవసానమే ఈ ఉత్పాతం. లాభార్జన తప్ప మరేమీ పట్టని కార్పొరేట్ సంస్థలు, అక్రమార్జనకు అలవాటుపడిన నేతలు ఏకమై ప్రకృతి వనరులను దోచుకు తింటున్నారన్న ఏకైక కారణంతో ఉమ్మడి ఉత్తరప్రదేశ్‌లో ఉత్తరాఖండ్ వాసులు సుదీర్ఘకాలం పోరాటాలు చేశారు. అవి కొన్నిసార్లు హింసాయుత రూపం కూడా తీసుకున్నాయి. వృక్షాలను హత్తుకునే అహింసాయుత చిప్కో ఉద్యమం పురుడుపోసుకున్నది ఈ నేలపైనే. తమ జీవనాధారమైన అడవులను నేలమట్టం చేస్తున్న తీరుపై 1973లో వేలాదిమంది గ్రామీణులు సుందర్‌లాల్ బహుగుణ నేతృత్వంలో ప్రారంభించిన ఈ ఉద్యమం దీర్ఘకాలం ప్రభావవంతంగా కొనసాగడంలో మహిళల పాత్ర ప్రధానమైనది. అనంతరకాలంలో ప్రపంచ పర్యావరణ ఉద్యమాలకు ఊపిరులూదిందీ, ప్రేరణగా నిలిచిందీ చిప్కో ఉద్యమమే. తెహ్రీ డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కూడా ఎన్నో ఉద్యమాలు సాగాయి. స్థానిక వనరులపై సంపూర్ణావగాహనగల తమ ప్రాంతంవారు పాలకులైతే తప్ప ఈ దోపిడీనీ, ఈ అరాచకాన్నీ నివారించలేమన్న భావనతో స్థానికులు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన పర్యవసానంగానే... వారి త్యాగాల ఫలితంగానే 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్ ఆవిర్భవించింది. కానీ గత రెండు దశాబ్దాలుగా జరిగిందంతా వేరు. బలమైన నాయకత్వం కొరవడి రాష్ట్రం అస్థిరత్వంలోకి జారుకుంది. రాష్ట్రం 13 మంది ముఖ్యమంత్రులను, రెండు దఫాలు రాష్ట్రపతి పాలన చవిచూసిందంటే పార్టీలకు అతీతంగా నాయకగణం ఎలా భ్రష్టుపట్టిపోయిందో అర్థమవుతుంది. అభివృద్ధి పేరుతో నిర్మించిన జలవిద్యుత్ ప్రాజెక్టులు, బహుళ అంతస్తుల భవంతులు, కొండల్ని పిండిచేసి నిర్మించే రహదారులు, సొరంగాలు అక్కడి పర్యావరణ సమతౌల్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. అడవుల విధ్వంసం సరేసరి. ఎన్నడో 1976లోనే ఎంసీ మిశ్రా కమిషన్ ఈ ప్రాంత ప్రత్యేక భౌగోళిక స్థితిపై నివేదిక వెలువరించింది. జోషిమఠ్ భూగర్భంలోని అంతర్వాహినులవల్ల ఈ నేలకు కుంగిపోయే గుణమున్నదని హెచ్చరించింది. విన్నవారేరి? దశాబ్దాలుగా అన్ని హెచ్చరికలనూ పాలకులు పెడచెవిన పెట్టి అభివృద్ధి మంత్రం జపించిన పర్యవసానంగా అక్కడి ప్రజానీకం భయం గుప్పెట్లో బతుకులీడుస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగిస్తున్న నిర్మాణాల తీరుతెన్నులు చూస్తే భయాందోళనలు కలుగుతాయి. ఆసియాలో అతిపెద్దదైన, దీర్ఘమైన రోప్‌వే ప్రాజెక్టు నిర్మాణం ఇక్కడిదే. 420 మెగావాట్ల విష్ణుప్రయాగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీకి చెందిన 520 మెగావాట్ల తపోవన్ జలవిద్యుత్ ప్రాజెక్టులతోపాటు చార్‌ధామ్ ప్రాజెక్టు పేరిట విశాలమైన రహదారులు, సొరంగాలు నిర్మాణమవుతున్నాయి. ఇవన్నీ నదీప్రవాహాలకు ఆటంకమవుతుంటే అవి తమ దోవ తాము వెదుక్కుంటున్నాయి. ఇక వలసలతో నానాటికీ పెరుగుతున్న జనాభా సంగతి సరేసరి. ఈ ప్రాంతం భూకంప జోన్‌లో ఉన్నదన్న జ్ఞానం కూడా పాలకులకు కొరవడింది.

మనిషి మనుగడకు ప్రకృతి వనరుల వినియోగం తప్పనిసరే. అందువల్ల సహజమైన సమతుల్యత ఏదోమేరకు దెబ్బతినడం కూడా అనివార్యమే. కానీ దాన్ని కనిష్ట స్థాయిలో ఉంచటం, మరీ ముఖ్యంగా ఎంతో సున్నితమైన హిమవత్పర్వత ప్రాంతంలో ప్రకృతిపట్ల భయభక్తులతో మెలగటం అవసరం. కార్పొరేట్ సంస్థల దురాశకూ, కాంట్రాక్టర్ల లాభార్జనకూ, స్వీయప్రయోజనాల రక్షణకూ యథేచ్ఛగా పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటే ఏమవుతుందో జోషిమఠ్ ఉత్పాతం తెలియజెబుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అభివృద్ధి పేరిట సాగిస్తున్న నిర్మాణాలే ప్రస్తుత దుస్థితికి కారణమని జోషిమఠ్ పీఠాధిపతి స్వామి అవిముక్తేశ్వరానంద్ చేసిన ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఇప్పటికైనా పాలకులు మేల్కొనాలి. పరిస్థితులు చేయిదాటిపోకుండా తక్షణ చర్యలకు ఉపక్రమించాలి. ఉత్తరాఖండ్ భౌగోళిక స్థితిగతుల ఆధారంగా పకడ్బందీ మాస్టర్‌ప్లాన్ రూపొందించి, అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలి.

లోహియా లోకదర్శన సులోచనాలు!



తెలుగువారికి రామమనోహర్ లోహియా ఒక భారత సామ్యవాద నాయక శిరోమణిగానే తెలుసు. హిందూమతం పైనా, పురాణ గాథల పైనా ఆయన చేసిన ప్రగాఢ పరిశోధనలూ, ఆలోచనలూ మనకు దూరంగానే ఉండిపోయాయి. లోహియా ఇతిహాస వ్యాసాల పుస్తకం ఆయనలోని ఈ కోణాన్ని చేరువ చేస్తుంది. పురాణ పాత్రల మీద వెలుగు అన్నట్టేగానీ, ఆ పేరుతో అనేక రాజకీయ, సామాజిక, చారిత్రక సత్యాలు చాటారు. ఉత్తరాది వారు రావణ, కుంభకర్ణాదుల్ని దక్షిణాది వారిగా, రాక్షసులుగా చిత్రించి వధించే ధోరణిని తూర్పారబట్టారు. ఆయన దృష్టిలో శ్రీరాముడు ఉత్తర–దక్షిణ భారతదేశాల మధ్య ఐకమత్యానికి ప్రతీక కాగా, శ్రీకృష్ణుడు తూర్పు–పడమరల ఏకత్వానికి ప్రతీక.

ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

> ''నాకు అవకాశం దొరకాలే గానీ ఈ భూమండలం సహా, యావత్తు గ్రహరాశిని సొంతం చేసుకొని ఏలుబడిలోకి తెచ్చుకొంటాను.''
>
> – భూస్వామ్య వ్యవస్థలో కూలి నాలి చేసుకొని బతికే శ్రమజీవుల కాయకష్టానికి విలువ కట్టిన ప్రసిద్ధ ఆర్థికవేత్త రికార్డో ప్రకటన.

పరాయి వలస పాలనకు వ్యతిరేకంగా అసమాన త్యాగాలతో పోరాడి దాన్నుంచి విముక్తి సాధించుకున్నారు వివిధ ఖండాల ప్రజలు. అయితే విమోచన తరువాత కూడా (స్వతంత్ర భారతం సహా) స్థానిక పాలకుల స్వార్థ ప్రయోజనాల వల్ల దోపిడీ వ్యవస్థలో మౌలికమైన మార్పు రాలేదు. ఈ సత్యాన్ని చాటినవారు భారత స్వాతంత్ర్య పోరాటంలో తలమునకలై తన సమకాలీన రాజకీయ సహచరుల పోకడలనూ, సైద్ధాంతిక రంగంలో ఆటుపోట్లనూ దగ్గరుండి గమనించిన రామమనోహర్ లోహియా. ఇటీవల లోహియా ఇతిహాస వ్యాసాల పేరిట 'పురాణ పాత్రలపై కొత్త వెలుగు' మకుటంతో లోహియా సమతా ట్రస్ట్ నిర్వాహకులు, నిరంతర అధ్యయనశీలి రావెల సోమయ్య ఒక ఉత్తమ సంకలన గ్రంథాన్ని ప్రచురించారు. రిషితుల్యుడు, ఆసియాలో తొలి సామ్యవాదిగా పేరెన్నికగన్న స్వామి వివేకానందకు ఈ సంపుటిని అంకితమిచ్చారు.

పేరుకు 'పురాణ పాత్ర'లపై ప్రసరించిన కొత్త వెలుగే. కానీ దాని చాటున అనేక రాజకీయ, సామాజిక, చారిత్రక సత్యాలు ఉన్నాయి. ఇంతవరకూ తెలుగువారికి లోహియా ఒక భారత సామ్యవాద నాయక శిరోమణిగానే తెలుసు. హిందూమతం పైనా, పురాణ గాథల పైనా ఆయన చేసిన ప్రగాఢ పరిశోధనలూ, ఆలోచనలూ హిందీ భాషా ప్రియులకు మాత్రమే లభ్యమవుతూ వచ్చాయి. ఆ లోటు ప్రస్తుత తెలుగు సంకలనంతో కొంతవరకు తీరుతుంది.

పురాణ పాత్రల ప్రస్తావనలో కూడా లోహియా ఆధారపడింది 'రొడ్డ కొట్టుడు' సరుకు మీద కాదు. ఎకాఎకిని ఏ మహోన్నతుని భావదీప్తిని అందిపుచ్చుకోవాలో సరిగ్గా ఆ ఉద్దండుని 'సహవాసాన్నే' లోహియా కోరుకున్నాడు. 'అవధి' అనే స్థానిక ప్రజల భాషకు వ్యతిరేకులైన సంస్కృత ఛాందసుల ఆగడాలను అతి కష్టం మీద వ్యతిరేకించి నిలబడిన పండిత తులసీదాస్ రామాయణ రచనను ప్రేమించినవాడు లోహియా! స్థానిక భాష 'అవధి'లో రచించిన రామాయణాన్ని కాపాడుకోవడానికి తులసీదాస్ పడిన కష్టాలు వర్ణనాతీతం. ఆ సమయంలో తులసీదాస్ గ్రంథాన్ని భద్రంగా కాపాడిన వ్యక్తి ముస్లిం సోదరుడు. రామలీల ఉత్సవాల్ని జరిపే ఉత్తరాది వారు రావణ, కుంభకర్ణాదుల్ని దక్షిణాది వారిగా, రాక్షసులుగా చిత్రించి వధించే ధోరణిని తూర్పారబట్టినవాడు లోహియా. ఆయన దృష్టిలో శ్రీరాముడు ఉత్తర–దక్షిణ భారతదేశాల మధ్య ఐకమత్యానికి ప్రతీక కాగా, శ్రీకృష్ణుడు తూర్పు–పడమరల ఏకత్వానికి ప్రతీక.

ఛాందసుల మాటేమోగానీ, లోహియాకు మాత్రం హిందూ

రెండో మాట

మతంలోనే లోపాయికారిగా పాతుకుపోయిన రాజకీయ దూరదృష్టి ఆశ్చర్యం కల్గించింది. ఎందుకంటే, లోహియా భావనలో మతం, రాజనీతి పరిధులు, ఆశయాలు, వాటి పాటింపు వేరువేరుగా ఉంటాయి. కాబట్టి వాటిని కలపకూడదు. ఎందుకని? ''మతం దీర్ఘకాలం ఉండే రాజనీతి కాగా, రాజనీతి అనేది కొంతకాలం మాత్రమే సాగే మతం''! మతం, రాజనీతుల్లో వివేకం లేకుంటే అవి రెండూ కలిసిపోయినప్పుడు దేశం నాశనమవుతుం దన్నాడు లోహియా! ''రాజకీయ క్షేత్రంలో మతం చొరబడిపోయి దేశంలో ఎంత ఉద్వేగం, ఉద్రేకం, హింస, ద్వేషాలు ప్రబలిపోతు న్నాయో నేను కళ్లారా చూస్తున్నాను. దేశంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే మత కార్యకలాపాల్ని అరికట్టక తప్పదు''!

చరిత్రకారుడు విల్ డ్యూరాంట్ తన 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ'లో సోషలిస్టు, క్యాపిటలిస్టు పరిణామ దశల గురించి వెలిబుచ్చిన భావాలతో లోహియా ఏకీభవిస్తున్నట్టు కన్పిస్తుంది: ''పెట్టుబడిదారీ విధాన వ్యాప్తి గురించిన భీతితో సోషలిజం తన స్వేచ్ఛా పరిధిని విస్తృతం చేసుకొనక తప్పని స్థితి ఏర్పడినట్టే, సోషలిస్టు వ్యవస్థ విస్తృతిని గమనించి పెట్టుబడీదారీ వ్యవస్థ కూడా తన సమానత్వ పరిధిని విస్తృత పరుచుకొనక తప్పలేదు. ఫలితంగా రెండు విభిన్న ధృవాలూ త్వరలో ఏకమయ్యే పరిస్థితి ఉత్పన్నం కావొచ్చు''!

సోషలిజానికి శాశ్వత నిర్వచనాలుండవు, దాని నిత్య పరిణామంలో కొత్తగా అన్వేషిస్తూ ఉండవలసిందేనని లోహియా భావన. అంతేగాదు, మన తెలుగు భాషకు లోహియా అర్థవంతమైన భాష్యం కూడా చెప్పడం విశేషం! ''తెలుగు భాషలో 'ఉ'కారాంత పదాలు తరచుగా దొరకడానికీ, తులసీదాస్ రాసిన 'అవధి' భాషలోనూ, తులసీ రామాయణంలోనూ ఈ 'ఉ'కారాంత పదాలు ఎక్కువగా ఉండటాన్నీ లోహియా పేర్కొంటాడు. పదాల చివర్లో 'ఉ' కలిపితే పదానికి తీపిదనం ఎక్కువవుతుందనీ, ఈ పద మాధుర్యం వెనుక విజయపురిని పాలించిన ఇక్ష్వాకు రాజుల భాషా ప్రభావం ఉండి ఉండవచ్చనీ, ఈ కారణం వల్లనే ఆంధ్రప్రదేశ్ నుంచి 'ఉ' అయోధ్యకు చేరిందో, లేదా అయోధ్య నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిందో తాను చెప్పలేననీ, కానీ, అవధి, తెలుగు భాషా పదాల పరస్పర వాడకం నిజంగా జరిగిందా అని మాత్రం తెలుసుకోవడం తనకిష్టమనీ అంటాడు. దీనివల్లే లోహియా అనేక ప్రాంతీయ భాషా శాసనాలను ఆసక్తితో చూడటం విశేషం.

కానీ ఒక్క అనుమానం – ఎన్నో విషయాలపైన ఇంతగా సాధికార వ్యాఖ్యలు అందించగల్గిన లోహియాకు క్రీస్తుపూర్వం 2100 సంవత్సరం నాటికే సుమేరియా నాగరికత సంపన్న పాలకుల ఆస్తిపాస్తులను, సేద్య యోగ్యమైన భూసంపదను ఎలా, ఏ పద్ధతుల ద్వారా పేద ప్రజలకు పంచి దుర్భిక్ష పరిస్థితులు తలెత్తకుండా చేయగలిగిందో అవగాహన లేకపోవడం ఒక మహా సోషలిస్టు నాయకుడిలో లోపంగా భావించవచ్చా?! ఎందుకంటే, అమెరికన్ మహా కోటీశ్వరుల్లో బలవంతుడైన రాక్‌ఫెల్లర్ కొడుకు జాన్ డి. రాక్‌ఫెల్లర్ అమెరికాలోని ఘరానా ప్రయివేట్ ట్రస్ట్ కంపెనీల గురించి ప్రస్తావిస్తూ ఓ గొప్ప నిజాన్ని బహిర్గతం చేశాడు: ''అందమైన అమెరికన్ గులాబీ రోజాను దాని అందచందాలతో, మధుర సువాసనలతో పెంచడం మహా సులభమే. కానీ ఎలా? ఈ పెద్ద గులాబీని ఆసరా చేసుకొని దాని చుట్టూ మొగ్గ తొడుగుతూన్న చిన్న గులాబీలను కాస్తా తుంచి పారేయడం ద్వారా. ఆ పద్ధతిలో ఎదిగినవే అమెరికన్ ట్రస్టు కంపెనీలన్నీ.'' జూనియర్ రాక్‌ఫెల్లర్ మార్క్సిజం పరీక్షకు తనను తాను గురి చేసుకొన్నాడో లేదో తెలియదుగానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే అసమ సామాజిక, అరాచక పరిస్థితులను బలైపోయిన శిశు 'రోజా' ఉదాహరణ ద్వారా బహిర్గతం చేయగలిగాడు.

నూరేళ్ల క్రితమే ఇంగ్లండ్ మహాకవి షెల్లీ 'ఇంగ్లండ్ ప్రజలకు విన్నపం' పేరిట ఇచ్చిన సందేశం విశ్వగీతికగా మార్మోగిపోయింది. పారిశ్రామిక విప్లవానంతరం పెట్టుబడిదారీ విధాన ఫలితాల వల్ల కష్టజీవులైన కార్మిక కుటుంబాలు అనుభవిస్తున్న వ్యథలను గమనించి, ఆ కష్టాలకు కర్మ సాక్షిగా ఆయన నిలబడ్డాడు.

''కష్ట జీవులారా! మీరు నాటే విత్తనాన్ని మరొకడు
అనుభవిస్తున్నాడు,
నీవు సృష్టించే సమాజ సంపదను మరొకడెవడో దొంగిలిస్తున్నాడు,
నీవు నేసే బట్టలను మరొకడెవడో ధరిస్తున్నాడు,
నీవు సృష్టించే ఆయుధాల్ని మరొకడు ధరిస్తున్నాడు.
విత్తనం నువ్వే నాటు, కానీ నియంతకు అందనివ్వకు,
సంపదను సృష్టించు, కానీ దుర్మార్గ పాలకుడికి అందనివ్వకు,
దుస్తులు కుట్టు, కానీ సోమరిపోతుకు అందనివ్వకు
ఆయుధాలు తయారుచెయ్యి, కానీ వాటిని నీ రక్షణకే
ఉపయోగించు.''

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అలా ఎందుకు?



ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ అంశం హిందుత్వ వర్సెస్ ముస్లింలు కాదు. ఆ ప్రాంతంలో 9 ఆలయాలు ఉన్నాయి. దాన్ని మానవత్వపు అంశంగా ఎత్తవచ్చు. కానీ కొన్ని శక్తులు మత–కార్డును వాడాయి. 2021లో పది వేల ఇళ్లను కూల్చడానికి సంబంధించిన ఉత్తర్వులకు సంబంధించి హరియాణాలోని కోఢ్రీ గావ్ కేసులో ఇదే సుప్రీంకోర్టు వారికి అనుకూల తీర్పు ఇవ్వలేదు. – జాహక్ తన్వీర్, కాలమిస్ట్

దిద్దుకుందాం



ఇండియాలో మంచి నాణ్యమైన గోధుమ పిండి 39 రూపాయలకు దొరుకుతోంది. డాలర్ మూల్యసామ్యం (పారిటీ)తో లెక్కగట్టినా పాకిస్తాన్‌లో అది అత్యంత ఖరీదే. మనం విఫలమయ్యామని ఒప్పుకోవడంలో ఏ చెడూ లేదు. ముందంటూ ఈ నిరాకరణ మైండ్‌సెట్‌లోంచి బయటపడితేనే మనం ఏవైనా దిద్దుబాటు చర్యలు చేపట్టగలం. – సయ్యద్ షబ్బార్ జైదీ, పాక్ మాజీ మంత్రి

చేయకూడనిది



తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి తన శాసనసభ ప్రారంభోపన్యాసంలో – రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పాఠంలోని పెరియార్, అంబేడ్కర్, అన్నా, కలైంజ్ఞర్ భాగాలను వదిలేసి తన సొంత పాఠాంతరాలను కలిపారు. ఆయన అలా చేయకూడదు. ఇది రాజ్యాంగ విరుద్ధం. – దిలీప్ మండల్, జర్నలిస్ట్

తప్పించుకుంటున్నారా?



నిజంగానే వాళ్ల ఉత్పత్తులు 'సురక్షితం, ప్రభావవంతం' అయితే ఫైజర్, మోడెర్నా కంపెనీల్లోని చాలా మంది అధికారులు ఎందుకు ఉన్నట్టుండి మానేస్తున్నారు? ఊరికే అడుగుతున్నా. – ఆండ్రూ బ్రిడ్జెన్, ఇంగ్లండ్ ఎంపీ

అన్యాయం



ఫ్రాన్సులో ప్రతి యేటా 'నియంత్రణల' పేరుతో సుమారు ఆరు లక్షల అడవి పందు లను సంహరిస్తున్నారు. అంటే, ఒక రోజుకు సుమారు 1,600 చొప్పున. – డెబ్బీ బ్యాంక్స్, యాక్టివిస్ట్

బహుముఖ ప్రజ్ఞాశాలి

ఆధునికాంధ్ర సాహిత్యంలో సుప్రసిద్ధ కవి, ఆచార్యుడు, నటుడు, విమర్శకుడు, ఆకాశవాణి కార్యక్రమాల సలహాదారు ఆయన. అష్టదిగ్గజ కవుల్లో పింగళి సూరన వంశానికి చెందిన పింగళి లక్ష్మీ కాంతం బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన 1894 జనవరి 10వ తేదీన కృష్ణాజిల్లా అర్తమూరులో జన్మించారు. పాఠశాల విద్య మచిలీపట్నం హిందూ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. అప్పుడు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి అక్కడ తెలుగు పండితుడుగా ఉన్నారు. పింగళి, విశ్వనాథ వంటి వారంతా చెళ్లపిళ్ల వారి శిష్యులే.

బందర్ నోబుల్ హైస్కూల్‌లో తెలుగు పండితుడిగా పింగళి కొన్నాళ్లు పనిచేశారు. తర్వాత మద్రాస్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో పరిశోధకుడిగా పనిచేశారు. 1931లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఏ ఆనర్స్ కోర్సు ప్రారంభించి పాఠ్య ప్రణాళికను రూపొందించారు. అన్ని విశ్వవిద్యాలయాలకు అదే ప్రామాణికమైన పాఠ్యప్రణాళిక.

ఆయన ప్రియమిత్రుడు, సహాధ్యాయి కాటూరి వెంకటేశ్వర రావుతో కలసి తొలి రోజుల్లో శతావధానాలు చేశారు. ఇద్దరూ జంట కవులుగా రచించిన 'సౌందర నందం' కావ్యాన్ని తమ గురు వైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రికి అంకితం ఇచ్చారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆచార్యుడిగా 1961–65 మధ్య పని చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 18 సంవత్సరాలు పనిచేసి 1949లో పదవీ విరమణ చేశారు.



పింగళి లక్ష్మీకాంతం

ఆయన బోధనల నోట్సులు ఆంధ్ర సాహిత్య చరిత్ర, విమర్శకు ప్రామాణి కాలు. తర్వాత వాటిని ఆంధ్ర సాహిత్య చరిత్ర, సాహిత్య శిల్ప సమీక్షలుగా ఆయనే ప్రచురించారు. అవి ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఆయన రూపొందించిన సంస్కృత 'కుమార వ్యాకరణం' ఎన్నో విశ్వవిద్యాలయాల్లో పాఠ్య గ్రంథంగా ఉంది. ఆయన రేడియో ప్రసంగాలు, గౌతమ వ్యాసాలు విమర్శకు నిలువెత్తు నిదర్శనాలు. ఆయన రచించిన మధుర పండితరాజం, గంగాలహరి, తేజోలహరి ప్రసిద్ధి పొందాయి. ఆయన గౌతమ నిఘంటువు (ఇంగ్లీషు–తెలుగు) ప్రామాణికమైంది.

పింగళి 1954 నుండి 1961వరకు విజయవాడ ఆకాశవాణి కేంద్రం సలహాదారుడిగా గొప్ప కార్యక్రమాలు రూపొందించారు. నటుడిగా పాండవోద్యగ విజయాల్లో ధర్మరాజుగా, ముద్రారాక్షసం నాటకంలో రాక్షస మంత్రిగా ప్రేక్షకుల మన్ననలు పొందారు. పింగళివారు 1972 జనవరి 10 తేదీన పరమదించారు. సాహితీ ప్రియుల హృదయాల్లో ఆయన చిరస్మరణీయులు.

– డాక్టర్ పీవీ సుబ్బారావు, సాహితీ విమర్శకులు ı 98491 77594

(నేడు పింగళి లక్ష్మీకాంతం జయంతి, వర్ధంతి)

రోడ్ షోలు – పౌర హక్కులు – కోర్టు తీర్పులు

అభిప్రాయం



పి. విజయ బాబు

ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ షోలపై పరిమితులు విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం సహేతుకమైనదేనా? ఇది ఎమర్జెన్సీని తలపిస్తోందా? ఈ చర్య ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమేనా? ఈ జీఓ బ్రిటిష్ కాలం నాటిదా? మరి కోర్టు తీర్పులు ఈ అంశాలపై ఎలా ఉన్నాయి? రోడ్ షోలు, ర్యాలీల పేరుతో ఎక్కడపడితే అక్కడ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ, ప్రభుత్వాన్నీ, మంత్రులనూ అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్‌లో తూలనాడుతూ, చెప్పు చూపుతూ హెచ్చరికలు చేయడం, బూతులు తిట్టడం, 'వర్కవుట్' కాకపోతే ఎవరు ఎంత మందినైనా పెళ్లి చేసుకోవచ్చనే రీతిలో మాట్లాడటం, మంత్రులను బూతులతో సంబోధించడం... ఇవన్నీ చట్టబద్ధత కిందికే వస్తాయా? భావ ప్రకటన స్వేచ్ఛ ఆర్టికల్ 19(1)ఏ, ఆర్టికల్ 19(1)బీ కిందికి వస్తాయా? మరి న్యాయస్థానాల తీర్పులు ఏం చెబు తున్నాయి? ఒకసారి పరిశీలిద్దాం!

ఈ దేశంలో ఏ శాసనాలు అయినా, వాటిని అనుసరించి జారీ చేసే ఏ ఉత్తర్వులు అయినా భారత రాజ్యాంగం ప్రకారమే ఉంటాయి తప్ప... ఇతర దేశాలకు చెంది ఉండవు అనేది సగటు మనిషికి కూడా తెలుసు. భారత రాజ్యాంగ రూపకల్పనలో బ్రిటిష్, అమెరికా వంటి దేశాల రాజ్యాంగాల్లోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు వంటి అంశాలు కొన్ని అవసరమైన మార్పులతో స్వీకరించారు. ఆ విధంగా ఈ దేశంలో బ్రిటిష్ కాలం నాటి చట్టాలు ఎన్నో కొనసాగుతున్నాయి. ఇవి భారతదేశ చట్టాలు గానే పరిగణించాలి. అంతేకానీ వాటిని బ్రిటిష్ చట్టాలు అని ప్రచారం చేయడం ప్రజల్ని తప్పుదారి పట్టించడం అవుతుంది.

పౌరుల హక్కులను అతిక్రమించి రోడ్ షోలు, ర్యాలీలు నిర్వహిస్తున్నప్పుడు వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అనీ, మరీ ముఖ్యంగా పోలీసులదేననీ న్యాయస్థానాలు వివిధ కేసుల్లో తీర్పులు ఇచ్చాయి. ఉదాహరణకు కేరళ హైకోర్టులో 'పీపుల్స్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' కేసులో రోడ్ షోలపై దాఖలైన 'రిట్ ఆఫ్ మాండమస్'పై జస్టిస్ కె. బాలకృష్ణన్, జస్టిస్ పి. సుబ్రమణియన్, జస్టిస్ జె. కోషితో కూడిన త్రిసభ్య ధర్మాసనం సమగ్ర విచారణ జరిపి తీర్పునిచ్చింది.

ఈ విచారణలో కొన్ని ఇతర రాష్ట్రాల తీర్పులను కూడా ఉటంకించారు. కాగా కామేశ్వర ప్రసాద్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో, ప్రదర్శనలు– నినాదాలు కూడా భావ ప్రకటనా స్వేచ్ఛకిందికి వస్తాయా? అనే అంశంపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. డిమాన్‌స్ట్రేషన్‌కి సంబంధించి, భారత అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానాలను కూడా పేర్కొంది.



ఆ ప్రకారం చూస్తే, పవన్ కల్యాణ్ మంత్రులను గాడిదలని సంబోధించడం, చెప్పులు చూపుతూ హెచ్చరికలు చేయటం వంటివన్నీ ఆర్టికల్ 19(1)ఏ ఆర్టికల్ 19(1)బీకి విరుద్ధమైనవీ, శిక్షార్హమైనవీ.

ఇక కేసు విషయానికి వస్తే... వాహనదారులు, పాదచారులు సంచరించే ప్రధాన రహదారులపై రోడ్ షోలు, ర్యాలీలు అంటే పౌరుల హక్కులను కాలరాయడమే అనీ, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, బ్యాంకులు, వాణిజ్య సముదాయాలు, బస్సుస్టేషన్, రైల్వేస్టేషన్ వంటి ప్రదేశాలకు పౌరులు సంచరించకుండా చేయడం అంటే పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడమేననీ ధర్మాసనం పేర్కొంది. పౌరుల ఈ హక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వం మరీ ముఖ్యంగా పోలీసులదేననీ, ట్రాఫిక్‌ను నియంత్రించే హక్కు ఎవరికీ లేదు అని కోర్టు అభిప్రాయపడింది. సభను నిర్వహించుకునే హక్కు పార్టీలకు ఉన్నా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిం చటానికి వీలు లేదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ నిబంధనలు ఉల్లంఘించే వారు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 49, పోలీస్ యాక్ట్ సెక్షన్ 29 కింద శిక్షార్హులు. వీటిల్లో కవాతులు, ప్రదర్శనలు నియంత్రించే అధికారం పోలీసులకు ఉంది. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్తుల రక్షణ చట్టం(ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ) 1984, సబ్ సెక్షన్ 3 ప్రకారం, ఊరేగింపులు ప్రదర్శనల పేరుతో ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే, ఐదేళ్ల పాటు జైలు శిక్ష, జరిమానా ఉంటుంది.

ఈ వివరాలన్నీ ఉటంకిస్తూ, రోడ్ షోలు, ఊరేగింపులు, ప్రదర్శనలకు సంబంధించి ప్రభుత్వం పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలనీ, ఆ ప్రకారం కఠిన నిబంధనలను అమలు చేయాలనీ, లేదంటే పోలీసులకు కష్టసాధ్యమనీ కోర్ట్ అభిప్రాయపడింది. పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడినట్టే అని వ్యాఖ్యానించింది.

రోడ్ షోలు, ర్యాలీలు నిర్వహించదలచుకున్నవారు ముందుగా కనీసం ఆరు రోజుల ముందు పోలీసు అధికారుల అనుమతి పొందాలి. అనుమతి పొందినా రోడ్డు మొత్తం ఆక్రమించడానికి వీలు లేదు. ర్యాలీ ఏం జరుగుతున్నా ట్రాఫిక్‌కి అంతరాయం కలగకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవచ్చు. ఇందుకు సంబంధించి పోలీసులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం సర్క్యులర్లు జారీ చేయాలి. ర్యాలీలో పెద్ద పెద్ద బ్యానర్లు నిషిద్ధం. పోలీసులు బ్యానర్ సైజులు నియంత్రించాలి.

ఇదీ రోడ్ షోలు, ర్యాలీలకు సంబంధించి గౌరవ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు. మరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన జీవో గౌరవ న్యాయస్థానం తీర్పునకు లోబడి ఉందా? అప్రజాస్వామికంగా ఉందా? ప్రజాస్వామ్యవాదులు ఒకసారి ఆలోచించండి!!

వ్యాసకర్త కానిస్టిట్యూషన్ లా నిపుణులు

శుభస్య శీఘ్రం

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు ఒక ఫీల్డింగ్ శిక్షకుడున్నాడు. షేన్ మెక్ డెర్మాట్. ఈ మధ్య ఆయన ఒక చక్కని జీవిత సత్యం చెప్పాడు. 'ఆటగాడు కొట్టిన బంతి ఎంత ఎత్తుకు వెళితే, దాన్ని 'క్యాచ్' పట్టుకోవటానికి ఫీల్డరుకు అంత ఎక్కువ సమయం ఉంటుంది. కనక, అలాంటి 'క్యాచ్'లు తేలికగా పట్టు కోగలగాలి. కానీ అలాంటి 'క్యాచ్'లలో సగంపైన మా వాళ్ళు వదిలేస్తు న్నారు' అన్నాడు. దీనికి ఆయన ఒక్క మాటలో చెప్పిన కారణం: 'మనసు'!

'బంతి పట్టుకొనేందుకు ఎక్కువ సమయం ఉంటే, మనసు తన విశ్లేషణా, ఊగులాటా ప్రారంభిస్తుంది. 'పట్టు కోగలనో? లేనో?' అన్న శంకా, దాని వెనక జంకూ, మనసంతా నిండేందుకు వ్యవధి ఉంటుంది. విశ్వాస లోపం అంటూ కలగాలేగానీ, వైఫల్యం దాని వెనకే అంటిపెట్టుకొని ఉంటుంది కదా! అందువల్ల 'క్యాచ్' చేజారి పోతుంది. అదే మెరుపు వేగంతో చేతికొచ్చే కష్టమైన 'క్యాచ్'లయితే మావాళ్ళు తక్కున పట్టేస్తున్నారు. అప్పుడు ఆలోచించే అవకాశమే ఉండదు కనక, వైఫల్య భయం ఏర్పడటానికి కూడా వ్యవధి చాలదు' అన్నాడు.

జ్యోతిర్మయం

జీవితంలోనూ అంతే కదా! ఈ ఊగిసలాట తత్త్వం –'చాంచల్యం' – చాలా సందర్భాలలో మంచి పనులు తలపెట్టిన మనిషిని వెనక్కు లాగుతుంటుంది. చేద్దాంలే, చేద్దాంలే' అని తాత్సారం చేసిన కొద్దీ, మాయదారి మనస్సును నమ్మటానికి లేదు. అది ఆలో చనల పుట్ట. కామ లోభాలకూ, క్రోధ మోహాలకూ కార్య స్థానం. ఏ మాత్రం అవకాశం చిక్కినా, నిరాధారమైన భయాలూ, పిరికితనాలూ, 'దురా'లోచనలూ దాన్ని కబ్జా చేసేస్తాయి. చెదరగొట్టి, బెదరగొట్టి, చెడగొడతాయి. అందువల్ల మనిషి, తను తలపెట్టిన కాసిని మంచి పనులు కూడా, మనసు సహాయ నిరాకరణ కారణంగా మాని వేయాల్సి వస్తుంది. ఎక్కువ ఆలోచించిన కొద్దీ, మనసు సత్సంకల్పాలకూ సత్కార్యాచరణలకూ దూరంగా మళ్లి పోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. అందుకే దానం, ధర్మం, పరోపకారం లాంటి మంచి పనులు చేయదలచుకొన్న వాళ్ళు ఆ పనులు ఎంత త్వరగా పూర్తి చేసుకొంటే అంత మంచిదని పెద్దలు చెప్తుంటారు. పుణ్య కార్యాలకూ, శుభ కార్యాలకూ, 'శుభస్య శీఘ్రం' అంటూ ఉంటారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.తదియ ఉ.9.43 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.7.20 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.8.26 నుండి 10.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.32 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** లేవు. : **రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు; **యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు; **సూర్యోదయం** 6.38 ; **సూర్యాస్తమయం** 5.38.

ప్రమోషన్‌లలో రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్‌.కృష్ణయ్య



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ ఆర్‌.కృష్ణయ్య

ఇబ్రహీంపట్నం: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్లు కల్పించాలని, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. ఎన్టీఆర్‌ జిల్లా ఇబ్రహీంపట్నంలో విద్యుత్‌ బీసీ ఉద్యోగుల సంఘం 17వ రాష్ట్ర మహాసభలో ముఖ్యఅతిథిగా సోమవారం ఆయన పాల్గొన్నారు. ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతీరావ్‌పూలే కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులతో సభాప్రాంగణం కిక్కిరిసింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉద్యమించాలన్నారు. అనంతరం ఉద్యోగులు సంఘం డైరీ, న్యూ ఇయర్‌ క్యాలెండర్‌ ఆవిష్కరించారు. ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌ యాదవ్‌, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌.మారేష్‌ పాల్గొన్నారు.

10న వర్చువల్‌ సేవా టికెట్ల దర్శన కోటా విడుదల



రేమండ్‌ గ్రూప్స్‌ కంపెనీ చైర్మన్‌ గౌతమ్‌

తిరుమల: తిరుమలలో ఈ నెల 12 నుంచి కళ్యాణోత్సవం, ఊంజల్‌ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలకు సంబంధించిన ఆన్‌లైన్‌ వర్చువల్‌ సేవా టికెట్లు, సంబంధిత దర్శన టికెట్ల కోటాను 10వ తేదీ ఉదయం 9 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అయితే శ్రీవారి ఆలయంలో బాలాలయం దృష్ట్యా ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌ వర్చువల్‌ సేవ, అనుబంధ దర్శన టికెట్ల కోటా అందుబాటులో ఉండదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దర్శన టికెట్లను బుక్‌ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం రేమండ్‌ గ్రూప్స్‌ కంపెనీ చైర్మన్‌ గౌతమ్‌ సింఘానియా, రాష్ట్ర ప్రభుత్వ విప్‌ కె.శ్రీనివాసులు, ఎంపీ బెలగాన చంద్రశేఖర్‌, ఎమ్మెల్యే అప్పలనాయుడు, తెలంగాణ ప్రభుత్వ విప్‌ వినయ్‌భాస్కర్‌ తదితరులు వైకుంఠ ద్వారంలో దర్శించుకున్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్‌స్లాట్‌ టికెట్లు పొందిన వారికి త్వరగా దర్శనమవుతోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 67,169 మంది దర్శించుకోగా, 21,222 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు భక్తులు వేశారు.

భూగర్భ జలాల పరిరక్షణలో ఏపీ అగ్రగామి



సాక్షి, అమరావతి: దేశంలో భూగర్భ జలాల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్‌ అగ్రగామిగా నిలిచింది. నేషనల్‌ హైడ్రాలజీ ప్రాజెక్టు(ఎన్‌హెచ్‌పీ) అమలులో దేశంలో రాష్ట్రానిది తొలిస్థానం. భూగర్భ జలవనరుల పరిరక్షణ కోసం దేశంలో మూడేళ్ల నుంచి ఎన్‌హెచ్‌పీని కేంద్రం అమలుచేస్తోంది. దేశవ్యాప్తంగా జలసంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13.09 లక్షల జల సంరక్షణ నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. వాటి ద్వారా వర్షపు నీరు అధిక శాతం భూమిలోకి ఇంకి.. భూగర్భ జలమట్టం పెరగడానికి దోహదం చేసింది.

డ్రిప్‌, స్ప్రింక్లర్లతో తగ్గిన నీటి వినియోగం

రాష్ట్రంలో 15 లక్షల వ్యవసాయ బోరు, బావుల కింద 40 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. ఈ బోరు బావులను ప్రభుత్వం జియో ట్యాగింగ్‌ చేసింది. ఈ బోరు బావుల కింద సుమారు 13 లక్షల మంది రైతులకు 34.58 లక్షల ఎకరాలలో సూక్ష్మనీటిపారుదల విధానంలో పంటల సాగుకు డ్రిప్‌, స్ప్రింక్లర్లను ప్రభుత్వం అందజేసింది. ఇది భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేలా చేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 1,254 పీజియో మీటర్ల ద్వారా ఎప్పటికప్పుడు భూగర్భ జల మట్టాన్ని పర్యవేక్షిస్తూ భూగర్భ జలాలను పరిరక్షించింది.

పుష్కలంగా భూగర్భ జలం

ఇక గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టిన జలసంరక్షణ చర్యలతో భూగర్భ జలమట్టం పెరిగింది. 2017తో పోలిస్తే 2020 నుంచి రాష్ట్రంలో ఏటా భూగర్భ జలాల లభ్యత 208 టీఎంసీలు పెరిగిందని కేంద్రం తేల్చింది. అలాగే, భూగర్భజలాల వినియోగం ఏటా సగటున 48 టీఎంసీలు తగ్గిందని పేర్కొంది. దీంతో.. భూగర్భ జలాల లభ్యత ఏటా పెరగడం.. వినియోగం తగ్గడంతో దేశంలో భూగర్భ జలాల సంరక్షణలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 5.65 మీటర్లలోనే భూగర్భ జలాలు లభ్యమవుతుండటం గమనార్హం. ఇలా భూగర్భ జలాల లభ్యత పెరగడంతో అటు సాగునీటికి.. ఇటు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పోయాయి.

మల్లన్న సన్నిధిలో పుదుచ్చేరి సీఎం రంగస్వామి



పుదుచ్చేరి ముఖ్యమంత్రికి స్వామివారి జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న దేవస్థానం అధికారులు

శ్రీశైలం టెంపుల్‌: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్‌.రంగస్వామి సోమవారం దర్శించుకున్నారు. భ్రమరాంబ అతిథి గృహం వద్ద దేవస్థానం ఏఈవో మోహన్‌, జిల్లా అడిషనల్‌ ఎస్పీ రమణ, నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. మధ్యాహ్నం 3 గంటలకు మల్లన్న దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు ఎమ్మెల్యేలు ఎ.కె.డి.ఆర్ముగం, కె.ఎ స్‌.టి.రమేష్‌, దక్షిణామూర్తి, లక్ష్మీకాంతంతో కలిసి సీఎం రంగస్వామి చేరుకున్నారు. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు పట్టువస్త్రాలు అందించగా అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి స్వామి వారి శేషవస్త్రాలతో తలపాగా చుట్టగా.. పట్టువస్త్రాలు తలమీద పెట్టుకుని స్వామి అమ్మవార్లకు సమర్పించారు. ముందుగా రత్నగర్భగణపతి స్వామికి ప్రత్యేక పూజలు.. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత భ్రమరాంబదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

ఆక్వాకు ఉజ్వల భవిత

స్టేక్‌ హోల్డర్స్‌ సమావేశంలో రైతులకు మేలు కలిగే నిర్ణయాలు

- ఫీడ్‌ ధర కిలో రూ.2.50 తగ్గింపు
- పిల్ల ధర 36 పైసల నుంచి 30 పైసలకు
- ప్రతి నెలా మూడుసార్లు ధరలపై సమీక్ష
- ఆధునిక లేబొరేటరీలపై ఏకాభిప్రాయం
- 25 – 60 మధ్య కౌంట్‌ సాధించేలా రైతులకు అవగాహన



సమావేశంలో ఆక్వా రైతులు, రొయ్యల ఎగుమతిదారులు, ఫీడ్‌ ఉత్పత్తిదారులు, హేచరీల ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆక్వా రంగం మరింత పురోభివృద్ధి సాధించేలా, రైతులకు మేలు కలిగేలా స్టేక్‌ హోల్డర్స్‌ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆక్వా డెవలప్‌మెంట్‌ అథారిటీ వైస్‌ చైర్మన్‌ వడ్డి రఘురామ్‌ అధ్యక్షతన సోమవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆక్వా రైతులు, రొయ్యల ఎగుమతిదారులు, ఫీడ్‌ ఉత్పత్తిదారులు, హేచరీల నిర్వాహకులు పాల్గొన్నారు. ఇప్పుడున్న ఫీడ్‌ ధర కిలో రూ.2.50 తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రొయ్య పిల్లను 36 పైసలకు విక్రయిస్తుండగా, ఆరు పైసలు తగ్గించి 30 పైసలు చేశారు.

రైతులు నష్టపోకుండా నాణ్యమైన రొయ్య సీడ్‌ ఉత్పత్తికి అత్యంత ఆధునిక లేబొరేటరీలు నిర్వహించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ లేబొరేటరీల ద్వారా రొయ్య సీడ్‌లో యాంటీబయాటిక్స్‌ లేకుండా చూడాలని నిర్ణయించారు. ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో ధరలపై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. రొయ్యల చెరువుల వద్ద పట్టుబడి జరిగిన తరువాత సాధ్యమైనంత త్వరగా రొయ్యలను ఐస్‌లో వేసి తాజాదనం కోల్పోకుండా చూడాలని, ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఆక్వా రంగంలోని అన్ని వర్గాల వారితో వర్కింగ్‌ కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయాలు అమలయ్యేటట్టు చూడాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. తక్కువ సాంద్రత కలిగి 25 నుంచి 60 మధ్య కౌంట్‌ సాధించేలా రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. మెరుగైన ఉత్పాదకత, నాణ్యత కోసం రైతులకు పూర్తి స్థాయిలో సేవలందించే బాధ్యతను మేత తయారీదారులు తీసుకోవాలని సూచించారు. పెట్టుబడి ధరలను సమీక్షించిన అనంతరమే ఫీడ్‌ ధర ఖరారు చేసేందుకు ఫీడ్‌ తయారీదారులు ఆమోదం తెలిపారు. విధిగా నెలకోసారి ఆక్వా రైతులు, రొయ్యల ఎగుమతిదారులు, ఫీడ్‌ ఉత్పత్తిదారులు, హేచరీల నిర్వాహకులు అనుకూలమైన ప్రాంతంలో సమావేశమై, సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని నిర్ణయించారు. ఆక్వా సాగు, రవాణా, కొత్త ట్రెండ్‌లు, నోటిఫికేషన్‌లు, ముందస్తు హెచ్చరికలు, దేశీయ మార్కెటింగ్‌ తదితర అంశాలపై రైతులు, ఫీడ్‌ తయారీదారులు, ప్రాసెసింగ్‌, ఎగుమతిదారులు సమన్వయంతో ముందుకు సాగాలని తీర్మానించారు. ల్యాబ్‌లు ఏర్పాటు, నిర్వహణ విషయంలో హేచరీ యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఐదుగురు డూప్లికేటుగాళ్ల అరెస్టు

నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠా ఆటకట్టు

- మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దు
- డీసీపీ విశాల్‌ గున్ని



నిందితులను మీడియాకు చూపుతున్న ఈస్ట్‌ జోన్‌ డీసీపీ విశాల్‌ గున్ని, చిత్రంలో ఏసీపీ రవికిరణ్‌, సీఐ సురేష్‌

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి స్థలాలు విక్రయిస్తున్న ముఠాలోని ఐదుగురిని విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. ఈ డూప్లికేటుగాళ్ల వ్యవహారాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. మంగళగిరి, విశాఖపట్నం, పార్వతీపురం, విజయవాడలోని జక్కంపూడికాలనీ, అంబాపురం తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా గుట్టుచప్పుడుకాకుండా సాగుతున్న ఈ ముఠా దందాకు పోలీసులు చెక్‌ పెట్టారు. ఎన్టీఆర్‌ జిల్లా విజయవాడలో సంచలనం సృష్టించిన ఈ కేసు వివరాలను సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ పోలీస్‌ కమిషనర్‌ (డీసీపీ) విశాల్‌ గున్ని వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. తన స్థలాన్ని వేరే వ్యక్తుల పేరున మార్చేశారంటూ ఒక వ్యక్తి ఇటీవల గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఛేదించేందుకు ఎన్టీఆర్‌ జిల్లా పోలీస్‌ కమిషనర్‌ టి.కె.రాణా నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని కోణాల్లోను దర్యాప్తు చేసిన అనంతరం 12 మంది వ్యక్తులు ఈ నకిలీ వ్యవహారానికి పాల్పడుతున్నట్లు తెలిసింది. వీరి లో విజయవాడకు చెందిన ప్రధాన నిందితులైన తిరుమాని రాజ్‌చైతన్య, సానం సాంబశివరావు, శివకోటి మధువెంకటసూర్యనారాయణ, చిప్పల పోతురాజు, తిరుమాని ఉమామహేశ్వరరావును అరెస్ట్‌ చేశారు. వీరిపై 419, 420, 465, 467, 468, 120(బి) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరో ఏడుగురు నిందితులను పట్టుకోవాల్సి ఉంది.

అప్రమత్తంగా ఉండండి

నకిలీ ముఠాల బారిన పడకుండా భూ యజమానులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని డీసీపీ సూచించారు. డాక్యుమెంట్లు, ఆధార్‌, లింక్‌ డాక్యుమెంట్లు, ఇతర పత్రాల జిరాక్సులను ఎవరికీ ఇవ్వవద్దని చెప్పారు. క్రయవిక్రయాల సమయంలో మాత్రమే డాక్యుమెంట్లను బహిర్గతం చేయాలన్నారు. యజమానులు తమ ఖాళీ స్థలాలను పరిశీలిస్తుండాలన్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏసీపీ డాక్టర్‌ రవికిరణ్‌, గవర్నర్‌పేట సీఐ సురేష్‌ పాల్గొన్నారు.

ఎలా చేశారంటే..

నిందితులు తిరుమాని రాజ్‌చైతన్య, శివకోటి మధు, చిప్పల పోతురాజు గతంలో రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలో వివాదాలు, బ్యాంకుల్లో తనఖా, లింక్‌ డాక్యుమెంట్లు సరిగ్గాలేని భూముల వివరాలు తెలుసుకునేవారు. సంబంధిత యజమానిని సంప్రదించి భూమిని విక్రయిస్తామని చెప్పి ఆ భూమికి సంబంధించిన దస్తావేజుల జిరాక్సులు తీసుకునేవారు. తరువాత నకిలీ ఆధార్‌, డెత్‌ సర్టిఫికెట్లు, దస్తావేజులు తయారు చేసేవారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్‌ స్టేడియం కాంప్లెక్స్‌లోని 8వ నంబరు షాపులో, గాంధీనగర్‌లోని జిరాక్స్‌ షాపులో ఈ వ్యవహారాలు సాగేవి. సృష్టించిన నకిలీపత్రాలతో ఆ భూమిని వేరే వ్యక్తులకు వెంటనే అమ్మేసేవారు. వేరే వ్యక్తులకు భూమిని అమ్మేందుకు గాంధీనగర్‌లోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం వద్ద పనిచేసే ఓ డాక్యుమెంట్‌ రైటర్‌ ఈ ముఠాకు సాయం చేసేవాడు. ఇదేవిధంగా విశాఖపట్నంలో ఇటీవల ఒక భూమిని అమ్మారు. ఈ విషయం కొన్నాళ్ల తరువాత భూమి అసలు యజమానికి తెలియడంతో అక్కడ ఫిర్యాదు చేశారు. వెంటనే ఈ ముఠా అక్కడకు చేరుకుని రిజిస్ట్రేషన్‌ను విత్‌డ్రా చేసుకుందని డీసీపీ విశాల్‌ గున్ని చెప్పారు.

పీతల సాగు... భలే బాగు

వనామీకి ప్రత్యామ్నాయంగా సాగు

- జిల్లాలో ఇప్పటికే 200 ఎకరాల్లో పంట
- విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- కిలో రూ.600 నుంచి రూ.వెయ్యి ధర



సాక్షి, అమలాపురం: ఆక్వాలో కీలకమైన చేపలు, వనామీ రొయ్యల పెంపకం సంక్షోభంలో కూరుకుపోతోంది. మరీ ముఖ్యంగా వనామీ సాగు రైతులకు నష్టదాయకంగా మారింది. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నా ఎగుమతిదారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులకు నష్టాలు తెచ్చిపెడుతోంది. దీంతో పలువురు ఆక్వా రైతులు ప్రత్యామ్నాయ సాగు వైపు దృష్టిసారించారు. ప్రస్తుతం వారు పీతల సాగుపై ఆసక్తి చూపుతుండగా.. అందుకు ప్రభుత్వం దన్నుగా నిలిచేందుకు సిద్ధమైంది. పీతల సాగుకు మద్దతుగా పలు చర్యలు తీసుకుంటోంది. కోనసీమలో దశాబ్దంన్నర కాలంగా తీర ప్రాంత మండలాల్లో పీతల సాగు చేస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా సాగు విస్తీర్ణం మాత్రం పెద్దగా పెరగలేదు. జిల్లాలో ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లో కేవలం 200 ఎకరాల్లో సాగు జరుగుతోంది. దీనిని మరింత పెంచేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో మన దేశం నుంచి పీతల ఎగుమతి పెరుగుతోంది. సెల్లా సెరటా, స్కెల్లా ట్రాంక్వారికా (మండ పీత) రకాలకు మంచి డిమాండ్‌ ఉంది. ఇవి కిలో రూ.600 నుంచి రూ.వెయ్యి వరకూ ధర పలుకుతోంది. ఈ రకం పీతల పెంపకం లాభదాయకంగా ఉంటుందని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. సాగుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఖర్చు కాగా, దిగుబడిని బట్టి ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ ఆదాయం వచ్చే అవకాశముంది.



బాక్సులలో పీతల సాగు విధానం


మూడు రకాలుగా సాగు

పీతల సాగు మూడు రకాలుగా చేయవచ్చు. కానీ జిల్లా రైతులు కేవలం సంప్రదాయ పద్ధతిలో చెరువుల చుట్టూ వలలు వేసి పెంపకం చేపడుతున్నారు. సాధారణ ఆక్వా చెరువుల మాదిరిగానే ఇక్కడా చేస్తున్నారు. దీంతో పాటు బాక్సులలో పీతలను పెంచే అవకాశముంది. అభివృద్ధి చెందిన దేశాల్లో బాక్సులలో పీతలను పెంచుతున్నారు. మూడో రకం సాఫ్ట్‌ సెల్స్‌ ఎప్పటికప్పుడు సేకరించడం ద్వారా సాగు చేస్తారు.

చిర్రయానాంలో హేచరీ

పీతల సాగు ప్రోత్సాహంలో భాగంగా కాట్రేనికోన మండలం చిర్రయానాం వద్ద ప్రైవేట్‌ హేచరీ నిర్మాణానికి మత్స్యశాఖ ప్రోత్సాహం అందిస్తోంది. స్థానికంగా హేచరీ వస్తే పీత సీడ్‌ తక్కువ ధరకు రావడంతో పాటు సాగు విస్తీర్ణం పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం ఆర్‌జీసీ విజయవాడ నుంచి, చెన్నై నుంచి తీసుకువస్తున్నారు. ఇది రైతులకు భారంగా మారింది. ఇదే సమయంలో సాగు ప్రోత్సాహంలో భాగంగా పెట్టుబడికి అవసరమైన రుణ పరిమితిని ఇటీవల డిస్ట్రిక్ట్‌ లెవెల్‌ టెక్నికల్‌ కమిటీ (డీఎల్‌టీసీ) పెంచిన విషయం తెలిసిందే. కమిటీ ఎకరాకు రూ.78 వేలుగా పేర్కొనగా, జిల్లా కలెక్టర్‌ శుక్లా దీనిని రూ.లక్షకు పెంచాలని సూచించారు. వనామీకి ప్రత్యామ్నాయంగా పీతల సాగు పెంచితే అటు వనామీకి కూడా మంచి డిమాండ్‌ వస్తోందని అంచనా.

సాగుకు తీరం అనుకూలం



జిల్లాలో ఇప్పుడు మూడు మండలాల్లో మాత్రమే చాలా తక్కువ మొత్తంలో పీతల సాగు జరుగుతోంది. పీతల సాగుకు తీర ప్రాంత మండలాలు అనుకూలం. ఇటు వరికి, అటు రొయ్యల సాగుకు పనికిరాని చౌడు నేలల్లో సైతం పండించవచ్చు. ఆక్వా రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం సాగుకు సాంకేతిక సహకారం, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తుంది.

– షేక్‌ లాల్‌ మహ్మద్‌, జిల్లా మత్స్యశాఖాధికారి

ఉద్రిక్తతకు దారితీసిన రాములోరి 'లడ్డూ'

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బూజు పట్టిన లడ్డూల విక్రయం వివాదం తారస్థాయికి చేరింది. భద్రాచలం జ్యూడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నీలిమ.. భక్తులు కొనుగోలు చేసిన లడ్డూలు బూజు పట్టి ఉండటాన్ని గమనించి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, దరిమిలా ఆలయంలో వంటశాల సీజ్‌ చేసేందుకు వచ్చిన సీఐ, పోలీసులను దేవస్థానం వర్గాలు అడ్డుకోవడంతో సోమవారం ఉద్రిక్తతకు దారి తీసింది. నిరసనల నినాదాలతో ఆలయం మార్మోగింది.

పోలీసుల రాకతో రాజుకున్న వివాదం..

భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి తన సిబ్బందితో సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో రామాలయంలో లడ్డూలను తయారు చేసే వంటశాలకు వచ్చారు. బూజు పట్టిన లడ్డూలను విక్రయిస్తున్నారంటూ భద్రాచలం జడ్జి ఫిర్యాదు చేశారని, వంటశాలను సీజ్‌ చేస్తామని చెప్పారు. దీనికి నిరసనగా ఆలయ అర్చకులు, వేదపండితులు, ఏఈఓలు, సిబ్బంది వంటశాల వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులకు, సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి విచారణ, నోటీసులు లేకుండా స్వామివారి ప్రసాదాలను తయారు చేసే వంటశాలకు ఎలా వస్తారని పోలీసులను నిలదీశారు. ఎగ్జిక్యూటివ్‌ స్థాయి అధికారి ఉన్న ఆలయంలో ముందస్తు సమాచారం లేకుండా చర్యలు తీసుకోవడం తగదని వాదించారు.

పోలీసులపై ఆర్డీఓ అసహనం..

వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఆర్డీఓ రత్నకళ్యాణి ఆలయానికి వచ్చారు. ఘటనపై పోలీసులు, ఆలయ వర్గాలను ఆరా తీశారు. వంటశాల సీజ్‌ చేసేందుకు తగిన ఆధారాలు చూపించాలని సీఐని అడగగా.. ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆర్డీఓ అసహనం వ్యక్తం చేశారు. లడ్డూ శాంపిళ్లు సేకరించి హైదరాబాద్‌కు పంపించాలని ఫుడ్‌ సేఫ్టీ అధికారి వేణుగోపాల్‌ను ఆదేశించారు.

కన్నీటి ఉద్దానంపై పన్నీటి జల్లు

- కిడ్నీ వ్యాధి బాధితులకు అండగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం
- శరవేగంగా కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌ నిర్మాణం
- త్వరలోనే పూర్తి కానున్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు

పచ్చటి ఉద్దానం కంట వెచ్చగా జారిన కన్నీటి బొట్లు ఏ నాయకుడి కంటా పడలేదు. ఏళ్లుగా ఇక్కడి జీల నేలలో తెగిపడిన తాళిబొట్లు ఏ నేతనూ కదిలించలేదు. ఐదో తనం కోల్పోయిన తల్లులు, అమ్మనాన్నలకు దూరమైన పిల్లలు, మనుషులు లేక వారి జ్ఞాపకాలుగా మిగిలిన ఇళ్లు.. ఏవీ ప్రజా ప్రతినిధుల కరకు గుండెలను కరిగించలేదు. హామీలిచ్చిన వారు కొందరు, అన్నీ చేసేశామని ప్రచారం చేసుకున్న వారు ఇంకొందరు. అలాంటి ఆపత్కాలంలో వచ్చాడొక నాయకుడు. వైద్యం కోసం విశాఖ వెళ్లే రోగుల చెంతకు డయాలసిస్‌ యూనిట్లు రప్పించాడు. డబ్బుల్లేక అల్లాడుతున్న అభాగ్యులకు చేతిలో నెలకు రూ.10 వేలు పెడుతున్నాడు. ఎక్కడో ఉన్న వంశధారను ఉద్దానంకు తీసుకువస్తున్నాడు. అతడే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి. కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌, 200 పడకల ఆస్పత్రి, ఉద్దానం ప్రాజెక్టు ఆయన చిత్తశుద్ధికి సజీవ సాక్ష్యాలు.



పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో గల కిడ్నీ డయాలసిస్‌ సెంటర్‌లో డయాలసిస్‌ చేసుకుంటున్న బాధితులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉద్దానం ఊపిరి పీల్చుకుంటోంది. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండడంతో మృత్యుకౌగిట నుంచి విడుదలవుతోంది. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ఒకవైపు వ్యాధి మూలాలు కనుగొనేందుకు కిడ్నీ రీసెర్చ్‌ ఆస్పత్రిని నిర్మిస్తోంది. మరోవైపు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యంతో పాటు డయాలసిస్‌, ఉచిత మందులను పూర్తిస్థాయిలో అందిస్తోంది. ఇంకోవైపు వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణం తాగునీరై ఉండొచ్చన్న నిపుణుల సూచనల మేరకు రూ.700 కోట్లతో భారీ మంచినీటి పథకాన్ని నిర్మిస్తోంది. ఇవి త్వరలోనే పూర్తి కానున్నాయి.

పాదయాత్రలో చూసి..

పాదయాత్రలో కిడ్నీ వ్యాధి బాధితుల బాధలను వైఎస్‌ జగన్‌ దగ్గరుండి చూశారు. ప్రతిపక్ష నేత హోదాలో కవిటి మండలం జగతిలో కిడ్నీ బాధితుల భరోసా యాత్ర పేరిట పర్యటించారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడి.. తన కార్యాచరణను అప్పుడే స్పష్టంగా ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం డయాలసిస్‌ సెంటర్ల ఏర్పాటు, పింఛన్ల పెంపు, ఉపరితల తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

బాబుదంతా బడాయే..

అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, ఆయన భాగస్వామి పవన్‌ కల్యాణ్‌ ఉద్దానం కిడ్నీ బాధితులను పట్టించుకున్న పాపాన పోలేదు. తిత్లీ సమయంలో గోడు చెప్పుకుందామని వెళ్లిన వారిపై చంద్రబాబు మండిపడ్డారు కూడా. 2019 ఎన్నికల ప్రచారానికి సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు ఒక్క కిడ్నీ వ్యాధి బాధితుడికి కూడా భరోసా ఇవ్వలేకపోయారు. మరోవైపు పవన్‌ కల్యాణ్‌ పెద్ద ఎత్తున ఉద్దానం సమస్య పరిష్కరించేశానని ప్రచారం చేసుకున్నారు తప్ప.. చేసిన పని ఒక్కటీ లేదు. తన మిత్రపక్షం అధికారంలో ఉన్నా కూడా ఏమీ చేయలేకపోయారు.

వైఎస్‌ జగన్‌ సీఎం అయ్యాక..

- కిడ్నీ వ్యాధి గ్రస్తులకు పింఛన్‌ను రూ.3500 నుంచి రూ.10వేలకు పెంచారు. 5పైబడి సీరం క్రియేటినిన్‌ ఉన్న వారికి రూ.5వేలు, డయాలసిస్‌ రోగులకు రూ. 10వేల పింఛను ఇస్తున్నారు.
- ఉపరితల తాగునీరు అందించేందుకు రూ.700 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లో గల 827 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు.
- వ్యాధి మూలాలను తెలుసుకునేందుకు రీసెర్చ్‌ సెంటర్‌తో పాటు సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి కూడా మంజూరు చేశారు. మార్చిలో వీటిని ప్రారంభించనున్నారు.
- టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో డయాలసిస్‌ సెంటర్లు ఉన్నాయి. 63 మెషీన్లతో 68పడకలపై డయాలసిస్‌ అందిస్తున్నారు. సోంపేట, కవిటిలో పడకలు పెంచారు. హరిపురంలో పది పడకలతో డయాలసిస్‌ సెంటర్‌ ఏర్పాటు చేశారు. కొత్తగా గోవిందపురం, అక్కుపల్లి, కంచిలి, బెలగాంలో డయాలసిస్‌ సెంటర్లు మంజూరయ్యాయి.
- ఇవి కాకుండా ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో 10పడకలు, బారువ సీహెచ్‌సీలో 10పడకలతో డయాలసిస్‌ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు కొత్తగా ప్రతిపాదనలు తయారయ్యాయి. ఇవికాకుండా రెండు కంటైన్డ్‌ బేస్డ్‌ సర్వీసెస్‌ డయాలసిస్‌ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అవి జిల్లాకొచ్చాయి. కవిటి, సోంపేట సీహెచ్‌సీల్లో వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో యూనిట్‌లో ఏడేసి పడకలు ఉంటాయి.
- టీడీపీ హయాంలో డయాలసిస్‌ రోగులకు 20రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు 37రకాల మందులను అందుబాటులో ఉంచారు.
- కిడ్నీ రోగులకు వైద్య పరీక్షల కోసం సెమీ ఆటో ఎనలైజర్స్‌, ఎలక్ట్రోలైట్‌ ఎనలైజర్స్‌, యూరిన్‌ ఎనలైజర్స్‌ను ఉద్దానం పరిధిలో ఉన్న 29 ల్యాబ్‌లలో అందుబాటులో ఉంచారు. పాతవి పాడైతే ఎప్పటికప్పుడు కొత్తవి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు.

క్లుప్తంగా...

మతమార్పిళ్లకు రాజకీయ రంగు పులమొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: ''మతమార్పిళ్లు చాలా సీరియస్ విషయం. దీనికి రాజకీయ రంగు పులమొద్దు'' అని సుప్రీంకోర్టు పేర్కొంది. బలవంతపు మతమార్పిళ్లను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టేలా కేంద్ర రాష్ట్రాలను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ఎం షా, జస్టిస్ సి.టి.రవికుమార్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఇది రాజకీయ ప్రేరేపిత పిటిషన్ అని తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్ చేసిన వాదనను తీవ్రంగా తప్పుబట్టింది. ''ఇలా వాదించేందుకు మీకు వేరే కారణాలుండొచ్చు. అంతమాత్రాన కోర్టు విచారణను మరోలా మార్చుకునేందుకు ప్రయత్నించకండి. మీ రాష్ట్రంలో కూడా ఇలాంటివి జరుగుతుంటే అది కచ్చితంగా తప్పే. దీన్ని రాజకీయం చేయకండి'' అంటూ హితవు పలికింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరించి ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచించాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని కోరింది.

వలసలు, నిరాసక్తత

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడానికి ఉపాధి కోసం వలసలు, పట్టణాల్లో, యువతలో నిరాసక్తత వంటి ఎన్నో కారణాలున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. సిబ్బంది, న్యాయం, ప్రజా సమస్యలపై పార్లమెంటు సంఘానికి ఈ మేరకు నివేదించింది. సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఈ అంశంపై ఈసీ ఉన్నతాధికారులు ప్రజెంటేషన్ సమర్పించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు రిమోట్ ఓటింగ్ సదుపాయం వంటివి అందుబాటులోకి తేవాలని సూచించారు. అయితే, ''రిమోట్ ఓటింగ్ పరిజ్ఞానం కూడా నెట్‌వర్క్‌లకు అనుసంధానమయ్యే తరహాలో కాకుండా ఈవీఎంల మాదిరిగా స్వతంత్రంగా ఉండేలా చూడటం ముఖ్యం. అప్పుడే ఎలాంటి దుర్వినియోగానికీ తావుండదు'' అని అభిప్రాయపడ్డారు.

నెలాఖరుకు పార్లమెంట్ నూతన భవనం సిద్ధం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ఈ జనవరి చివరి నాటికి సిద్ధమవుతుందని అధికారవర్గాలు తెలిపాయి. బడ్జెట్ సమావేశాలను కొత్త భవనంలోనే జరిపేదీ లేనిదీ త్వరలోనే కేంద్రం నిర్ణయించే అవకాశాలున్నాయని తెలిపాయి. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ విస్టాలో భాగమే పార్లమెంట్ కొత్త భవనం. రాష్ట్రపతి భవన్– ఇండియా గేట్ మధ్యలోని మూడు కిలోమీటర్ల పొడవైన రాజ్‌పథ్ నవీకరణ, కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, ప్రధాని కొత్త కార్యాలయం, నివాసం, ఉపరాష్ట్రపతి ఎన్‌క్లేవ్ వంటివి ఇందులో భాగంగా ఉన్నాయి. నిర్మాణ పనులను టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ చేపట్టింది.

అంతర్జాతీయ డ్రగ్స్ సిండికేట్ గుట్టురట్టు

16 మంది అరెస్ట్, 60 కిలోల డ్రగ్స్ సీజ్ చేసిన ఎన్సీబీ


న్యూఢిల్లీ: పంజాబ్‌లోని లూథియానా కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ సిండికేట్ గుట్టురట్టు చేసినట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్సీబీ) సోమవారం పేర్కొంది. ఇద్దరు అఫ్గాన్లు సహా 16 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 60 కిలోల డ్రగ్స్, 31 తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ''ఈ ముఠాకు గతేడాది ఢిల్లీలోని షహీన్‌బాగ్, యూపీలోని ముజఫర్‌నగర్‌ల్లో పట్టుబడిన డ్రగ్స్‌తో సంబంధముంది. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నెట్‌వర్క్ ఉంది'' అని ఎన్సీబీ డిప్యూటీ డీజీ జ్ఞానేశ్వర్ సింగ్ చెప్పారు.

ఉత్తరాదిని వీడని పొగమంచు

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో చలి పంజా విసురుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా సోమవారం విమాన, రైలు, రోడ్డు రవాణాకు ఆటంకం కలుగుతోంది. వారణాసికి రావాల్సిన పలు విమానాలను ప్రతికూల వాతావరణం కారణంగా దారి మళ్లించారు. కొన్ని విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. పలు ప్రాంతాల్లో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. పొగమంచు వల్ల యూపీలో రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఏడుగురు మరణించారు. యూపీలోని ఎటావాలో 3 డిగ్రీలు, కాన్పూర్‌లో 3.1 డిగ్రీలు, ఢిల్లీలో 3.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

'అంజలి' ఇంట్లో చోరీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రోడ్డు ప్రమాదంలో కారు ఈడ్చుకెళ్లడంతో దుర్మరణం పాలైన అంజలీ సింగ్ ఇంట్లో చోరీ జరిగింది. టీవీతో పాటు పలు విలువైన వస్తువులు పోయినట్టు కుటుంబీకులు ఆరోపించారు. ఇందులో నిందితులతో పాటు అంజలి స్నేహితురాలినని చెప్పుకున్న నిధి పాత్ర ఉండొచ్చని వారు అనుమానం వెలిబుచ్చారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో అతి శీతల వాతావరణంతో గడ్డకట్టిన జలపాతం

శత్రు సైన్యంపై మూషికాస్త్రం!

డీఆర్‌డీఓ వినూత్న ప్రయోగాలు • ఎలక్ట్రానిక్ పరికరాలతో ఎలుకల సామర్థ్యం పెంపు • మొదటి దశ ప్రయోగం విజయవంతం

యుద్ధ క్షేత్రంలో శత్రు శిబిరం ఎత్తుగడలు, రహస్యాలను తెలుసుకోవడానికి సైన్యం రకరకాల మార్గాల్లో ప్రయత్నించడం తెలిసిందే. శత్రువులు ఎక్కడెక్కడ ఏయే ఆయుధాలు మోహరించారో తెలుసుకోవడం యుద్ధంలో కీలకం. ఇలాంటివి పసిగట్టే ఎలుకలపై భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) నిర్విరామంగా ప్రయోగాలు సాగిస్తోంది. డీఆర్‌డీఓలో అంతర్భాగమైన అసిమ్మెట్రిక్ టెక్నాలజీ ల్యాబ్ ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైంది. మొదటి దశను విజయవంతంగా పూర్తిచేసి, రెండో దశలోకి ప్రవేశించింది.



ఏమిటీ ప్రయోగం?

సైనికులు జంతువులు, పక్షులను ఉపయోగించుకోవడం కొత్తేమీ కాదు. రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే ఎలుకలను రంగంలోకి దించాలన్నదే భారత సైన్యం వ్యూహం. ఇవి ఏమాత్రం అనుమానం రాకుండా శత్రు సైనికుల శిబిరాల్లోకి వెళ్లి, అక్కడి సమాచారాన్ని అందిస్తాయి. ఆ సమాచారం ఆధారంగా సైన్యం వ్యూహాలు సిద్ధం చేసుకోవచ్చు. ఈ ఎలుకలను యానిమల్ సైబర్గ్స్ అని పిలుస్తున్నారు. ఏడాదిన్నర క్రితమే ఈ ప్రాజెక్టు ప్రారంభమైంది. దీనిగురించి ఇటీవల జరిగిన 108వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో డీఆర్‌డీఓ సైంటిస్టు పి.శివప్రసాద్ ఒక ప్రజంటేషన్ ఇచ్చారు.

యానిమల్ సైబర్గ్స్ అంటే?

జీవించి ఉన్న ఎలుకల సామర్థ్యాన్ని మరింత పెంచుతారు. ఇందుకోసం ఎలక్ట్రికల్, మెకానికల్ పరికరాలు ఉపయోగిస్తారు. సాధారణ ఎలుకలు చేయలేని ఎన్నో పనులను ఇవి సులువుగా చేసేస్తాయి. కేవలం సైన్యంలోనే కాదు, పరిశోధనలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, భూమిలో పాతిపెట్టిన బాంబుల జాడ కనుక్కోవడంతోపాటు శస్త్రచికిత్సల్లోనూ యానిమల్ సైబర్గ్స్ సేవలను వాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ జంతువుల్లో మార్పులు చేయడాన్ని జంతు ప్రేమికులు, జంతు హక్కుల సంఘాల కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. జంతువుల్లోని సహజ సామర్థ్యాలను దూరం చేయడం వాటిని బాధకు గురిచేయడమే అవుతుందని అంటున్నారు. **–సాక్షి, నేషనల్ డెస్క్**

ఎలుకలే ఎందుకు?

భారత్‌లో ఎలుకలపై మొదటి దశ ప్రయోగాలు ముగిశాయి. ఎలుకల కదలికలను నియంత్రించడానికి సర్జరీల ద్వారా వాటి శరీరంలో ఎలక్ట్రోడ్‌లు అమర్చారు. ఇక సాధారణ వాతావరణ పరిస్థితుల్లో వాటిని పరీక్షించబోతున్నారు. కొండలను ఎంత వరకు అధిరోహించగలవో చూస్తారు. మొదటి దశ ప్రయోగంలో ఎలుకలు కొంత ఇబ్బందికి గురయ్యాయని డీఆర్‌డీఓ సైంటిస్టు పి.శివప్రసాద్ వెల్లడించారు. కార్యాచరణకు సిద్ధమైన ఎలుకలను రిమోట్ కంట్రోల్‌తో నియంత్రించవచ్చు. ఏ దిశగా వెళ్లాలి? ఎంత దూరంగా వెళ్లాలి? ఎక్కడ ఆగాలి? ఎంతసేపు ఆగాలి? అనేదానిపై వాటి మెదడుకు ఎప్పటికప్పుడు సంకేతాలు అందిస్తారు. ప్రయోగానికి ఎలుకలనే ఎన్నుకోవడానికి కారణంగా ఏమిటంటే.. అవి వేగంగా కదులుతాయి. లోతైన బొరియల్లోకి సైతం తేలిగ్గా వెళ్లగలవు. గోడలు, చెట్లు ఎక్కగలవు. యానిమల్ సైబర్గ్స్‌ను చైనాలో ఇప్పటికే అభివృద్ధి చేశారు. యానిమల్ సైబర్గ్స్ సినిమాల్లో కూడా ఉన్నాయి. స్టార్‌వార్స్ సినిమాలోని చ్యూబాకా కూడా ఇలాంటిదే. ఒళ్లంతా రోమాలతో కనిపించే వింత జంతువు చ్యూబాకాలో శరీరం లోపల ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటాయి.

గవర్నర్ 'వాకౌట్'

తమిళనాడు అసెంబ్లీలో కనీవినీ ఎరగని దృశ్యాలు

- ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పట్టించుకోని గవర్నర్
- 'ద్రవిడ' ప్రస్తావనను విస్మరిస్తూ ప్రసంగం
- భగ్గుమన్న అధికార డీఎంకే
- పార్టీ సభ్యుల తీవ్ర నిరసన
- గవర్నర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం!



గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటున్న డీఎంకే, మిత్రపక్షాల సభ్యులు

సాక్షి, చెన్నై: తమిళనాట గవర్నర్‌కు, డీఎంకే సర్కారుకు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈ క్రమంలో అసెంబ్లీలో కనీవినీ ఎరగని సంఘటనలు చోటుచేసుకున్నాయి. సోమవారం సమావేశాల తొలి రోజు సభనుద్దేశించి గవర్నర్ ఆర్.ఎన్.రవి చేసిన ప్రసంగంలో ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ పాఠాన్ని పలుచోట్ల విస్మరించడం వివాదం రాజేసింది. అందులో పేర్కొన్న పేర్లలో వివేకానందున్ని మాత్రం ప్రస్తావించి పెరియార్, అన్నాదురై వంటి ద్రవిడ దిగ్గజాలను ఆయన పక్కన పెట్టారు. ద్రవిడ మోడల్ ఆదర్శంగా పలు అభివృద్ధి పథకాలను చేపట్టాం వంటి పాయింట్లనూ ప్రస్తావించలేదు. పైగా పలు అంశాలపై తన అభిప్రాయాలను కూడా జోడిస్తూ ప్రసంగించారు. ఇలాంటి సందర్భాల్లో గవర్నర్లు ప్రసంగ పాఠానికి కట్టుబడటం సంప్రదాయం. ఈ నేపథ్యంలో రవి తీరుపై అధికార డీఎంకే సభ్యులు భగ్గుమన్నారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అనంతరం ఏకంగా గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెట్టేందుకు సీఎం ఎంకే స్టాలిన్ సిద్ధమయ్యారు! ''గవర్నర్ ప్రసంగంలోని అసంబద్ధ అంశాలను తిరస్కరించాలి. సభకు సమర్పించిన లిఖిత ప్రసంగ పాఠం మాత్రమే చెల్లుబాటవుతుందని ప్రకటించాలి' అని అందులో కోరారు. కానీ స్టాలిన్ మాట్లాడుతుండగానే రవి హఠాత్తుగా లేచి సభ నుంచి నిష్క్రమించారు! అనంతరం తీర్మానాన్ని సభ ఆమోదించింది! రవి తీరు విచారకరమని, ద్రవిడ దిగ్గజాలతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరునూ ప్రస్తావించకపోవడం శోచనీయమని స్పీకర్ అప్పవు అన్నారు. సభా సంప్రదాయాలను రవి తుంగలో తొక్కారంటూ మంత్రులు మీడియాతో మండిపడ్డారు. ''జాతీయ గీతాలాపన జరగకుండానే సభను వీడారు. జాతీయ గీతాన్ని కూడా అవమానించారు'' అని విమర్శించారు. డీఎంకే మద్దతుదారులు ట్విట్టర్‌లో 'గెటౌట్‌రవి' అంటూ ట్రోల్ చేస్తున్నారు. ఆయన బర్తరఫ్‌కు, రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. గవర్నర్ తీరును ఖండిస్తూ ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు డీఎంకే మిత్రపక్షాలు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, తమిళర్ వాల్వురిమై కట్చి ప్రకటించాయి. బీజేపీ మాత్రం గవర్నర్‌కు మద్దతుగా నిలిచింది. గవర్నర్ సభలో ఉండగానే ఆయనకు వ్యతిరేకంగా తీర్మానం పెడతారా అంటూ స్టాలిన్, స్పీకర్ తీరును తీవ్రంగా ఖండించింది. డీఎంకే, దాని మిత్రపక్షాలు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దుయ్యబట్టారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా సీఎం తీర్మానం ప్రవేశపెట్టడాన్ని విపక్ష అన్నాడీఎంకే తప్పుబట్టింది. దీన్ని రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించింది. గవర్నర్, డీఎంకే సర్కారు మధ్య ఎంతోకాలంగా నిప్పు ఉప్పు వంటి పరిస్థితి నెలకొని ఉంది.

భారత అంబాసిడర్లు

వచ్చే పాతికేళ్లలో ఎన్నారైలది కీలక పాత్ర • 17వ ప్రవాసీ భారతీయ దివస్‌లో మోదీ

అతిథులుగా హాజరైన సురినామ్, గయనా అధ్యక్షులు



అతిథులనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఇండోర్: ప్రవాస భారతీయులను విదేశీ గడ్డపై భారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. రాబోయే 25 ఏళ్ల అమృతకాల ప్రయాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సోమవారం 17వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రత్యేక గౌరవ అతిథిగా సురినామ్ అధ్యక్షుడు చంద్రికాప్రసాద్ సంతోఖీ, ముఖ్య అతిథిగా గయనా అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ హాజరయ్యారు. 66 దేశాల నుంచి వచ్చిన ఎన్నారైలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే...

ప్రవాసీల ఘనతలను రికార్డు చేయాలి

''ఎన్నారైలు భారత దూతలు. మన యోగా, ఆయుర్వేదం, హస్తకళలు, చిరుధాన్యాలు, కాటేజీ పరిశ్రమకు మీరు బ్రాండ్ అంబాసిడర్లు. ప్రపంచ వేదికపై భారత్ పాత్ర మీ వల్లే బలోపేతం కానుంది. స్కిల్ క్యాపిటల్‌గా కూడా ఎదిగే సామర్థ్యం భారత్‌కుంది. ప్రపంచ ప్రగతికి ఇంజన్‌గా మారనుంది. భారత్ గురించి తెలుసుకొనేందుకు ప్రవాసీల సంతానం ఆసక్తి చూపుతుండడం శుభపరిణామం. భారతీయులు ఎన్నో దేశాలకు వలస వెళ్లి శతాబ్దాలుగా స్థిరపడ్డారు. వారి జీవితాన్ని, ఎదుర్కొన్న కష్టానష్టాలు, చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను రికార్డు చేయాల్సిన అవసరముంది. ఇందుకు భారత వర్సిటీలు చొరవ తీసుకోవాలి. వారి అనుభవాలు, జ్ఞాపకాలను ఆడియో–విజువల్, అక్షరరూపం నమోదు చేయాలి.

శతాబ్దాల క్రితమే అంతర్జాతీయ వాణిజ్యం

జీ20 సారథ్య బాధ్యతను ఒక మంచి అవకాశంగా భావిస్తున్నాం. మన గురించి ప్రపంచదేశాలకు తెలియజేయడానికి ఇది సరైన వేదిక. ప్రపంచంలో భారత్ పాత్ర గణనీయంగా పెరుగుతోంది. మన మాటకు, సందేశానికి ఎంతో విలువ ఉంది. కరోనా టీకాలను దేశీయంగానే అభివృద్ధి చేసుకున్నాం. 220 కోట్ల టీకా డోసులను ఉచితంగా అందించాం.

మన అభివృద్ధి అసాధారణం, అద్వితీయం

ప్రపంచంలోని ఐదు అత్యున్నత ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటిగా మారింది. అత్యధిక స్టార్టప్‌లు ఉన్న మూడో దేశం మనదే. నేడు ప్రపంచం భారత్ వైపు చూస్తోంది. కొన్నేళ్లుగా మనం సాధించిన ఘనతలు అసాధారణం, అద్వితీయం. ప్రపంచంలో జరుగుతున్న మొత్తం డిజిటల్ లావాదేవీల్లో 40 శాతం కేవలం భారత్‌లోనే జరుగుతున్నాయి. మనకు అత్యాధునిక స్పేస్ టెక్నాలజీ ఉంది. అంతరిక్షంలోకి ఒకేసారి 100 ఉపగ్రహాలను పంపించగల సత్తా మన సొంతం. ఎన్ఆర్ఐల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం. వారికి అవసరమైన సాయం కచ్చితంగా అందిస్తాం. మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని కాపాడాలని ఎన్ఆర్ఐలను కోరుతున్నాం. విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను మరింత పెంచాలని, మన దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని విన్నవిస్తున్నాం'' అని ప్రధాని మోదీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని సందర్శించాలని ఎన్ఆర్ఐలకు సూచించారు. సురక్షిత, చట్టబద్ధ వలసల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని విడుదల చేశారు.

దర్శన్ సింగ్‌కు ప్రవాసీ సమ్మాన్ అవార్డు

విదేశాల్లో స్థిరపడిన భారతీయులకు ఇచ్చే ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డును అమెరికా వ్యాపారవేత్త, దాత దర్శన్ సింగ్ దలీవాల్‌కు ప్రదానం చేశారు. పంజాబ్‌లోని పటియాలాకు చెందిన ఆయన అమెరికాలో వ్యాపారవేత్తగా ఎదిగారు. భారత్‌తోపాటు పలు దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భారత్‌లోనే చదివా: గయానా అధ్యక్షుడు

భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని గయానా అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ పేర్కొన్నారు. ''నేను భారత్‌లో చదువుకున్నా. భారతీయుల ప్రేమాభిమానాలు నాకు తెలుసు'' అన్నారు. భారత్ తమకు నమ్మకమైన భాగస్వామి అని సురినామ్ అధ్యక్షుడు సంతోఖీ హర్షం వ్యక్తం చేశారు.

21వ శతాబ్దపు కౌరవులు!

ఆరెస్సెస్ సభ్యులపై రాహుల్ విమర్శలు

అంబాలా/చండీగఢ్: ఆరెస్సెస్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సంఘ్ సభ్యులు 21వ శతాబ్దపు కౌరవులని మండిపడ్డారు. భారతీయ విలువలకు సంఘ్ వ్యతిరేకమని ఆరోపించారు. సంఘ్ కార్యకర్తలు హర హర మహాదేవ్, జైశ్రీరామ్ అంటూ ఏనాడూ నినదించలేదని ఆక్షేపించారు. భారత్ జోడో యాత్రలో సోమవారం హరియాణాలోని అంబాలాలో ఆయన మాట్లాడారు. ''మహాభారతం హరియాణాతో ముడిపడి ఉంది. కౌరవులెవరు? మొదట 21వ శతాబ్దపు కౌరవుల గురించి చెప్పబోతున్నా. వారు చేతిలో లాఠీలు పట్టుకుంటారు. శాఖలు నిర్వహిస్తుంటారు. మన దేశంలోని బిలియనీర్లు ఆ కౌరవుల ఎదుట సాగిలపడుతున్నారు. పాండవులెప్పుడైనా పెద్ద నోట్లను రద్దు చేశారా? తప్పుడు జీఎస్టీ అమలు చేశారా?'' అని ప్రశ్నించారు. పాండవులు తపస్వులు గనుక ఎన్నడూ అలా చేయలేదన్నారు. పరస్పరం జైశ్రీరామ్ అంటూ పలుకరించుకోవాలని ప్రజలకు సూచించారు.

రాహుల్ 'పూజారి' వ్యాఖ్యలపై విమర్శలు

న్యూఢిల్లీ: తపస్వులకే తప్ప పూజారులకు భారత్‌లో స్థానం లేదన్న వ్యాఖ్యలతో రాహుల్ తమను చులకన చేశారంటూ ఆలయ పూజారులు మండిపడ్డారు. ప్రయాగ్‌రాజ్ సహా పలుచోట్ల ఆయన దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు.

కుంగుతున్నా వదలట్లేదు

- ప్రతీ నిమిషం ప్రమాదమే
- జోషీమఠ్ వాసులకు ప్రభుత్వ హితవు

డెహ్రాడూన్: భూమి కుంగిపోతున్నా సొంతింటిని, స్వస్థలాలను వదిలి వెళ్లేందుకు జోషీమఠ్ వాసులు ససేమిరా అంటున్నారు. ఖాళీ చేయాలంటూ ఇప్పటికే దాదాపు 200కుపైగా ఇళ్లకు అధికారులు ఎరుపు రంగు పూశారు. వెంటనే సురక్షిత శిబిరాలకు లేదా అద్దె భవనాలకు తరలిపోవాలని, ఒక్కో కుటుంబానికి నెలకు రూ.4,000 చొప్పున ఆరునెలలపాటు ఆర్థికసాయం అందిస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం మరో 68 ఇళ్లకు పగుళ్లు పడ్డాయి. దీంతో కుంగిన, దెబ్బతిన్న ఇళ్ల సంఖ్య 678కి పెరిగింది. అయినా పలువురు ఇళ్లు వీడటం లేదంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సంధూ సోమవారం ఆందోళన వ్యక్తంచేశారు. 'ప్రతి నిమిషమూ అత్యంత ప్రధానం. వెంటనే ఇళ్లను వీడండి'' అని కోరారు. ''ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర బృందాలు ఇప్పటికే జోషిమఠ్‌లో సహాయ, పునరావాస చర్యల్లో నిమగ్నమయ్యాయి. భూమి కుంగడంతో పగిలిన తాగు నీటి సరఫరా పైపులను పునరుద్ధరించాలి. లేదంటే పెద్దమొత్తంలో నీరు దిగువ భూముల్లో ఇంకి త్వరగా మరింతగా కుంగే ప్రమాదం పెరుగుతుంది'' అని ఆయన అన్నారు. కాగా, ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ సోమవారం డిమాండ్‌చేసింది. కుటుంబానికి రూ.5,000 చాలా తక్కువ మొత్తమని, సర్వస్వం కోల్పోతున్న ఒక్కో బాధితునికి రూ.50వేలు ఇవ్వాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ అభిప్రాయపడ్డారు.



రణరంగంగా బ్రెజిల్

బోల్సోనారో మద్దతుదారుల రచ్చ

- అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టు, కాంగ్రెస్, భవనాల ఆక్రమణ
- రంగంలోకి సైన్యం, అరెస్టులు



పార్లమెంట్ భవనాన్ని వేలాది మంది ఆందోళనకారులు చుట్టుముట్టిన దృశ్యం

రియో డి జనీరియో: బ్రెజిల్ రాజధాని నగరం బ్రసీలియాలో మాజీ దేశాధ్యక్షుడు జైర్ బోల్సోనారో మద్దతుదారులు దురాక్రమణకు దిగారు. ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో లూయిజ్ ఇన్సియో లూలా డ సిల్వా చేతిలో బోల్సోనారో ఓడిపోవడం జీర్ణించుకోలేని ఆయన మద్దతుదారులు ఆదివారం రాజధానిలోని అత్యంత కీలకమైన భవనాలపై దాడికి తెగించారు. దేశాధ్యక్షుడి అధికార నివాసం, కాంగ్రెస్, సుప్రీంకోర్టు భవనాల ముందున్న బారికేడ్లను బద్దలుకొట్టి, భవనాల గోడలెక్కి అద్దాలు, కిటికీలు ధ్వంసంచేశారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు కూర్చొనే ప్రధాన బల్లాను ధ్వంసంచేశారు. కోర్టు ఆవరణలోని పురాతన విగ్రహాన్ని కూలదోశారు. ''బోల్సోనారో నేతృత్వంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం చర్యలు తీసుకోవాలి. డ సిల్వాను దింపేయాలి'' అని డిమాండ్‌చేస్తున్నారు. భవనాల్లో ఫర్నిచర్, కంప్యూటర్లనూ ధ్వంసంచేశారు. వారాంతం కావడంతో భవనాల్లో సిబ్బంది అంతగా లేరు.

ఊహించని ఘటనతో ఉలిక్కిపడిన సైన్యం వెంటనే రంగ ప్రవేశం చేసింది. భవనాల ప్రాంగణాల్లోని ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్‌లను ప్రయోగించింది. 300 మందిని అరెస్ట్‌చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని బోల్సోనారో ఒప్పుకోక మద్దతుదారులను ఉసిగొల్పడం ఇంతటి ఆందోళనకు కారణమైంది. రెండేళ్ల క్రితం అమెరికా పార్లమెంట్‌పై డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు చేసిన దాడిని ఈ ఘటన గుర్తుకుతెచ్చింది.

ఫాసిస్టు శక్తుల విలయం: డసిల్వా

ఆందోళనలపై డ సిల్వా ఆగ్రహించారు. ''ఫాసిస్ట్ శక్తులు చెలరేగిపోయాయి. దీనిపై సత్వరం స్పందించని పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవు' అన్నారు. ఇలాంటి ఘటన జరిగే ప్రమాదముందని కొన్నినెలలుగా రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తుండటం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ 30న డ సిల్వా గెలుపు తర్వాత మొదలైన నిరసనలు ఆనాటి నుంచి ఆగలేదు. రోడ్ల దిగ్బంధం, వాహనాల దగ్ధం, సైన్యం జోక్యంచేసుకోవాలంటూ సైనిక కార్యాలయాల వద్ద ఆందోళనకారుల బైఠాయింపులతో నిరసనలు దేశమంతటా కొనసాగుతుండటం తెల్సిందే.

ప్రపంచ దేశాధినేతల ఆందోళన

బ్రెజిల్‌లో అధికార కేంద్రాలైన ప్రధాన భవనాలపై దాడిని పలు ప్రపంచ దేశాలు ఖండించాయి. 'ప్రజాస్వామ్యాన్ని కూలదోసే ప్రతి చర్యనూ ఖండిస్తాం. పాలనలో అధ్యక్షుడు డ సిల్వాకు సాయంగా ఉంటాం' అని అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యానించారు. 'ఎన్నికల ద్వారా డ సిల్వా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజాభీష్టాన్ని గౌరవించాలి' అంటూ దాడులను ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ తీవ్రంగా తప్పుబట్టారు. ఘటనపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఆందోళనకారులనుద్దేశిస్తూ.. 'ఎన్నికలు అనే ప్రజాస్వామ్య సంప్రదాయాలను అందరూ గౌరవించాల్సిందే. ఈ విషయంలో డ సిల్వా సర్కార్‌కు మా పూర్తి మద్దతు ఉంటుంది' అని మోదీ అన్నారు.

ఎయిర్ హోస్టెస్‌తో అసభ్య ప్రవర్తన!

ఇద్దరు తాగుబోతు ప్రయాణికుల అరెస్ట్

పట్నా: భారతీయ విమానాల్లో ప్రయాణికుల అనుచిత ప్రవర్తన ఘటనలు మరువకముందే ఆదివారం మరో ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఢిల్లీ నుంచి పట్నాకు వస్తున్న ఇండిగో విమానంలో తప్ప తాగిన ఇద్దరు ప్రయాణికులు ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించారని వార్తలొచ్చాయి. విమాన సిబ్బందితోపాటు తోటి ప్రయాణికులతోనూ గొడవ పడినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, వీరు విమానంలో పట్నాకు వస్తున్నట్లు ఇండిగో సంస్థ ఫిర్యాదుచేయంతో పట్నాలో దిగగానే పట్నా ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బిహార్‌లో మద్య నిషేధం అమల్లో ఉన్నందున మద్యసేవనం రాష్ట్రపరిధిలో నేరం. మద్యం తాగి బిహార్‌లో అడుగుపెట్టినందుకే కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. విమానంలో వీరు తోటి ప్రయాణికులతో అనుచితంగా ప్రవర్తించినట్లు అధికారంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఎవరైనా ఫిర్యాదు చేసే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇండియన్ ఎయిర్‌లైన్స్‌పై డీజీసీఏ సీరియస్

న్యూఢిల్లీ: పారిస్–న్యూఢిల్లీ ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణికుల అనుచిత ప్రవర్తనపై వివరణ ఇవ్వాలని సంస్థను డీజీసీఏ సోమవారం ఆదేశించింది. గత ఏడాది డిసెంబర్ ఆరున జరిగిన రెండు ఘటనలను అందులో ప్రస్తావించింది. సిబ్బంది సూచనలను లెక్కచేయకుండా బాత్రూమ్‌లో ధూమపానం చేస్తున్న వ్యక్తిపై, తోటి ప్రయాణికురాలి సీటు, దుప్పటిపై మూత్రవిసర్జన చేసిన మరో తాగుబోతు ప్రయాణికుడిపై అప్పుడే వెంటనే ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలపాలని డీజీసీఏ సూచించింది. 'ఏదైనా విమానంలో అనుకోని ఘటన జరిగితే ల్యాండింగ్ జరిగిన 12 గంటల్లోపు మాకు నివేదించాలి. కానీ డిసెంబర్ ఆరున ఘటన జరిగితే జనవరి ఆరున మేం అడిగేదాకా ఆనాటి ఘటనపై సంస్థ ఎలాంటి రిపోర్ట్‌చేయలేదు. అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికుల విషయంలో మీ వైఖరి నిబంధనలకు అనుగుణంగా లేదు. రెండు వారాల్లోపు నివేదించండి. తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం' అని డీజీసీఏ పేర్కొంది.

అమెరికాలో తొలి సిక్కు మహిళా జడ్జి



హూస్టన్: అమెరికాలోని హ్యారిస్ కౌంటీ జడ్జిగా భారత సంతతికి చెందిన మన్‌ప్రీత్ మోనికా సింగ్ బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో మొట్టమొదటి సిక్కు మహిళా జడ్జిగా ఆమె చరిత్ర సృష్టించారు. టెక్సాస్ లా నంబర్–4లోని హ్యారిస్ కౌంటీ సివిల్ కోర్ట్‌లో న్యాయమూర్తి అయిన మన్‌ప్రీత్ హూస్టన్‌లోనే పుట్టి, పెరిగారు. ప్రస్తుతం బెల్లెయిర్‌లో భర్త, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. ఈమె తండ్రి 1970ల్లో భారత్ నుంచి వలస వచ్చారు. మన్‌ప్రీత్ గత 20 ఏళ్లుగా లాయర్ వృత్తిలో ఉన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత సంతతికి చెందిన జడ్జి రవి శాండిల్ అధ్యక్షత వహించారు. రవి శాండిల్ టెక్సాస్ రాష్ట్ర మొదటి ఆసియా సంతతి జడ్జి కూడా. అమెరికాలో సుమారు 5 లక్షల మంది సిక్కులుండగా, వారిలో 2 వేల మంది హూస్టన్ ప్రాంతంలోనే నివసిస్తున్నారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
మంగళవారం । 10 । జనవరి । 2023



ఎస్ఐడీబీఐ ప్రారంభం

అంబత్తూరు పారిశ్రామికవాడలోని కోరట్టూరులో చిన్న తరహా పరిశ్రమ అభివృద్ధి బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ)ను సోమవారం ఏర్పాటు చేశారు. దీనిని ఎస్ఐడీబీఐ ఛైర్మన్ శివసుబ్రమణియన్ రమణన్ ప్రారంభించారు.
- సాక్షి, చెన్నై

అనూహ్యం.. అసామాన్యం.. తమిళ రాజకీయ చరిత్రలో ఊహించని పరిణామం.. గవర్నర్, ప్రభుత్వం మధ్య పూడ్చలేని అగాథం.. ఎవరికి వారే.. యమునాతీరే అన్న చందం.. నువ్వెంతంటే.. నువ్వెంతనే వరకు వచ్చిన వ్యవహారం.. ఇవన్నీ సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో నెలకొన్న అవాంఛనీయ ఘటనల ఫలితం. ఒక్కమాటలో చెప్పాలంటే ఇన్నాళ్లూ అంతర్గతంగా ఉన్న విభేదాలు సోమవారం శాసనసభ వేదికగా బట్టబయలయ్యాయి. తొలుత డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ పాఠంలోని కీలక విషయాలను వదిలి పెట్టడమే కాకుండా ఇతర అంశాలను వెల్లడించి గవర్నర్ తన ఉద్దేశాన్ని చాటగా.. గవర్నర్ ప్రసంగంలోని అసంబద్ధమైన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు ప్రత్యేక తీర్మానం చేసి ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా వెనక్కి తగ్గేదేలే.. అన్నట్లు ప్రతిస్పందించడం సంచలనం కలిగించింది.



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

సభలో మాటల యుద్ధం!

రచ్చ..రచ్చ

- తమిళనాడు శాసనసభలో తొలిరోజు అనూహ్య పరిణామాలు
- ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ పాఠంలో ఇతర అంశాలను జోడించిన గవర్నర్ ఆర్ఎన్ రవి
- తమిళనాడు, ద్రవిడం అనే పదాలనే ఉచ్ఛరించని వైనం
- గవర్నర్ తీరును నిరసిస్తూ ప్రసంగాన్ని బహిష్కరించిన డీఎంకే మిత్రపక్షాలు
- చరిత్రలో తొలిసారి గవర్నర్‌కు వ్యతిరేకంగా సభలో అధికారపక్షం తీర్మానం
- గవర్నర్ ప్రసంగంలోని అనవసర వ్యాఖ్యలను తొలగించాలని నిర్ణయం
- జాతీయ గీతాలాపనకు ముందే సభ నుంచి వెళ్లిపోయిన గవర్నర్
- తమిళనాడు వర్ధిల్లాలంటూ డీఎంకే సభ్యుల నినాదాలు



గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశ పెడుతున్న సీఎం స్టాలిన్



అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోతున్న గవర్నర్

సాక్షి, చెన్నై: నివురుగప్పిన నిప్పు భగ్గుమంది. ఇన్నాళ్లూ ఎడమొహం.. పెడమొహంగా ఉన్న గవర్నర్ ఆర్ఎన్ రవి, అధికార పక్ష నాయకులు బహిరంగంగా తమ అసంతృప్తిని వెళ్లగక్కేందుకు సోమవారం శాసనసభ వేదికైంది. వివరాలు.. రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో తొలిసారి సోమవారం రాజకీయ సాంప్రదాయాలు మంటగలిశాయి. డీఎంకే ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదవకుండా, ఇతర అంశాలను గవర్నర్ ఆర్ఎన్ రవి క్రోడీకరించడం వివాదానికి దారి తీసింది. తమిళనాడు, ద్రవిడం అన్న పదాలనే కాదు, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తో పాటు తమిళ రాజకీయ దిగ్గజాల పేర్లను కూడా ప్రస్తావించకుండా ప్రసంగాన్ని ముగించిన గవర్నర్ తీరును వ్యతిరేకిస్తూ సభలో నినాదాలు మారుమోగాయి. ఆయన ప్రసంగానికి వ్యతిరేకంగా సీఎం ఎంకే స్టాలిన్ సభలో ప్రత్యేక తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. దీంతో షాక్‌కు గురైన గవర్నర్ జాతీయ గీతానికి ముందే సభ నుంచి అర్ధాంతరంగా బయటకు వెళ్లి పోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మిత్రపక్షాల ఆగ్రహం..

కొత్త సంవత్సరంలో తొలి అసెంబ్లీ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. మొదటిరోజు ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్ ఆర్ఎన్ రవిని స్పీకర్ అప్పావు ఆహ్వానించారు. అలాగే ఈసారి ప్రప్రథమంగా పోలీసు గౌరవ వందనం గవర్నర్‌కు దక్కింది. తమిళ తల్లి గీతంతో సభ మొదలు కాగానే, సభకు వచ్చిన వారిని ఆహ్వానిస్తూ, ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ.. తమిళంలో తన ప్రసంగాన్ని గవర్నర్ మొదలు పెట్టారు. తమిళ రచయిత్రి అవ్వయార్ సూక్తులను గుర్తు చేస్తూ ఆంగ్ల ప్రసంగాన్ని అందుకున్నారు. ప్రభుత్వం సిద్ధం చేసి ఇచ్చిన ప్రసంగ పాఠంలోని తమిళనాడు, ద్రవిడం తదితర పదాలనే కాకుండా, ప్రధాన అంశాలను దాట వేస్తూ, సొంత భావాలను రుద్దే విధంగా గవర్నర్ ప్రసంగించడం వివాదానికి దారి తీసింది. భారత రాజ్యాంగ సృష్టికర్త అంబేద్కర్, ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్, అన్నాదురై, కామరాజర్ వంటి నేతల పేర్లను కూడా ఉచ్ఛరించకుండా గవర్నర్ తన ప్రసంగాన్ని తూతూ మంత్రంగా ముగించారు. దీనిని డీఎంకే మిత్ర పక్షాలు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, తమిళర్ వాల్వురిమై కట్చి తదితర పార్టీల ఎమ్మెల్యేలు తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరిస్తూ, తమిళం వర్ధిల్లాలి అన్న నినాదాలు చేస్తూ శాసనసభ నుంచి అధికార డీఎంకే మిత్ర పక్ష పార్టీలన్నీ వాకౌట్ చేశాయి.

సీఎం ప్రత్యేక తీర్మానం..

గవర్నర్ ఆంగ్ల ప్రసంగాన్ని.. స్పీకర్ అప్పావు తమిళంలో తర్జుమా చేశారు. అయితే ఇద్దరి ప్రసంగాలకు మధ్య అనేక అంశాలు భిన్నంగా ఉండడం మరింత వివాదానికి దారి తీసింది. స్పీకర్ తన ప్రసంగాన్ని ముగించగానే సీఎం ఎంకే స్టాలిన్ ప్రత్యేక తీర్మానం సభలో ప్రవేశ పెట్టారు. ప్రభుత్వం సిద్ధం చేసి గవర్నర్‌కు ఇచ్చిన ప్రసంగపాఠంలోని ఆంగ్ల అంశాలు, స్పీకర్ అప్పావు తర్జుమా చేసిన తమిళ ప్రసంగాన్ని మాత్రమే శాసన సభ రికార్డుల్లో పొందుపరచాలని ఆ తీర్మానంలో వివరించారు. ఇతర అంశాలు, వ్యాఖ్యలను తొలగించాలని తీర్మానం ప్రవేశ పెడుతున్నట్లు స్పష్టం చేశారు. దీనిని సభ మొత్తం ఆమోదించాలని కోరారు. దీంతో షాక్‌కు గురైన గవర్నర్ ఈ తీర్మానాన్ని సీఎం స్టాలిన్ చదువుతుండగానే తన సీటు నుంచి లేచి బయటకు వెళ్లిపోయారు. ఆయన వెన్నంటే తాము కూడా వాకౌట్ చేస్తున్నట్లుగా పేర్కొంటూ.. పళణి స్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే సభ్యులు కూడా బయటకు వెళ్లి పోయారు. జాతీయ గీతాలాపనకు ముందే గవర్నర్ సభ నుంచి లేచి బయటకు వెళ్లి పోవడం విమర్శలకు దారి తీసింది. గవర్నర్ బయటకు వెళ్లే సమయంలో డీఎంకే సభ్యులు, మంత్రులు తమిళం వర్ధిల్లాలి, తమిళనాడు వర్ధిల్లాలి అంటూ నినాదాలు పెద్దఎత్తున చేయడం గమనార్హం.

న్యాయ నిపుణులతో స్టాలిన్ సమాలోచన

సాక్షి, చెన్నై: అసెంబ్లీలో ఉదయం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో సోమవారం రాత్రి పార్టీ సీనియర్లు, పార్టీ న్యాయవాద విభాగంలోని చట్ట నిపుణులతో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. ఉదయం సభలో జరిగిన పరిణామాల గురించి వివరణ కోరుతూ రాజ్‌భవన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సాయంత్రం ఓ లేఖ అందినట్లు తెలుస్తోంది. దీంతో డీఎంకే సీనియర్లు, చట్ట నిపుణులతో రాత్రి ఏడున్నర గంటల సమయంలో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించారు. గవర్నర్ చర్యలను ప్రభుత్వ పరంగానే కాకుండా, డీఎంకే పరంగా కూడా ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గవర్నర్‌కు వ్యతిరేకంగా 13వ తేదీన రాజ్‌భవన్‌ను ముట్టడించనున్నామని వీసీకే నేత తిరుమావళవన్ ప్రకటించారు.

స్పీకర్ ఆవేదన..

సభ వాయిదా అనంతరం స్పీకర్ అప్పావు అధ్యక్షతన సభా వ్యవహారాల కమిటీ సమావేశమైంది. అసెంబ్లీ సమావేశాలు నాలుగు రోజుల పాటు (ఈనెల 13వ తేదీ వరకు) నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ఈ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలు, కీలక ముసాయిదాలపై అభిప్రాయాలు తీసుకున్నారు. అనంతరం స్పీకర్ అప్పావు మీడియాతో మాట్లాడుతూ.. గవర్నర్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో తొలిసారి గవర్నర్ చర్యలు విమర్శలకు దారి తీశాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలు తన నేతృత్వంలోని సభలో జరగడం మనసును గాయం చేసిందన్నారు. భారత రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్ పేరును కూడా గవర్నర్ ప్రస్తావించకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. జాతీయ గీతానికి ముందే బయటకు వెళ్లి పోవడం, సభా సాంప్రదాయాలను పాటించకపోవడం వంటి అనాగరిక చర్యలకు బాధ్యత గల పదవిలో ఉన్న వ్యక్తులు పాల్పడడం తీవ్ర విచారకరమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గవర్నర్ చర్యలకు వ్యతిరేకంగా తమిళనాట పలువురు సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు గుప్పించడం గమనార్హం.



సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చిన డీఎంకే మిత్ర పక్ష పార్టీల సభ్యులు

గవర్నర్‌కు వ్యతిరేకంగా ప్రజా పోరాటం

డీఎంకే మిత్ర పక్ష పార్టీల ఎమ్మెల్యేలు, శాసనసభా పక్ష నేతలు అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ రాజకీయ సాంప్రదాయాలకు గవర్నర్ పాతరేశారని ధ్వజమెత్తారు. రాజ్ భవన్ వేదికగా ఆయన సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నాడని మండిపడ్డారు. రాష్ట్ర హక్కులను, తమిళ ప్రజల మనో భావాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న గవర్నర్ తీరును ఖండిస్తూ ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ తీర్మానాలను, ముసాయిదాలను రాజ్‌భవన్‌లో తుంగలో తొక్కిన ఈ గవర్నర్, ప్రస్తుతం అసెంబ్లీ వేదికగా తమిళ ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరించి తాను ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా నిరూపించుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే కాదు, తమిళనాడు అసెంబ్లీ చరిత్రలో ఏ గవర్నర్ వ్యవహరించని విధంగా ఆర్ఎన్ రవి చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. ఇక అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి, ప్రధాన ప్రతిపక్ష నేత పళణి స్వామి మాట్లాడుతూ, గవర్నర్ సభలో ఉన్న సమయంలో సీఎం స్టాలిన్ సభా హక్కులను ఉల్లంఘించారని ధ్వజమెత్తారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా ఆయన ముందే తీర్మానం చేయడాన్ని ఖండిస్తూ తాము సభ నుంచి వాకౌట్ చేశామన్నారు. బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ మాట్లాడుతూ, ప్రభుత్వం సిద్ధం చేసిన పాఠాన్ని చదివి, వారికి భజన చేయాల్సిన అవసరం గవర్నర్‌కు లేదన్నారు. అస్సలు ప్రసంగ పాఠంలోని వివరాలను గవర్నర్‌కు పంపించి ముందుగా పంపించి ఆమోదం పొందలేదని ఆరోపించారు.



సభ నుంచి వాకౌట్ చేసిన తరువాత మీడియాతో మాట్లాడుతున్న ప్రధాన ప్రతిపక్ష నేత పళణిస్వామి

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయవాద సంఘం ఎన్నికలు వాయిదా



హైకోర్టు ఆవరణలో న్యాయవాదుల వాగ్వాదం

సాక్షి, చెన్నై: న్యాయవాద సంఘం ఎన్నికలు వివాదానికి దారి తీశాయి. దీంతో ఎన్నికలను ప్రత్యేక అధికారి వాయిదా వేశారు. వివరాలు.. మద్రాసు హైకోర్టు న్యాయవాద సంఘం ఎన్నికలు ఆరేళ్ల అనంతరం సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికలు, అదే రోజు రాత్రిలోపు ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో 4,696 మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమయ్యారు. హైకోర్టు ఆవరణలోని కార్యాలయంలో ఉదయం ఎన్నికలు ప్రారంభమయ్యాయి. కాసేపటికి వివాదం బయలు దేరింది. బ్యాలెట్ పేపర్లకు ఉపయోగించే క్యూర్ కోడ్‌లకు సంబంధించిన పేపర్లను ఒక వర్గం మొత్తంగా తీసుకెళ్లి పోవడం రచ్చకు దారి తీసింది. వివాదం ముదరడంతో ఎన్నికలను వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి కబీర్ నిర్ణయం తీసుకున్నారు.

విద్యుత్ కార్మికుల సమ్మెపై హైకోర్టు స్టే

సాక్షి, చెన్నై: మంగళవారం నుంచి విద్యుత్ కార్మికులు చేపట్టదలిచిన సమ్మెపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. వివరాలు.. వేతనాల పెంపు, ఖాళీల భర్తీ తదితర డిమాండ్ల సాధన కోసం విద్యుత్ బోర్డులో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది సమ్మెకు సిద్ధమయ్యారు. దీనిని వ్యతిరేకిస్తూ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. ప్రజలకు అత్యవసర సేవలను అందించే విభాగంలో విద్యుత్ శాఖ కూడా ఉండడంతో, కార్మికులు సమ్మెకు దిగడం తగదంటూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

మహాబలిపురంలో ఉప నగరం

- ఏడు చోట్ల టైడల్ పార్క్‌లు
- ప్రగతిలో దేశానికే మన రాష్ట్రం ఆదర్శం
- అల్పాహార పథకం మార్గదర్శకం
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం

సాక్షి, చెన్నై: మహాబలిపురంలో చెన్నైకు అనుబంధంగా ఉప నగరం ఏర్పాటు చేయనున్నామని అసెంబ్లీలో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రకటించారు. ఏడు చోట్ల మినీ టైడల్ పార్క్‌ల ఏర్పాటు చేయనున్నామని వివరించారు. అనేక రంగాల్లో ప్రగతి పథంలో దూసుకెళ్తున్న ఈ రాష్ట్రం(తమిళనాడు) దేశానికే ఆదర్శంగా పేర్కొన్నారు. అసెంబ్లీలో గవర్నర్ అనేక అంశాలను పక్కన పెట్టినా, కొన్ని కీలక పథకాలను గురించి మాత్రం ప్రసంగించారు. గ్రామీణ విద్యార్థుల కలల సాకారానికి నీట్ రద్దు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 50 ఏళ్లలో ఈ రాష్ట్రం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందినట్లు వివరించారు. కొన్ని పథకాలలో దేశానికే ఈ రాష్ట్రం ఆదర్శంగా ఉందన్నారు. ఇందులో పాఠశాలలో అల్పాహార పథకం ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా పేర్కొన్నారు. చెన్నై నగరం విస్తరిస్తోందని గుర్తు చేస్తూ, దీనికి అనుబంధంగా మహాబలిపురంలో ఉప నగరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెన్నై మినహా ఇతర 7 నగరాల్లో టైడల్ పార్కులను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. కావేరి నదీ తీరంలోని మేఘదాతు వద్ద డ్యాం నిర్మాణ ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని వ్యాఖ్యలు చేశారు. పరందూరు విమానాశ్రయం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింత దోహదకరంగా ఉంటుందన్నారు.



పక్క పక్కనే పళణి, పన్నీరు

గత కొంతకాలంగా అన్నాడీఎంకేలో నెలకొన్న విభేదాల గురించి తెలిసిందే. ఏడాదిలో తొలి సమావేశం కావడంతో అన్నాడీఎంకే శిబిరాలకు చెందిన నేతలు పళణి స్వామి, పన్నీరు సెల్వం సభకు హాజరయ్యారు. ఈ ఇద్దరి మధ్య వివాదం సాగుతున్న నేపథ్యంలో వీరికి అసెంబ్లీలో పక్కపక్కనే సీట్లు ఏర్పాటు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే శాసన సభా పక్ష ఉపనేత హోదాల్లో ఈ ఇద్దరికి గతంలో లాగే ఈసారి కూడా సీట్లు కేటాయించారు. అయితే వీరు పక్క పక్కనే కూర్చున్నా, ఒకరినొకరు చూసుకోలేదు. కనీసం పలకరించుకోనూ లేదు. ఇక సీఎం స్టాలిన్ వారసుడు, మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌కు సభలో మొదటి వరుసలో సీటు కేటాయించారు. ఇదిలా ఉండగా గత వారం గుండెపోటుతో మరణించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే తిరుమగన్ చిత్ర పటాన్ని అసెంబ్లీ ఆవరణలోని కాంగ్రెస్ శాసనసభా పక్ష కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ చిత్ర పటాన్ని సీఎం స్టాలిన్, స్పీకర్ అప్పావు, కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత సెల్వ పెరుంతొగై ఆవిష్కరించారు.

• అపూర్వ కలయిక



50 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్‌కేపీడీ పాఠశాల 1970-71 బ్యాచ్ ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు ఐదు దశాబ్దాల తరువాత కలుసుకున్నారు. ఈ మేరకు స్థానిక జార్జిటౌన్‌లోని ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీ అమ్మవారి అభిషేక ఉభయ దారులంతా ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ, ఉభయదారులైన ఊరా ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీకన్యపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి అభిషేక ఉభయ దారులంతా కలుసుకోవడం సంతోషం కలిగించిందన్నారు. ఈ అపూర్వ కలయిక సందర్భంగా అమ్మవారి అభిషేక ఉభయదారులు ఎస్‌కేపీడీ అన్నసత్రం , ఎస్‌కేపీడీ స్కూల్ విద్యార్థుల ఇంగ్లీషు తరగతుల కోసం రూ. 25 వేలు విరాళాన్ని అందజేశారు. - కొరుక్కుపేట

సదరన్ రైల్వే రికార్డు స్థాయిలో వృద్ధి

కొరుక్కుపేట: ప్రయాణికులు, సరుకు రవాణా విభాగాల్లో సదరన్ రైల్వే గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-డిసెంబర్ మధ్య) 27 మిలియన్ టన్నుల ఆరిజినేటింగ్ ఫ్రైట్ లోడింగ్ సాధించి రూ.2,659 కోట్ల ఆదాయం ఆర్జించింది. అలాగే 468 మిలియన్ల మంది ప్రయాణికులను చేరవేసి రూ. 4689 కోట్ల ఆదాయం పొంది రికార్డు సృష్టించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన సదరన్ రైల్వే విడుదల చేసింది. సమష్టి ప్రయత్నాల ఫలితంగా సదరన్ రైల్వే క్రమంగా ప్రయాణికులు, సరుకు రవాణాలో బలమైన వృద్ధిని సాధిస్తోందని, మునుపటి సంవత్సరం కంటే మెరుగైన పనితీరును కనబరిచిందని పేర్కొంది. 2022 డిసెంబర్‌లో మాత్రమే సదరన్ రైల్వే 2.846 మెట్రిక్ టన్నుల సరుకు రవాణాను నమోదు చేసి రూ. 314.52 కోట్లు ఆదాయాన్ని నమోదు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల రద్దీని, పండుగలను దృష్టిలో పెట్టుకొని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ ప్యాసింజర్ రైళ్లు, ప్రత్యేక రైళ్లను నడపడం ద్వారా ఎప్పటికప్పుడు నిరంతర ప్రయత్నాలు చేస్తోందని బోర్డు లక్ష్యాన్ని 12.4 శాతం అధిగమించి రూ.4689.46 కోట్ల ఆదాయం నమోదు చేయబడిందని వెల్లడించింది.

సంక్రాంతి కానుక పంపిణీకి శ్రీకారం



సంక్రాంతి కానుకల పంపిణీ

- చెన్నైలో ప్రారంభించిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చెన్నైలో సీఎం స్టాలిన్ ప్రారంభించారు. పలువురు కుటుంబ కార్డుదారులకు రూ.1000 నగదుతో పాటు వివిధ వస్తువులను అందజేశారు. వివరాలు.. రాష్ట్రంలోని 2.19 కోట్ల మంది లబ్ధిదారులకు సంక్రాంతి కానుకను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రూ. 1000 నగదు, కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, ఒక చెరుకు అందించాలని నిర్ణయించారు. ఈ పంపిణీ కోసం 33 వేల రేషన్ దుకాణాల్లో సర్వం సిద్ధం చేశారు. నిల్వ ఉన్న బియ్యం, చక్కెరే కాకుండా కొత్తగా నాణ్యతతో దిగుమతి చేసిన వాటిని పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టారు. ఉదయం ఐలాండ్ గ్రౌండ్ ఆవరణలో అన్నా సత్యానగర్‌లో ఉన్న రేషన్ దుకాణంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లో పంపిణీ మొదలెట్టారు. రోజుకు 200 మందికి ఆయా రేషన్ దుకాణాల్లో కానుకలను అందజేశారు. ఇందుకోసం ఇప్పటికే రేషన్ కార్డుదారులకు టోకెన్లను అందజేశారు. ఈ పంపిణీ సక్రమంగా జరిగే విధంగా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

సీఎం సమక్షంలో ఒప్పందాలు

సముద్ర తీరాల్లో ఖనిజ సంపదను వర్తక రీత్యా వెలికితీత, మార్కెటింగ్ కోసం తమిళనాడు మినరల్ కార్పొరేషన్, ఐఆర్ఈఎల్ మధ్య సోమవారం ఒప్పందాలు జరిగాయి. సచివాలయంలో సీఎం స్టాలిన్ సమక్షంలో ఈ ఒప్పందాలపై అధికారులు, ఐఆర్ఈఎల్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు తూత్తుకుడి జిల్లా సత్తాన్ కులంలో, కుదిరైమొళిలో రూ. 1500 కోట్లతో ఏర్పాటు చేయనున్న పరిశ్రమ నుంచి ఏడాదికి రూ. 1,075 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రత్యక్ష , పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

క్లుప్తంగా

ధన్వంతరి పీఠంలో యాగ పూజలు


యాగ పూజలు చేస్తున్న వేద పండితులు

వేలూరు: రాణిపేట జిల్లా వాలాజలోని శ్రీధన్వంతరి ఆరోగ్య పీఠంలో లోక క్షేమం కోసం లక్ష నాణేలను ఉంచి లక్ష్మీ కుబేరునికి ప్రత్యేక యాగ పూజలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పీఠాధిపతి మురళీధరస్వామిజీ ఆధ్వర్యంలో పూజలు జరుగనున్నాయి. రుద్ర హోమం, శ్రీధన్వంతరి, మహా సుదర్శన, శ్రీ మహాలక్ష్మి హోమ పూజలు జరుగుతున్నాయి. యాగ పూజల్లో బీజేపీ అధికార ప్రతినిధి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ చొంగర్ శాస్త్రీ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు.

ఆండిపట్టి విద్యార్థిని ప్రతిభ

తిరువొత్తియూరు: తమిళనాడు ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన టైప్ రైటింగ్ పరీక్షలో తేని జిల్లా ఆండిపట్టి విద్యార్థిని మొదటి స్థానంలో నిలిచింది. ఈ పరీక్షకు 83,500 మంది హాజరయ్యారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఆండిపట్టికి చెందిన మోనిషా మొదటి ర్యాంకు సాధించింది. ఆమెను టైప్ రైటింగ్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు అభినందించారు.

గీతంలో సంప్రదాయ వంటకాలు

సాక్షి, చెన్నై: గీతం రెస్టారెంట్లలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వ్యవస్థాపకుడు మురళీ ఎస్ భట్ తెలిపారు. సంక్రాంతి వేడుకలు, పొంగల్ ఆఫర్ గురించి ఆయన వివరించారు. సంక్రాంతి సంబరం పేరిట 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వివిధ రకాల వంటకాలతో పసందైన విందును ఆహార ప్రియులకు అందించనున్నామని వివరించారు. తమిళనాడు సంప్రదాయ వంటకాలు, కొంగునాడు వంటకాలను ప్రత్యేకంగా ఉంచనున్నట్లు తెలిపారు. చెన్నైలోని టీనగర్, వేళచ్చేరి, తొరైపాక్కాం, మేడవాక్కం, నావలూరు, పల్లావరం, సిరుచ్చేరి, పెరుంగుడిలలోని గీతం ఫుడ్ రెస్టారెంట్లలో ఈ ఫెస్టివల్ జరుగుతుందని వెల్లడించారు.

ఈఓను సస్పెండ్ చేయాల్సిందే

- పొదటూరుపేట సర్పంచ్, వార్డు సభ్యుల డిమాండ్
- కళ్లకు నల్లగుడ్డలు ధరించి నిరసన


కళ్లకు నల్లగుడ్డలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

తిరువళ్లూరు/పళ్లిపట్టు: పొదటూరుపేట మేజర్ పంచాయతీ అభివృద్ధిని అడ్డుకుంటూ సర్పంచ్, వార్డు సభ్యులను నిర్లక్ష్యం చేస్తున్న కార్యనిర్వాహణ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకేకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు కళ్లకు నల్లగుడ్డలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తిరువళ్లూరు జిల్లా పొదటూరుపేట మేజర్ పంచాయతీకి అధ్యక్షుడిగా అన్నాడీఎంకేకు చెందిన ఏజీ రవిచంద్రన్ ఉన్నారు. కార్యనిర్వాహణ అధికారి(ఈఓ)గా ప్రకాష్ విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీలో జరిగే అభివృద్ధి పనుల్లో అధ్యక్షుడు, ఈఓ సమన్వయంతో పని చేయాల్సి ఉంది. అయితే ఈఓ పంచాయతీ అధ్యక్షుడు, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అలాగే పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని అభియోగాలు ఉన్నాయి. దీనిపై గతంలో సర్పంచ్, వార్డు సభ్యులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు సైతం వినతి పత్రం సమర్పించారు. అయినా స్పందన లేకపోవడం, ఈఓ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో సోమవారం ఉదయం కళ్లకు నల్లగుడ్డలు కట్టుకుని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈఓను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ సహా ఉన్నత అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


తిరువళ్లూరులో ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

తిరువళ్లూరు: జిల్లాలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తమిళనాడు దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తిరువళ్లూరులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జయవేల్ మాట్లాడుతూ.. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా 21 రకాల దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. వీరి అర్హతను బట్టి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలుకా పరిధిలోని మురుకంబట్టు, తాళవేడు, ఆరుంగుళం తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న నివాసాల్లో దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. కార్తికేయపురం, చిన్నకడంబూర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని దివ్యాంగులకు పంపిణీ చేయాలన్నారు. తమకు కేటాయించిన 4శాతం రిజర్వేషన్‌ను కచ్చితంగా అమలుచేసి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం కింద దివ్యాంగుల పిల్లలకు సీటును కేటాయించాలన్నారు. నకిలీ గుర్తింపు కార్డులను పొందిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మదురై కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదం

తిరువొత్తియూరు: మదురై కలెక్టరేట్ ప్రాంగణంలోని ఓ గదిలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజలకు అందజేసేందుకు పంచెలు, చీరలు ఇక్కడ నిల్వ ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి ఈ కార్యాలయంలో హఠాత్తుగా మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో లక్షలు విలువచేసే పంచెలు, చీరలు, ఫర్నీచర్ కాలిపోయాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

అంతిమ యాత్రను అడ్డుకున్న గ్రామస్తులు

– మృతదేహంతో రోడ్డుపై ఆందోళన

అన్నానగర్: తిరుచ్చి జిల్లా తురైయూర్ సమీపంలోని వెల్లకల్‌పట్టి పంచాయతీకి చెందిన తంగయ్యన్‌ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఊరేగింపుగా శ్మశానవాటికకు తరలించారు. అయితే అదే పంచాయతీకి చెందిన కొందరు తమ ఇళ్ల మీదుగా మృతదేహాన్ని తరలించరాదని అడ్డుకున్నారు. దీంతో తంగయ్యన్ మృతదేహాన్ని రోడ్డుపై పెట్టి ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పులివలం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడంతో వివాదం సద్దుమనిగింది.

నిత్యానంద పీఠంలో ఉత్సవాలు

తిరువణ్ణామలై(వేలూరు): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం వెనుక వైపున ఉన్న కొండచుట్టూ గిరివలయం రోడ్డు ఉంది. ఈ రోడ్డులో ఆశ్రమాలు, ఆలయాలున్నాయి. వీటిలో ఆడి అన్నామలై నిత్యానంద పీఠం కూడా ఉంది. కాగా నిత్యానంద 46వ అవతార ఉత్సవాలు ఈనెల 3వ తేదీ నుంచి తిరువణ్ణామలైలోని నిత్యానంద ఆశ్రమంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నిత్యానంద ఆశ్రమానికి బెంగళూరు ఆశ్రమం నుంచి సోమవారం ఉదయం రథాన్ని తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం గిరివలయం రోడ్డులో రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

ఉత్సాహంగా జానపద ప్రదర్శనలు


కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

కొరుక్కుపేట: తమిళ జానపద కళలు, సంస్కృతిని ప్రోత్సహించే విధంగా నిర్వహించిన జానపద ప్రదర్శనలు ఆద్యంతం ఉత్సాహ భరితంగా సాగాయి. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రెయిన్ డ్రాప్స్ చారిటీ ఫౌండేషన్, ఫీనిక్స్ మార్కెట్ సిటీ సంయుక్తంగా గ్రామీణ కళా ఉత్సవం పేరిట వేడుకలను నిర్వహించాయి. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతోపాటు ప్రముఖ నేపథ్య గాయకులు కెడకుళి మారియమ్మాల్, ఆంటోని దాసన్, మణిమారన్, మహాలింగం, మథిచియం బాలా గ్రామీణ కళా ఉత్సవంలో పాల్గొన్నారు. జానపద పాటలతోపాటు ఒయిలాట్టం, కరగాట్టం, పోయికాల్ కుదిరై ప్రదర్శనలు కనువిందు చేశాయి. పొంగళ్లు, డప్పు వాయిద్యాలు, కుండల తయారీ, గ్రామీణుల జీవన స్థితిగతులను తెలిపేలా ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరంలోని వివిధ అనాథాశ్రమాల నుంచి వృద్ధులు, చిన్నారులను ఆహ్వానించి కళాకారుల ప్రదర్శనలు తిలకించేలా అవకాశం కల్పించారు. రెయిన్ డ్రాప్ చారిటీ వ్యవస్థాపకుడు అరవింద్ జయపాల్ మాట్లాడుతూ.. మన సంప్రదాయాలు, జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫీనిక్స్ మార్కెట్ సిటీ డైరెక్టర్ శబరి నాయర్ పాల్గొన్నారు.

మూర్ఛను తేలిగ్గా తీసుకోవద్దు



సింకోప్ క్లినిక్‌ని ప్రారంభిస్తున్న వెంకటాచలం

కొరుక్కుపేట: అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌లో భాగమైన అపోలో హార్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో చెన్నైలో అరిథ్మియా సమ్మిట్ 2023 నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్డియాలజిస్టులు, కార్డియో వైద్యులు, వైద్య ప్రొఫెసర్లు సహా 350 మందికి పైగా సమ్మిట్‌లో పాల్గొన్నారు. అపోలో డాక్టర్ కార్తిగేషన్ ఈసీజీ, కార్డియాక్ అరిథ్మియా, హార్ట్ ఫెయిల్యూర్ మేనేజ్‌మెంట్‌లో అధునాతన వైద్య విధానాలపై మాట్లాడారు. సమ్మిట్ సందర్భంగా ప్రత్యేక సింకోప్ క్లినిక్‌ని అపోలో హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె.వెంకటాచలం, డాక్టర్ కార్తిగేషన్ ప్రారంభించారు. మూర్ఛకు సంబంధించి న్యూరాలజిస్ట్‌తో కలిసి సమగ్ర రోగ నిర్ధారణ, చికిత్స అందించడం ఈ క్లినిక్ లక్ష్యం అని తెలిపారు. తరచూ స్పృహ కోల్పోవడాన్ని తేలికగా తీసుకోవద్దని సూచించారు.

సంక్రాంతి కానుకల పంపిణీ


కానుకలను అందజేస్తున్న కలెక్టర్ కుమరవేల్

వేలూరు: వేలూరు జిల్లాలో మొత్తం 4.49 లక్షల రేషన్ కార్డుదారులకు ఈనెల 13వ తేదీ వరకు సంక్రాంతి కానుకలను అందజేయనున్నట్లు కలెక్టర్ కుమరవేల్ పాండియన్ తెలిపారు. సోమవారం ఉదయం తొర్రపాడిలోని కోఆపరేటివ్ విక్రయ కేంద్రంలో రూ. 1000 నగదుతో పాటు సంక్రాంతి కానుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. కలెక్టర్ మాట్లాడుతూ.. కార్డు దారులు ఒకేసారి రేషన్ షాపులకు వెళితే సమస్యలు ఎదురవుతాయనే ఉద్దేశంతో కార్డుదారులందరికీ తేదీల వారిగా టోకెన్లను అందజేశామని తెలిపారు. ఆయా తేదీల్లో సరుకులు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి కానుకలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. మేయర్ సుజాత మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉత్తమ నటిగా గాయత్రి


గాయత్రి

తమిళ సినిమా: అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ఉత్తమ నటిగా గాయత్రి అవార్డును గెలుచుకున్నారు. గ్లామర్‌కు దూరంగా నటనకు అవకాశం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ పక్కింటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న నటి గాయత్రి. ఇటీవల కమలహాసన్ కథానాయకుడిగా నటించి నిర్మించిన సూపర్ హిట్ చిత్రం విక్రమ్‌లోనూ నటించారు. తమిళంలో పలు చిత్రాల్లో నటిస్తున్న ఈమె మలయాళం చిత్ర పరిశ్రమలోనూ ప్రముఖ నటిగా రాణిస్తున్నారు. కాగా ఇటీవల నటుడు విజయ్ సేతుపతికి జంటగా నటించిన మామనిదన్ చిత్రం గత ఏడాది జూన్‌లో విడుదలై మంచి చిత్రంగా సినీ ప్రముఖుల ప్రశంసలను అందుకుంది. అనంతరం ఓటీటీలో విడుదలై విశేష ఆదరణ పొందింది. శీనూ రామసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడి అవార్డులను గెలుచుకుంది. ఇటీవల చెన్నైలో జరిగిన చెన్నై అంతర్జాతీయ చతురత్వాల్లో కూడా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు అవార్డులను గెలుచుకుంది. తాజాగా జైపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో మామనిదన్, ఇరైవిన్ విశాల్, గార్గీ, విచిత్రన్ చిత్రాలను ప్రదర్శించారు. కాగా మామనిదన్ చిత్రంలో విజయ్ సేతుపతికి భార్యగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా నటించిన గాయత్రి ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్నారు. దీంతో ఆమెను చిత్ర దర్శకుడు శీను రామసామితో పాటు పలువురు సినీ ప్రముఖులు అభినందించారు.

కోలీవుడ్ టాక్స్

లాక్ ఆడియో ఆవిష్కరణ


చిత్ర ఆడియోను విడుదల చేస్తున్న అతిథులు

తమిళ సినిమా: బాంబూ ట్రీస్ సినిమాస్, ఆల్ మురా, శక్తివేల్ పిక్చర్స్ సంస్థల అధినేతలు రత్తన్ లింగా, రాజ్ కుమార్, వేలుసామి, శక్తివేల్ కలిసి నిర్మిస్తున్న చిత్రం లాక్. ఇంతకు ముందు పలు షార్ట్ ఫిలిమ్స్ చేసిన రత్తన్ లింగా అట్టు అనే సక్సెస్‌ఫుల్ చిత్రం ద్వారా దర్శకుడిగా సినీరంగానికి పరిచయం అయ్యారు. తాజాగా ఈయన దర్శకత్వంలో వహిస్తున్న చిత్రం లాక్. విక్రమ్ సెల్వా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. నటుడు దర్శకుడు కే.భాగ్యరాజ్, పేరరసు, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తరసన్, తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రత్తన్ లింగా మాట్లాడుతూ... ఈ చిత్రాన్ని పూర్తిచేయడానికి పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చిందన్నారు. శక్తివేల్ పిక్చర్స్ అధినేత, చిత్ర ఛాయాగ్రహకుడు అనూహ్యంగా కన్నుమూయడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అయితే వారి దృష్టి అంతా ఈ చిత్రంపైనే ఉండేదని, ఈ చిత్రం వారి కల అని పేర్కొన్నారు. వారిద్దరి ఆత్మల ఆశీస్సులతో ఈ చిత్రం సక్సెస్ అవుతుందని నమ్ముతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, తమకు చిత్ర నిర్మాణంలో రాజ్ కుమార్, వేలుసామి అండగా నిలిచారన్నారు. ఈ చిత్ర నిర్మాణంలో శ్రమను చూసిన తాము కొత్తగా చిత్ర నిర్మాణంలోకి అడుగుపెట్టి వారి కోసం స్టూడియోను ఏర్పాటు చేశామన్నారు. దాని పేరు బాంబూ ట్రీస్ స్టూడియో అని తెలిపారు. మంచి సందేశంతో కూడిన చిత్రాన్ని నిర్మించిన దర్శక నిర్మాతలకు అభినందనలు తెలుపుతున్నట్లు కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తరసన్ పేర్కొన్నారు. నూతన నిర్మాతల కోసం బాంబూ ట్రీస్ స్టూడియోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.


అవార్డు గ్రహీతలతో అతిథులు

ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం

తమిళ సినిమా: వెండితెర, బుల్లితెర తారల అవార్డుల వేడుక ఆదివారం చెన్నైలో ఘనంగా జరిగింది. అదేవిధంగా పలువురు సమాజ సేవకులను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు. దీనికి స్థానిక వడపళనిలోని శిఖరం హాలు వేదికగా మారింది. సినీ, సామాజిక రంగాల్లో ప్రతిభావంతులను, విశేష సేవలందించిన వారిని గుర్తించి గౌరవించడంలో డా. అనురాధ జయరామన్ మహా ఆర్ట్స్, కలైమామణి, డి.నెల్లై సుందర్ రాజన్ యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా సంస్థలు ముందుంటాయని విశ్రాంతి చెన్నై హైకోర్టు న్యాయమూర్తి ఎస్కే.కృష్ణన్ పేర్కొన్నారు. ఆదివారం ఈ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వెండితెర, బుల్లితెర నటీనటులకు అవార్డులు, సంఘ సేవకులకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. నటుడు పవర్‌స్టార్ శ్రీనివాసన్, పృథ్వీ, సాక్షి శివ, బుల్లితెర నటుడు మానస్, గీతా రవిశంకర్, స్టంట్ మాస్టర్ డేంజర్ మణి తదితరులు అవార్డులను అందుకున్నారు. అంతకు ముందు నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

అలాంటి పాత్రల కోసం ఎదురు చూస్తున్నా

తమిళ సినిమా: ఎస్పీ జననాథన్ దర్శకత్వం వహించిన పేరాన్మై చిత్రం ద్వారా పరిచయం అయిన నటి వసుంధర. జయం రవి కథానాయకుడిగా నటించారు. ఐదుగురు హీరోయిన్లలో ఒకరిగా నటించి తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. ఆ తరువాత పలు చిత్రాల్లో నటించి గుర్తింపు పొందారు. తాజాగా ఉదయనిధి స్టాలిన్ కథానాయకుడిగా నటించిన కన్నై నంబాదే చిత్రం, సముద్రఖని సరసన తలైకుత్తల్ చిత్రాల్లో నటించారు. ఈ రెండు చిత్రాలు త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఈ సందర్భంగా నటి వసుంధర తన భావాలను వ్యక్తం చేస్తూ దర్శకుడు, నటుడు సముద్రఖని, శీనూరామసామి వంటి దర్శకులు తనను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఆ మధ్య నటించిన కన్నే కలైమానే, బక్రీద్ వంటి చిత్రాలు తనకు మంచి పేరు తెచ్చిపెట్టాయన్నారు. తాజాగా ఉదయనిధి స్టాలిన్, ప్రసన్న శ్రీకాంత్ నాతో నటించిన కన్నై నంబాదే చిత్రం మల్టీస్టార్‌గా రూపొందిందన్నారు. ఇరవుక్కు అయిందు కన్‌గళ్ చిత్రం ఫేమ్ ఎం.మారన్ ఈ చిత్రానికి దర్శకుడు అని చెప్పారు. ఇందులో తనది కొంచెం మోడ్రన్ పాత్ర అని చెప్పారు. ఇలాంటి మోడ్రన్ పాత్రల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. పేరాన్మై చిత్రం తరువాత ఇందులో కొంచెం గరుకుతనం కలిగిన పాత్రలో నటించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో తనకు ఉదయనిధి స్టాలిన్‌కు మధ్య కొన్ని ఆసక్తికరమైన సన్నివేశాలు ఉంటాయన్నారు. ఆయనది రాజకీయ కుటుంబం అయినా అందరితో ఎంతో మర్యాదగా ఉండేవారని, ఫైట్ సన్నివేశాల్లో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చాలా కేర్ తీసుకునే వారిని చెప్పారు. ప్రస్తుతం క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా కలైకుత్తల్ చిత్రంలో సముద్రఖని సరసన నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు. ఇందులో ఖదిర్, వయ్యాపురి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారని చెప్పారు. జయప్రకాష్ రాధాకృష్ణన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇదని తెలిపారు. ఈ చిత్రంలో సముద్రఖని నుంచి తాను చాలా నేర్చుకున్నానన్నారు. ప్రస్తుతం లక్ష్మీనారాయణన్ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లర్ జానర్‌లో రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకుల అభిరుచిని మార్చే విధంగా వినూత్న కథా చిత్రాలను అందిస్తున్నాయన్నారు. అలాంటి చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఇటీవల మణిరత్నం దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్ వంటి చారిత్రక కథా చిత్రాల్లో నటించాలని ఆశిస్తున్నట్లు నటి వసుంధర పేర్కొన్నారు.


వసుంధర

వెల్లిమలై సందేశం


వెల్లిమలై చిత్రంలో ఓ సన్నివేశం

తమిళ సినిమా: సూపర్బ్ క్రియేషన్స్ పతాకంపై నవ నిర్మాత రాజగోపాల్ ఇళంగోవన్ నిర్మించిన చిత్రం వెల్లిమలై. ఓం విజయ్ కథ బాధ్యతలను నిర్వహించారు. సీనియర్ నటుడు సూపర్ గుడ్ ఫిలిమ్స్ సుబ్రమణి ప్రధాన పాత్రలో నటించారు. నటి మంజు నాయకి. రఘునందన్ సంగీతాన్ని అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో ఒక ముఖ్యమైన అంశాన్ని తెరపై ఆవిష్కరించిన చిత్రం వెల్లిమలై. కాగా చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం చెన్నైలోని కమలా థియేటర్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో నామ్ తమిళం పార్టీ నేత సీమాన్, దర్శకుడు కేఎస్ రవికుమార్ మిష్కిన్, పేరరసు, దిండుక్కల్ లియోన్ పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఆడియోను ఆవిష్కరించారు. ఈ చిత్రం కోసం దిండుక్కల్ లియోన్ ఒక పాట పాడటం విశేషం. ఈ సందర్భంగా దర్శకుడు మిషన్ మాట్లాడుతూ మంచి సందేశంతో కూడిన చిత్రాలను కూడా మనం ఆదరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకుముందు మణికంఠన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి నిర్మించి ముఖ్య పాత్రను పోషించిన చిత్రం కడైసీ వ్యవసాయి అన్నారు. ఆ చిత్రానికి అంతర్జాతీయ పురస్కారం లభించిందని కానీ మనం మాత్రం ఆదరించలేదని అన్నారు. రూ. 300, 400 కోట్లు బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రాల మధ్య కడైసీ వ్యవసాయి చిత్రానికి రూ. 30 కోట్లు కూడా రాకపోవడం విచారకరమన్నారు. మంచి సందేశంతో వస్తున్న ఇలాంటి చిత్రాలు విజయం సాధించాల్సి అవసరం ఉందని మిష్కిన్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాలుష్య రహిత భోగి జరుపుకుందాం..!


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరస్వతి భూపతి

తిరుత్తణి: కాలుష్యరహిత భోగిని జరుపుకునేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని తిరుత్తణి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సరస్వతి భూపతి కోరారు. జనవరి 14న భోగి సందర్భంగా పట్టణంలో ప్రజలు టైర్లు, పాత వస్తువులు, నిరుపయోగంగా ఇంట్లో ఉంటున్న దుస్తులను మంటల్లో వినియోగించకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు.

చాక్లెట్‌లో బంగారం!


పట్టుబడిన బంగారం

అన్నానగర్: చాక్లెట్ పౌండర్‌తో కలిపి తీసుకొచ్చిన 211 గ్రాముల బంగారాన్ని తిరుచ్చి విమానాశ్రయ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎయిరిండియా విమానంలో దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని తనిఖీ చేశారు. 3 క్యాన్ల చాక్లెట్ పౌడర్‌లో డార్క్ గోల్డ్ పౌడర్‌ను కలిపి తెచ్చినట్లు గుర్తించారు. బంగారాన్ని వెలికితీస్తే 211 గ్రాముల 24 క్యారెట్ల బంగారం బయటపడింది. మరో ప్రయాణికుడి వద్ద 175 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే సింగపూర్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు బ్రీఫ్‌కేస్‌లో రహస్యంగా దాచిన బ్యాగులో 80,000 అమెరికన్ డాలర్లను గుర్తించారు. 10,000 యూరోలను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.74.19 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

స్వైన్ ఫ్లూతో మహిళ మృతి

అన్నానగర్: స్వైన్ ఫ్లూతో మహిళ మృతిచెందిన ఘటన నామక్కల్ జిల్లాలో చోటుచేసుకుంది. మల్లాసముద్రం వెంకటేశపురి టీచర్స్ కాలనీకి చెందిన గాబ్రియేల్ ఎస్‌బీఐలో జ్యువెలరీ అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య క్లారా మేరీ (51) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెను పరీక్షించగా స్వైన్ ఫ్లూ లక్షణాలు కనిపించాయి. అక్కడ చికిత్స పొందుతూ క్లారా మేరి ఆదివారం సాయంత్రం మృతి చెందింది. దీంతో ఆ ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లారీ డ్రైవర్ హత్య.. ముగ్గురి అరెస్ట్

తిరువొత్తియూరు: సేలం జిల్లాలో లారీ డ్రైవర్‌ను హత్య చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తారామంగళం సమీపంలోని కచ్చువారెడ్డి పట్టికి చెందిన కుమార్‌కు చెందిన వ్యవసాయ బావిలో ఆదివారం మృతదేహం కనిపించింది. దీనిపై స్థానికులు తారమంగళం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో బావి నుంచి బయటకు తీశారు. మెండెం మాత్రం ఉంది. దీంతో మిగిలిన శరీర భాగాల కోసం బావిలోని నీటిని తోడేసి వాటిని బయటకు తీశారు. ముక్కలుగా నరికి హత్య చేసినట్లు గుర్తించారు. మృతుడు తారామంగళం సమీపంలోని పెరియ సొరగై గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మనీ (53)గా గుర్తించారు. భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురికి వివాహమైనట్లు తెలిసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ హత్య కేసుకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కుమారుడి అప్పులు తీర్చలేక..

– దంపతుల ఆత్మహత్య

అన్నానగర్: కుమారుడి అప్పులు తీర్చలేక మనోవేదనతో దంపతులు బలవన్మరణానికి పాల్పడిన విషాదకర ఘటన కన్యాకుమారి జిల్లాలో ఆదివారం జరిగింది. తకలై మనవాల కురిచ్చికి చెందిన ఆరుముగ పెరుమాళ్ (63) చెన్నై పోర్టులో ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈయనకు భార్య ప్రేమలత (58), కుమారులు ఆధవన్ (32), మాలన్ (28) ఉన్నారు. కుమారులిద్దరికీ వివాహమై చెన్నైలో ఉంటున్నారు. ఆరుముగ పెరుమాళ్, ప్రేమలత మనవాలకురిచ్చిలో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు ఆధవన్ చెన్నైలో కంపెనీ నడుపుతున్నాడు. కరోనా కారణంగా, రెండేళ్లలో భారీ నష్టం ఏర్పడింది. దీంతో లక్షల్లో అప్పులు చేశాడు. అప్పు తీర్చేందుకు ఆదవన్ మానవలకురిచ్చిలోని తన తండ్రిని ఆశ్రయించినట్లు సమాచారం. ఆస్తులు అమ్మి నగదు ఇస్తానని చెప్పాడు. ఆ మేరకు ఆస్తిని అమ్మేందుకు అడ్వాన్స్ తీసుకున్నాడు. కానీ సకాలంలో పట్టా నమోదు కాలేదని తెలుస్తోంది. కుమారుడి అప్పు తీర్చలేకపోతున్నామని దంపతులిద్దరూ కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపంతో ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం కొడుకు ఆధవన్ తల్లిదండ్రులకు కాల్‌చేశాడు. ఎన్నిసార్లు చేసినా తీయకపోవడంతో బంధువులను సంప్రదించి, తన తండ్రి ఇంటికి వెళ్లాలని కోరాడు. బంధువులు ఆరుముగపెరుమాళ్ ఇంటికి పిలిచినా స్పందన లేదు. వెనుక తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ ఇద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. వెంటనే మనవలకురిచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసారిపాళ్యం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల మృతి వార్తను చెన్నైలోని కుమారులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి కానుకల పంపిణీలో ఆలస్యం


మొరాయించిన మిషన్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మహాభారతి, తహసీల్దార్ మదియళగన్


క్యూలో వేచి ఉన్న ప్రజలు

- మొరాయించిన సర్వర్
- అధికారులతో లబ్ధిదారుల వాగ్వాదం

తిరువళ్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన కానుకలను తీసుకోవడానికి మొదటి రోజే జనం ఎగబడడంతో రేషన్ దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం ఆరు గంటలకే క్యూలో జనం నిలబడడంతో అధికారులు ఉక్కిబిక్కిరి అయ్యారు. అయితే రేషన్‌కార్డులోని బార్ కోడ్‌ను స్కానింగ్ సరిగ్గా జరగకపోవడంతో పాటు, సర్వర్ మొరాయించడంతో కానుకల పంపిణీలో జాప్యం నెలకొంది. దీంతో రేషన్‌దుకాణం ఉద్యోగులకు లబ్ధిదారులకు మధ్య కొన్నిచోట్ల తీవ్రస్థాయిలో వాగ్వాదం ఏర్పడింది. నేమం, దిగువనల్లాటూరు తదితర ప్రాంతాల్లో స్వల్ప తొక్కిసలాట చేటు చేసుకుంది. దిగువనల్లాటూరులో ముందస్తు ఏర్పాట్లను సరిగ్గా చేయకపోవడంపై సబ్‌కలెక్టర్ మహాభారతి, తహసీల్దార్ మధియళగన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్రాంతి కానుకల పంపిణీ ప్రారంభం

పళ్లిపట్టు: సంక్రాంతి కానుకల పంపిణీని పళ్లిపట్టు మండలంలో మండల వైస్ చైర్మన్ భారతి సోమవారం ప్రారంభించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ కార్డుదారులకు రూ. 1000 సాయంతో పాటు కేజీ పచ్చిబియ్యం, చక్కెర, చెరుకు గడ పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


బొమ్మరాజుపేటలో కానుకలు అందజేస్తున్న యూనియన్ వైస్ చైర్మన్ భారతి

ఇనుప గేటు కూలి బాలుడి మృతి


రాస్తారోకో చేస్తున్న బాలుడి బంధువులు(ఇన్‌సెట్) మృతి చెందిన నితీష్

- గెస్ట్‌హౌస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో

తిరువళ్లూరు: భవాని అమ్మవారి ఆలయంలో మొక్కులు చెల్లించడానికి తల్లిదండ్రులతో వచ్చిన బాలుడిపై ప్రైవేటు గెస్ట్ హౌస్‌కు చెందిన ఇనుప గేటు కూలడంతో మృతి చెందాడు. బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు సోమవారం ఉదయం రాస్తారోకోకు దిగడంతో ఉద్రికత్త నెలకొంది. చెన్నై ఐనావరం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ రమేష్. ఇతనికి భార్య దుర్గ, కుమారులు శిలంబరసన్(13), నితీష్(11) ఉన్నారు. నితీష్ ఐనావరంలోని ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం రమేష్ బంధువులతో కలిసి పెద్దపాళ్యంలోని భవాని అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ఆలయానికి సమీపంలోని గెస్ట్‌హౌస్‌లో గది తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం గెస్ట్‌హౌస్ ప్రహరీగోడ వద్ద పిల్లలు ఆడుకుంటుండగా టన్ను బరువు ఉన్న ఇనుప గేటు నితీష్‌పై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే బాలుడ్ని బంధువులు పెద్దపాళ్యం వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేషన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రమాదం జరిగిన గెస్ట్‌హౌస్ మాజీ పోలీస్ అధికారిదిగా తెలిసింది. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇంత వరకు బాధ్యులను అరెస్టు చేయలేదు. దీంతో ఆగ్రహించిన బాలుడి బంధువులు సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గెస్ట్‌హౌస్ నిర్వాహకులను వెంటనే అరెస్టు చేయాలని.. తమకు పరిహారం చెల్లించాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితులతో చర్చలు జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రభుత్వ బస్సు– మోటార్ సైకిల్ ఢీ

- ఇద్దరి మృతి

అన్నానగర్: కృష్ణగిరి సమీపంలో కర్ణాటక ప్రభుత్వ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఓ జవాన్ పాటు మరో వ్యక్తి మృతి చెందారు. బస్సులోని మిగిలిన 50 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ బస్సు ఉదయం బెంగళూరు నుంచి తిరువణ్ణామలైకి బయలుదేరింది. బస్సు హోసూరు బస్ స్టేషన్‌కు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని 53 మంది ప్రయాణికులతో కృష్ణగిరికి వస్తుండగా కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలోని సిక్కారిమేడు వద్దకు చేరుకుంది. కాగా కృష్ణగిరి సమీపంలోని ఒట్టూరుకు చెందిన ఇద్దరు సైనికులు సుందరేశన్ (38), ఇతని స్నేహితుడు గణేశన్ (35) బైక్‌పై సిక్కరిమేడు సమీపంలో జాతీయ రహదారిని దాటేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కర్ణాటక ప్రభుత్వ బస్సు అనూహ్యంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుందరేశన్, గణేశన్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. ఈక్రమంలో బైక్ బస్సు కింద ఇరుక్కుపోయింది. బైక్ పెట్రోల్ ట్యాంక్ రాపిడి గురవడంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు కిటికీల్లో నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. గురుపరపల్లి పోలీసులు, కృష్ణగిరి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి మరణించిన చెందిన వారి మృతదేహాలను ఆస్పత్రి తరలించారు. అయితే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంతో హోసూరు – కృష్ణగిరి జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

ముందస్తు సంక్రాంతి వేడుకలు


వేలూరు: సంక్రాంతి వేడుకలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు

- భోగి మంటలు, పొంగళ్లు పెట్టి సందడి చేసిన బీజేపీ నేతలు

వేలూరు: వేలూరు జిల్లా ఒడుగత్తూరు సమీపంలోని తెన్‌పుదుపట్టు గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అనకట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుందరమూర్తి అధ్యక్షత వహించగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగవల్లులు, భోగి మంటలు, పొంగళ్లు పెట్టి సందడి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మణికండ, ప్రభు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సామూహిక పొంగల్

తిరుత్తణి: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని తాళవేడు ఇరుళకాలనీలో జేజేపీ నాయకులు సామూహిక పొంగల్‌ను నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే వానతిశ్రీనివాసన్ స్థానిక మహిళలతో కలిసి పొంగళ్లు పెట్టారు. ఎడ్లబండ్ల పోటీలను తిలకించారు.


తిరుత్తణిలో..

2 టన్నుల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం

అన్నానగర్: తూత్తుకుడి ముత్తయ్యపురం సమీపంలోని దుకాణాలు, ఇళ్లలో నిల్వ ఉంచిన 2 టన్నుల ప్లాస్టిక్ వస్తువులను కార్పొరేషన్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 2 దుకాణదారులకు జరిమానా విధించారు. అత్తిమరపట్టి రోడ్డులోని దుకాణాల్లో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తూత్తుకుడి కార్పొరేషన్ కమిషనర్ చారుశ్రీకి సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు సౌత్ జోన్ హెల్త్ ఆఫీసర్ రాజపాండియన్ ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేషన్ సిబ్బంది ఆ ప్రాంతంలోని కొన్ని ఇళ్లు, దుకాణాలపై తనిఖీలు నిర్వహించారు. ఆపై ఓ దుకాణం, ఇంట్లో 2 టన్నుల నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను గుర్తించి సీజ్ చేశారు. దీంతో షాపులో నిల్వ ఉంచిన దుకాణదారునికి రూ. 20 వేలు, ఇంట్లో నిల్వ ఉంచిన దుకాణదారుడికి రూ.5 వేలు జరిమానా విధించారు. నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తులను కార్పొరేషన్ పరిధిలో విక్రయిస్తే షాపు లైసెన్సు రద్దు చేయడంతో పాటు దుకాణానికి సీల్ వేస్తామని కార్పొరేషన్ కమిషనర్ హెచ్చరించారు.

తల్లిదండ్రులు చెప్పిన కోర్సులో చేరలేక..

- లేఖ రాసి విద్యార్థి బలవన్మరణం

అన్నానగర్: తనకు ఇష్టం లేని కోర్సులో చేరలేక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆవడి, గోవర్ధనగిరికి చెందిన విజయన్, జయలక్ష్మి దంపతుల కుమారుడు బాలాజీ (17) ఓ ప్రైవేటు పాఠశాలలో 12వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం విజయన్ పొంగల్ పండుగకు దుస్తులు కొనేందుకు భార్యతో కలిసి బయటకు వెళ్లాడు. ఇంట్లో బాలాజీ, అతని చెల్లెలు ఉన్నారు. గదిలోకి వెళ్లిన బాలాజీ ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానం వచ్చిన అతని చెల్లెలు లోపలికి వెళ్లి చూడగా బాలాజీ ఉరివేసుకుని కనిపించాడు. కేకలు వేయడంతో స్థానికులు అతన్ని కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై ఆవడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ పురుషోత్తమన్ విచారణ జరిపారు. బాలాజీ తల్లిదండ్రులకు రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో "మీరు నన్ను బాగా చూసుకున్నారు. మీరు కోరుకున్న కోర్సు చదవడం నాకు ఇష్టం లేదు. నా జీవితం నా ఎంపిక కాదు. చెల్లెలి జీవితం ఆమె ఇష్ట ప్రకారమే జరగాలని'' పేర్కొన్నాడు. బాలాజీ నీట్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నాడని.. అయితే తల్లిదండ్రులు వేరే కోర్సులో చేరేందుకు దరఖాస్తు ఫారం ఇచ్చి ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో కొద్ది రోజులుగా తీవ్ర మనోవేదనలో ఉన్నట్లు తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

హత్యకేసులో జైలుకెళ్లిన భర్త

- ఆర్థిక కష్టాలతో కూతురిని చంపి తల్లి ఆత్మహత్య

అన్నానగర్: నాగై అరియనాట్టు వీధి సునామీ నివాసానికి చెందిన జంబుకేశ్వరన్(35), మహేశ్వరి(30) దంపతులకు కుమారుడు రోహిత్(12), కుమార్తె అబ్బానా(11) ఉన్నారు. అబ్బానా అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఓ హత్యకేసులో జంబుకేశ్వరన్ మూడేళ్ల క్రితం జైలుకు వెళ్లాడు. దీంతో కుమారుడు రోహిత్ అదే ప్రాంతంలోని మహేశ్వరి చెల్లెలు అముద ఇంట్లో పెరుగుతున్నాడు. భర్త జైలులో ఉండడంతో మహేశ్వరి నాగై మున్సిపాలిటీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తోంది. గత 3 సంవత్సరాలుగా ఎటువంటి ఉద్యోగం లేకపోవడం భర్త జైలులో ఉండడంతో కుటుంబ పోషణ కోసం నానా అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మహేశ్వరి ఇంట్లో ఉన్న తన సెల్‌ఫోన్ తీసుకోవడానికి చెల్లెలు అముద వచ్చింది. మహేశ్వరి ఎంతసేపటికీ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో లోపలికి వెళ్లి చూసింది. ఇంట్లోని ఫ్యాన్‌కు మహేశ్వరి, అబ్బానా ఉరి వేసుకుని మృతి చెంది ఉండడంతో నాగై పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహేశ్వరి, అబ్బానా మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిమళించిన మానవత్వం

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాలుగేళ్ల చిన్నారి
- సకాలంలో ఆస్పత్రికి తరలించిన మహిళ
- డీఐజీ, ఎస్పీ అభినందనలు



చిన్నారిని ఆస్పత్రికి తరలించిన మహిళ

వేలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారిని సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు నిలిపిన మహిళపై ప్రశంసల వర్షం కురుస్తోంది. చిన్నారిని తన భుజాలపై వేసుకుని వెళుతున్న వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో డీఐజీ, ఎస్పీ ఆమెను అభినందించారు. వివరాలు.. కాంచిపురానికి చెందిన శరవణన్ కుటుంబంతో కలిసి శనివారం వేలూరు ఆర్‌ఎస్ పాళ్యంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సత్‌వచ్చారిలో నడిచి వెళుతుండగా వెనుక వైపు వస్తున్న బైక్ వేగంగా వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శరవణన్, అతని కుమారుడు నిశాంత్ (4)కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక బైకులో వస్తున్న మరో ఇద్దరు కూడా తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో చెన్నైకు చెందిన గీత అనే మహిళ తన కుమారుడి (16) కలిసి చెన్నై వైపు కారులో వెళుతున్నారు. ప్రమాదాన్ని గమనించిన ఆమె ఆలస్యం చేయకుండా కారును నిలిపి రక్తపు మడుగులో ఉన్న చిన్నారి నిశాంత్‌ను తన భుజంపై వేసుకొని కారులో వేలూరు సీఎంసీ ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. ఆ మార్గంలో వెళుతున్న వేలూరు డీఐజీ ముత్తుస్వామి, ఎస్పీ రాజేష్ కన్నన్ వారిని గమనించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా నిశాంత్‌ను భుజంపై వేసుకుని వెళుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గీతను వేలూరు డీఐజీ, ఎస్పీ సహా పలువురు అభినందించారు.

వేడుకగా సంక్రాంతి సౌరభాలు



చిన్నారులను అభినందిస్తున్న ఎస్పీ వసంత లక్ష్మి

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కొరుక్కుపేట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (చెన్నై) ఆధ్వర్యంలో దుర్గా స్రవంతి సంక్రాంతి సౌరభాలు వేడుకగా జరిగాయి. సోమవారం సాయంత్రం మైలాపూర్‌లోని ఆంధ్ర మహిళా సభ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ గాయని ఎస్పీ వసంత లక్ష్మి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చిన్నారుల నృత్యం, త్యాగరాజ, అన్నమయ్య కీర్తనలు, వక్తలు ప్రసంగాలు, భరతనాట్య ప్రదర్శనలతో ఆద్యంతం అలరించాయి. ముందుగా లక్ష్మీ ప్రసన్న ప్రార్థనా గీతం ఆలపించగా, టి.నగర్‌లోని ఆంధ్ర బాలానందం పాఠశాల చిన్నారులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అలాగే చిన్నారి మునిపల్లి మైత్రేయి తిరుప్పావైలోని మూడు పాశురాలను చక్కగా పాడి మైమరిపించింది. మధురగాయకులు ఘంటసాల కోడలు పార్వతి రవి ఘంటసాల శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన సభికులను అమితంగా ఆకట్టుకుంది. ఎంకి పాటల ద్వారా ప్రాచుర్యం పొందిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నండూరి సుబ్బారావు, విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో హాస్య నాటికలు ప్రచారం చేసిన నండూరి సుబ్బారావుల గురించి నిర్వాహకులు వివరించారు. తెలుగుదనం ఉట్టిపడేలా సభ్యులందరూ సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన

పిలిప్పీన్స్ యువతిని పెళ్లాడిన తమిళ యువకుడు

అన్నానగర్: నాగర్‌కోయిల్‌లో ఆదివారం పిలిప్పీన్స్ యువతిని ఓ యువకుడు పెళ్లి చేసుకున్నాడు. వివరాలు.. స్థానిక నేశమణి నగర్‌కు చెందిన గుణశీలన్, మెర్సీ దంపతుల కుమారుడు జామీ రెన్స్‌విక్ (25), ఉన్నత విద్యావంతుడు. పిలిప్పీన్స్‌లోని మిండోనాకు చెందిన లాలిన్ (23) గ్రాడ్యుయేట్. ఉద్యోగరిత్యా జామీ రెన్స్‌విక్స్ పిలిప్పీన్స్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో తన సహచర ఉద్యోగి అయిన లాలిన్‌ను ప్రేమించాడు. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో తమిళ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. పిలిప్పీన్స్ నుంచి వీడియో కాల్ ద్వారా లాలిన్ వధువులు వివాహ వేడుకలో పాల్గొనడం గమనార్హం.


జామీ రెన్స్‌విక్ , లాలిన్

పురుగుల మందు తాగిన యువతి మృతి

చిత్తూరు అర్బన్: ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. టూటౌన్ ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన రమ్య (21) తల్లిదండ్రులు మృతి చెందడంతో అవ్వ వద్ద ఉంటోంది. ఆమె నర్సింగ్ చేసింది. పలువురి వద్ద అప్పులు తీసుకుంది. డబ్బు తిరిగి చెల్లించాలని వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ఈ నెల 4వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నకనంలో టిప్పర్ బోల్తా


చిన్నకనుమలో బోల్తాపడిన టిప్పర్

కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరం సమీపంలోని చిన్నకనంలో సోమవారం టిప్పర్ బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. టిప్పర్ ముగ్గు పిండి లోడుతో పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం మీదుగా తమిళనాడుకు వెళుతోంది. డ్రైవర్ వేగంగా వస్తూ చిన్నకనంలో మలుపుని గుర్తించకపోవడంతో టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. రోడ్డును ఆనుకుని 33 కేవీ విద్యుత్ స్తంభం ఉంది. టిప్పర్ దానికి తగిలి ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. గత నెలలో అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు సందర్శించి సేఫ్టీ వాల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టీటీడీ స్థానికాలయాల్లో రథసప్తమి ఏర్పాట్లు

తిరుపతి అలిపిరి: టీటీడీ స్థానికాలయాలు, అనుబంధ ఆలయాల్లో ఈనెల 28న రథసప్తమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆలయాలు, ఇతర విభాగాల అధికారులతో సోమవారం ఉదయం జేఈవో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుచానూరు, తిరుపతి శ్రీ కోదండరామాలయం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయం, నారాయణవనం, నాగలాపురం, దేవుని కడప తదితర ఆలయాల్లో రథసప్తమి సందర్భంగా వాహనసేవలతో పాటు భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించాలని ఆదేశించారు. అన్ని ఆలయాల్లో వాహనాల పటిష్టతను ముందస్తుగా పరీక్షించాలని డీఎఫ్‌వోకు సూచించారు. దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రథోత్సవానికి గాను రథం పటిష్టతను పరిశీలించాలన్నారు. ఆయా ఆలయాల్లో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసి పెండింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. జమ్మూ, చెన్నై, రంపచోడవరం, సీతంపేట ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయిన ఆలయాల్లో మహాసంప్రోక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయా ఆలయాలకు అవసరమైన ఆభరణాలు, శిలా విగ్రహాలు, పంచలోహ విగ్రహాలు, అర్చక సిబ్బంది, ఇతర డెప్యుటేషన్ సిబ్బంది, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ ఆలయాలకు సంబంధించి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు విచ్చేసే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు అందించాలని, ఆకట్టుకునేలా విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, భవిష్యత్తులో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు.

ఏపీ ఆగ్రోస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అధ్యక్షుడిగా చెన్నకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి : డాక్టర్ వైఎస్సార్ ఏపీ ఆగ్రోస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి సందారపు చెన్న క్రిష్ణారెడ్డి ఎన్నికయ్యారు. మంగళగిరిలోని ఏపీ ఆగ్రోస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని రైతు సేవా కేంద్రాల ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఏపీ ఆగ్రోస్ ద్వారామండల స్థాయిలో ఏర్పాటు చేసిన రైతుసేవా కేంద్రాలను బలోపేతం చేసేందుకు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గద్దె కేశవరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.గిడ్డారెడ్డి ఎ.అప్పలనాయుడు. ప్రధాన కార్యదర్శిగా సూరా వీరనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా వై.ఓబుల్ రెడ్డి. కోశాధికారిగా వీటీ చెంగల్ రెడ్డిని ఎన్నుకున్నారు.

పవన్‌కు ఓటేస్తే ఫలితం శూన్యం

- విభజించి పాలిస్తున్న బీజేపీ
- పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు




మాట్లాడుతున్న రుద్రరాజు

హిందూపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కుల, మత, ప్రాంతాలుగా విభజించి పాలిస్తోందని పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు అన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబుకు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనన్నారు. పవన్‌కు ఓటేస్తే ఫలితం శూన్యమని ప్రజలు గుర్తించాలని కోరారు. సోమవారం హిందూపురం నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ పాలనతో దేశ ప్రజలు విసిగిపోతున్నారన్నారు.రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఈ నెల 26న ముగుస్తుందని, అప్పటి నుంచి మార్చి 26 వరకు దేశవ్యాప్తంగా గ్రామ, మండలాల వారీగా పాదయాత్రలు చేపడుతున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి ఎంతో మేలు చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గౌతమ్, నాయకులు కోటాసత్యం, సుధాకర్, బాలాజీ మనోహర్, కేటీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కదలకుండా చుట్టిరావొచ్చు

'పర్యాటకం'లో వర్చువల్ విప్లవం

- కూర్చున్న చోటే పర్యాటక ప్రదేశాలను చూసేలా సాంకేతికత
- స్వయంగా పర్యటించినట్లు అనుభూతిని కలిగించేలా ఏర్పాట్లు
- టూరిజంలో వీఆర్, ఏఆర్ టెక్నాలజీ
- రాష్ట్రంలోనూ ఐఓటీ, జీఐఎస్, టూరిస్టు డెస్టినీ యాప్‌ల అభివృద్ధి



సాక్షి, అమరావతి : పర్యాటక రంగంలో కూడా సాంకేతికత కీలకభూమిక పోషిస్తోంది. వర్చువల్, ఆగుమెంటెడ్ రియాల్టీ (వీఆర్, ఏఆర్) సరికొత్త పర్యాటక అనుభూతులను అందిస్తోంది. పర్యాటక ప్రదేశాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోనూ డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టిసారించాలని వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ ప్రకటించడం సాంకేతికత అవసరానికి ఊతమిస్తోంది. దీనితో పాటు నేషనల్ డిజిటల్ టూరిజం మిషన్‌లో భాగంగా యునిఫైడ్ టూరిజం ఇంటర్‌ఫేస్ కోసం కేంద్ర పర్యాటక శాఖ కృషిచేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర పర్యాటక శాఖ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) వెబ్‌పోర్టల్, టూరిస్టు డెస్టినీ యాప్‌లను రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. ఇప్పటికే ఏపీ మ్యూజియాల్లో వీఆర్, ఏఆర్‌లు విశేష ఆదరణ పొందుతున్నాయి. శిల్పారామాల్లో సైతం 12డి వర్చువల్ అనుభూతులను విస్తరిస్తున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో లేజర్ షో, ప్రొజెక్షన్ మ్యాపింగ్‌లను కూడా అభివృద్ధి చేస్తోంది.

వర్చువల్ టూరిజం ఇలా..

వర్చువల్ టూర్ల కేవలం ఒకే స్థలంలో కూర్చోవడం ద్వారా పర్యాటకులు కోరుకునే ప్రదేశాలను చుట్టిరావచ్చు. దేశంలోని కళలు, సంస్కృతి, గొప్ప వారసత్వ సంపద దృష్ట్యా వర్చువల్ టూరిజం అద్భుతమైన వైవిధ్యాన్ని అందిస్తోంది. ఇక్కడ పర్యాటకులు వీఆర్ కళ్లజోళ్లు ధరించి రిమోట్ కంట్రోల్‌ను ఉపయోగిస్తూ గమ్యస్థానాల్లో కలియదిరిగే అనుభూతిని పొందుతున్నారు.

వివిధ రాష్ట్రాల్లో ఇలా..

తమిళనాడు టూరిజం శాఖ వీఆర్ ఆధారిత బుక్‌లెట్ల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాల్టీని అభివృద్ధి చేసి వెబ్‌సైట్‌లో సైతం అందుబాటులో ఉంచింది. 2016లో గుజరాత్ టూరిజం సింధు లోయలోని లోథాల్, ధోలవీర, రాణి-కి-వావ్‌తో సహా అనేక పురాతన ప్రదేశాలను 360 డిగ్రీల కోణంలో లైవ్ యాక్షన్ వీఆర్ వీడియోలను రూపొందించింది. 2021లో కేరళ టూరిజం శాఖ వర్చువల్ టూర్ గైడ్ కోసం ఏఆర్ యాప్‌ని తీసుకొచ్చింది. ఇది రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను కలుపుతూ రియల్ టైమ్ ఆడియో వీడియో గైడ్‌గా ప్రసిద్ధి చెందింది.

యాప్ సాయంతో..

నిత్యం పెరుగుతున్న పర్యాటక యాప్‌లతో ట్రావెల్, టూరిజం పరిశ్రమ పోటీపడాల్సి వస్తోంది. ఢిల్లీ టూరిజం శాఖ 'దేఖో మేరే ఢిల్లీ' యాప్.. అన్ని టికెట్ల బుకింగ్‌తో పాటు పర్యాటకులు ఒకే ప్లాట్‌ఫామ్‌లో సకల యాత్రలను ప్లాన్ చేసుకునే వీలుకల్పిస్తోంది. ప్రసిద్ధ వారసత్వ కట్టడాలను వైబ్‌సైట్ ద్వారా వర్చువల్ వాక్-త్రూలను అందిస్తోంది. మరోవైపు మ్యూజియాలు సైతం ఆన్‌లైన్ ప్రదర్శనలకు సిద్ధమవుతున్నాయి.

కారుతో తొక్కించి.. దారుణంగా హతమార్చి..

నడిరోడ్డుపై హత్య చేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన నిందితులు

- బీమా డబ్బుల కోసం హైడ్రామా
- హత్యకు ఓ హెడ్‌కానిస్టేబుల్ పథక రచన
- ఏడాది తర్వాత కేసును ఛేదించిన పోలీసులు

షాద్‌నగర్: బీమా డబ్బులు కాజేసేందుకు నలుగురు వ్యక్తులు డ్రామా ఆడారు. యువకుడిని హాకీ స్టిక్‌తో కొట్టి నడిరోడ్డుపై పడేసి కారుతో తొక్కించి హత్య చేశారు. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. ఏడాది క్రితం జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్ద శివారులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును షాద్‌నగర్ పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను సోమవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

కంపెనీ ఏర్పాటు చేసి..

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడ తండాకు చెందిన బోడ శ్రీకాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కొంతకాలంగా హైదరాబాద్ బాచుపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఓ కంపెనీ ఏర్పాటు చేసి ఫేక్ ఉద్యోగాలు సృష్టించాడు. పని చేస్తామంటూ వచ్చిన వారి పేర్లపై క్రెడిట్‌కార్డులు తీసుకొని, వాటి ద్వారా డబ్బులు తీసుకుంటూ బ్యాంకులను మోసం చేస్తూ విలాసవంతమైన జీవితం సాగిస్తున్నాడు. గుంటూరు జిల్లా నర్సంపేట మండలం గురజాల గ్రామానికి చెందిన భిక్షపతి అనే యువకుడు శ్రీకాంత్ వద్ద పని చేసేందుకు వచ్చాడు. అతడికి తల్లిదండ్రులు, తోబుట్టువులు లేరన్న విషయం తెలుసుకున్న శ్రీకాంత్.. అతడి పేరు మీద రూ.50లక్షల బీమా పాలసీ తీశాడు. పాలసీకి నామినీగా తన పేరు పెట్టుకున్నాడు. 2021లో ఐసీఐసీఐ బ్యాంకులో రూ.52 లక్షలు లోన్ తీసుకుని మేడిపల్లిలో ఓ ఇంటిని కొనుగోలు చేసి భిక్షపతి పేరున రిజిస్టర్ చేయించాడు. తర్వాత డబ్బులు అవసరం ఉండటంతో శ్రీకాంత్ ఆ ఇంటిని అమ్మకానికి పెట్టగా, భిక్షపతి అంగీకరించలేదు. దీంతో ఎలాగైనా అతడిని అంతమొందించాలనుకున్న శ్రీకాంత్ తనకు పరిచయం ఉన్న అప్పట్లో మల్కాజిగిరిలో హెడ్‌కానిస్టేబుల్‌గా (ప్రస్తుతం సైబరాబాద్ సీసీఎస్‌లో..) పనిచేస్తున్న మోతీలాల్‌ను కలిశాడు. తనకు సాయం చేస్తే రూ.10లక్షలు ఇస్తానని చెప్పడంతో భిక్షపతిని హత్య చేసేందుకు హెడ్‌కానిస్టేబుల్ పథకాన్ని రచించాడు.

కారులో తీసుకెళ్లి హత్య

భిక్షపతిని హత్య చేసేందుకు శ్రీకాంత్ తన వద్ద పని చేస్తున్న మహబూబాబాద్ జిల్లా గూడురు మండలం రాముతండాకు చెందిన బానోతు సమ్మన్న, వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన చాగంటి సతీష్ సాయం తీసుకున్నాడు. సమ్మన్న, సతీష్‌కు చెరో రూ.5లక్షల చొప్పున, హెడ్‌కానిస్టేబుల్‌కు రూ.10లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. 22 డిసెంబర్, 2021న నలుగురూ కలిసి భిక్షపతిని కారులో షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి తీసుకొచ్చి బాగా మద్యం తాగించారు. తర్వాత భిక్షపతి తలపై హాకీ స్టిక్‌తో బలంగా కొట్టి కింద పడేశారు. అతనిపై నుంచి రెండుసార్లు కారును నడిపించి హతమార్చారు. బీమా క్లెయిమ్ కోసం దరఖాస్తు వచ్చినప్పుడు ఆ కంపెనీ ప్రతినిధులకు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ దిశగా పోలీసులు దర్యాప్తుచేయడంతో అసలు విషయం వెలుగుచూసింది. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, హాకీ స్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మధ్యప్రదేశ్‌లో కోల్ మైన్ ప్రాజెక్ట్ నూతన కార్యాలయం

- ప్రారంభించిన ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డి
- వివిధ రాష్ట్రాల్లో విస్తరిస్తున్న ఖనిజాభివృద్ధి సంస్థ కార్యకలాపాలు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీజీ వెంకటరెడ్డి

సాక్షి, అమరావతి : మధ్యప్రదేశ్‌లోని సుల్యారీలో ఏపీఎండీసీ ఆధ్వర్యంలోని కోల్ మైన్ నూతన ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఆ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి సోమవారం ప్రారంభించారు. గతేడాది సుల్యారీలో ఏపీఎండీసీ బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిన నేపథ్యంలో ప్రాజెక్ట్ సైట్‌కు సమీపంలో నూతన కార్యాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏపీఎండీసీ జాతీయ స్థాయిలో తన మైనింగ్ కార్యక్రమాలను విజయవంతంగా విస్తరిస్తోందని చెప్పారు. మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ప్రైవేటు సంస్థలతో పోటీ పడి మైనింగ్ ప్రాజెక్ట్‌లను దక్కించుకుందన్నారు. సుల్యారీ ద్వారా దాదాపు 20 ఏళ్లకు పైగా 5 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయనున్నట్టు తెలిపారు. గతంలో రాష్ట్రానికే పరిమితమైన ఏపీఎండీసీ నేడు జాతీయ స్థాయిలో వాణిజ్య సరళిలో బొగ్గు గనులను నిర్వహిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు కోల్ ఇండియా, సింగరేణి సరసన నిలవడం సంస్థకు గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సాహంతో ఏపీఎండీసీ మరిన్ని ప్రాజెక్ట్‌లను ప్రారంభించి, రాష్ట్రానికి మరింత మైనింగ్ రెవెన్యూను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ సలహాదారు డీఎల్ఆర్ ప్రసాద్, జనరల్ మేనేజర్(కోల్) లక్ష్మణరావు, పలువురు సిబ్బంది, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ అదాని సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి 17 వరకు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

18న పున:ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఈ నెల 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎమ్వీ శేషగిరిబాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి కాలేజీలు తిరిగి ప్రారంభమవుతాయి.

ఏప్రిల్ 19 నుంచి పదో తరగతి పరీక్షల మూల్యాంకనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ఏప్రిల్ 19 నుంచి 26 వరకు ఒకే స్పెల్‌లో జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'వార్ రూమ్' కేసులో మల్లు రవికి నోటీసులు

- ఈ నెల 12న విచారణకు రావాలన్న సైబర్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గళం పేరుతో సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన మీమ్స్, వీడియోలతో సంబంధం ఉన్న కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్ కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న విచారణకు హాజరుకావాల్సిందిగా ఆదేశించారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు సోమవారం సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు వచ్చి వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో ఆద్యంతం నాటకీయ పరిణామాలే చోటుచేసుకున్నాయి. సోషల్ మీడియా కేసును దర్యాప్తు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఓ కార్యాలయంపై దాడి చేయగా అది కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్‌గా తేలింది. అక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఎం.శ్రీప్రతాప్, టి.శశాంక్, ఇషాంత్ శర్మలను విచారించగా... సునీల్ కనుగోలు పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు సునీల్‌కు సీఆర్పీసీ 41 (ఏ) కింద నోటీసులు జారీ చేశారు. వీటిని కాంగ్రెస్ నేత మల్లు రవికి అందించారు. హాజరుకు గడువు కోరిన సునీల్ నోటీసులకు సవాల్ చేస్తూ హైకోర్టుకు వెళ్లగా.. సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని కోర్టు స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా... ఇటీవల మల్లు రవి సైబర్ క్రైమ్ పోలీసులకు ఓ లేఖ రాశారు. వార్ రూమ్ ఇన్‌చార్జ్‌ని తానేనని, ఈ కేసులో తన వాంగ్మూలం తీసుకోవాలని అందులో కోరారు.

'బరి'తెగిస్తే ఖబడ్దార్

- కోడిపందేల కట్టడికి పటిష్ట చర్యలు
- బరులు ధ్వంసం చేస్తున్న పోలీసులు
- పశ్చిమగోదావరి జిల్లాలో 2,100 కేసుల నమోదు



శృంగవృక్షంలో బరిని ట్రాక్టర్‌తో ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

సాక్షి, భీమవరం: సంక్రాంతి పండగకు సంప్రదాయం పేరుతో జరిగే కోడిపందేల కట్టడికి పోలీసుశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. పండగ మూడు రోజులపాటు నిర్వహించే కోండి పందేలు, జూదాలను అడ్డుకోవడంపై జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గత 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో పందేలకు బరులు ఏర్పాటుచేసే ప్రాంతాలను పరిశీలించడంతో పాటు నిర్వాహకులతో మాట్లాడటం, జూదాలు నిర్వహించిన వారిని ముందుస్తు బైండోవర్ చేయడం, కోడి కత్తులు తయారీ, కట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టి అదుపులోనికి తీసుకుని కేసులు నమోదు చేయడం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో పందేల వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా ప్రచారం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 2,100 కేసులు నమోదుచేసి కత్తులు తయారుచేసేవారిని 155 మంది గుర్తించి 50 కత్తులను సీజ్ చేశారు.

గ్రామస్తుల సహకారంతో కట్టడి

సంక్రాంతి జూదాలను కట్టడి చేయడానికి పోలీసుశాఖ గ్రామస్థాయి కమిటీల సమన్వయంతో పనిచేస్తోంది. ప్రతి గ్రామంలో వలంటీర్లు, సచివాలయ పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండటంతో ముందుస్తుగా బరులను సిద్ధం చేస్తున్న ప్రాంతాలపై సమాచారం సేకరిస్తున్నారు. గతంలో పందేలు వేసిన బరుల స్థల యజమానులకు ముందస్తు నోటీసులిచ్చి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

విస్తృత తనిఖీలు

గ్రామాల్లో పందేలు నిర్వహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పందేలను సిద్ధం చేస్తున్న బరులను, పందేలకు అనువుగా ఉన్న స్థలాలను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేయిస్తున్నారు.

కఠిన చర్యలు



సంక్రాంతికి సంప్రదాయం పేరుతో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సుమారు 2 వేల మందికి పైగా కేసులు నమోదు చేశాం. జూదాలు వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. పండగలకు ఆనందంగా చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

-యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

అలాగే గతంలో పందేలు నిర్వహించిన జూదరులను హెచ్చరించడంతో పాటు అనర్థాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా

ఏటా జిల్లావ్యాప్తంగా మూడు రోజులుపాటు కోడి పందేలు జరుగుతున్నాయి. ప్రధానంగా భీమవరం, కాళ్ల, యలమంచిలి, మొగల్తూరు, పెంటపాడు, తణుకు, పెనుగొండ, అత్తిలి, వీరవాసరం, పాలకొల్లు, పోడూరు, ఆకివీడు మండలాల్లో భారీ పందేలు జరుగుతుండటంతో పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు.



పాలకోడేరు మండలం పెన్నాడలో బరిని ధ్వంసం చేయిస్తూ..

అతుకుల బతుకులు

- కొప్పరపాడు, అద్దంకిల్లో పరదాల తయారీ యూనిట్లు
- ఏడు నెలలు ఇతర రాష్ట్రాలకు వలసలు
- 1500 కుటుంబాలు జీవనం



కొప్పెరపాడులో పరదా తయారీ యూనిట్

బల్లికురవ: వారు పరదాల తయారీ వృత్తినే నమ్ముకున్నారు.. రైతులు పండించిన పంటలను నూర్పిళ్లు చేసేందుకు అవసరమైన పరదాలను రాష్ట్రంతోపాటు పరాయి రాష్ట్రాల్లో అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ, అద్దంకి, మార్టూరు మండలాల్లో సుమారు 1500 కుటుంబాలు జీవనం వెళ్లదీస్తున్నాయి. బల్లికురవ మండలం వేమవరం, కొప్పరపాడు, కొత్తూరు పంచాయతీలోని అరుణగిరితండా, మార్టూరు సమీపంలోని తండాకు చెందిన సుగాలీలతోపాటు అద్దంకి పరిసర గ్రామాల్లోని ఎరుకుల కుటుంబాలు ఐదు దశాబ్దాలుగా పరదాలు అద్దెలకిస్తుంటారు. నవంబర్ మొదటివారం నుంచి మే ఆఖరు వరకు పరాయి రాష్ట్రాలోనే జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. వీరిలో సొంత భూములు ఉన్న వారిని వేళ్లమీద లెక్కించవచ్చు. గతంలో సుగాలీలు తమ ఆవుల మందలను సుదూర ప్రాంతాల్లోని మాగాణి భూముల్లో వరి నూర్పిళ్లకు తోలుకెళ్లేవారు. ఆధునిక యంత్రాల రాకతో ఆవులతో వరి నూర్పిళ్లు అంతరించిపోయాయి.

పిల్లలను విడిచి వలసలు

కుటుంబాలలోని పెద్దలైన తల్లిదండ్రులకు తమ బిడ్డల ఆలనా పాలన బాధ్యతను అప్పగించి వలసలు వెళ్తారు. 10 నుంచి 15 పరదాలను ఒక కట్టగా కట్టుకుని 250 నుంచి 300 పరదాలతో ఐదు నుంచి ఆరు కుటుంబాలు లారీ బాడుగకు మాట్లాడుకుని నూర్పిడికి అద్దెకిచ్చేందుకు ఎంపిక చేసుకున్న ప్రాంతానికి వెళ్తారు. పరదాలు అద్దెకిచ్చే ప్రాంతంలోనే గుడారాలు ఏర్పాటు చేసుకుని బసచేస్తాయి. ఒక్కో కుటుంబం రూ.1.2 లక్షల నుంచి రూ.1.5 లక్షల పెట్టుబడితో పరదాలు తీసుకొని వెళ్తే పెట్టుబడులు పోను రూ.80 వేల నుంచి రూ.లక్ష ఉంటాయని సుగాలీ కుటుంబాలు 'సాక్షి'కి తెలిపాయి.

ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు...

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి. తెలంగాణ రాష్ట్రంలోని ములుగు, నిజామాబాద్, అదిలాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, సింధనూరు, గుల్బర్గా, హుబ్లీ, ధావణగేరి, బళ్లారి, తమిళనాడులోని మధురై, ఈరోడ్ మహారాష్ట్రలోని నాగపూర్, శని సింగపూర్ ప్రాంతాలకు వలస వెళ్తారు.

కొప్పెరపాడు, అద్దంకిలో ఐదు యూనిట్లు

కొప్పరపాడు, అద్దంకిలో పరదాల తయారీ చేసే యూనిట్లు ఐదు ఏర్పాటు చేశారు. ఇవి కుటీర పరిశ్రమలా సంవత్సరంలో 365 రోజులు పనిచేస్తుంటాయి. ఆంధ్రలోని నరసరావుపేట, తెనాలి, కాకినాడ, తమిళనాడు ప్రాంతాల నుంచి యూనిట్ల యజమానులు ఖాళీ గోతాలు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తుంటారు. అదేవిధంగా టన్ను రూ.15 వేల నుంచి 20 వేలుకు కొనుగోలు చేస్తారు. గోతాలను శుభ్రపరిచి 25 నుంచి 30 గోతాలతో పరదా తయారు చేస్తారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలోని సుగాలీలు, ఎరుకల కుటుంబాలు పరదా ఒక్కొక్కటి రూ.350 నుంచి రూ.400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌లో 20 నుంచి 25 మంది వరకు వివిధ ప్రాంతాలకు చెందిన కూలీలు పనిచేస్తున్నారు.

పరదాలు అద్దెకిస్తూ జీవిస్తున్నాం..



పరదాలు అద్దెకిస్తూ ఏడు నెలలు పరాయి రాష్ట్రాల్లోనే మకాం ఉంటూ జీవనం వెళ్లదీస్తున్నాం. అతివృష్టి, అనావృష్టితో పంటలు సక్రమంగా పండక ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో గిరాకీ తగ్గింది. సీజన్‌ల వారీగా తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక వెళ్తాం. కాబట్టి ఇబ్బందులు ఉండవు.

– మూడావత్ బాలకృష్ణ నాయక్, వేమవరం

అలవాటు పడిన వృత్తినే నమ్ముకున్నాం..



తండ్రి నుంచి పరదాలు అద్దెకిస్తూ అలవాటు పడిన వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. పెట్టుబడి సొమ్ము వడ్డీ వ్యాపారుల వద్ద తేవటం వల్ల ఆదాయం తగ్గుతోంది. బ్యాంకులు తమకు రుణాలు అందజేస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

– భూక్యా సునీల్ నాయక్, వేమవరం

30 ఏళ్లుగా పరదాలు తయారు చేస్తున్నాం..

30 ఏళ్లుగా తమిళనాడు, ఆంధ్రా ప్రాంతాల నుంచి ఖాళీ గోతాలు కొనుగోలు చేసి పరదాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. 15 కుట్టుమిషన్లతోపాటు 20 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నాం. సంవత్సరం పొడువునా నిరంతరంగా పరదాలే తయారు చేస్తూ ఉన్నాం. నూర్పిళ్లు ఇటీవల యంత్రాల వినియోగం పెరగటంతో గతంలో వచ్చిన ఆర్డర్లు రావటం లేదు.

– యర్రా మునలయ్య, కొప్పెరపాడు

సంస్కృతీసంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీక

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

తెనాలి: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీకని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. కంప్యూటర్ యుగంలో ఇవి సజీవంగా ఉండాలని, అందుకు ఇలాంటి పోటీలను నిర్వహించటం ముదావహమని చెప్పారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర-తూములూరు గ్రామాల మధ్య ప్రత్యేక ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, అన్నాబత్తుని సత్యనారాయణ, గుదిబండి వెంకటరెడ్డి మెమోరియల్ ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు బలప్రదర్శన పోటీలు చివరిరోజైన సోమవారం సీనియర్స్ కేటగిరీలో పోటీలను మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి తిలకించారు. ముందురోజు రాత్రి పొద్దుపోయేవరకు జరిగిన జూనియర్స్ కేటగిరీలో జరిగిన పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను ఆయన బహూకరించారు. అనంతరం మాట్లాడుతూ, రైతువారీ వ్యవస్థకు అనుసంధానమైన ఎడ్ల పందేలు కొనసాగించాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. లేకుంటే చరిత్రను మరిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శివకుమార్ వీటి నిర్వహణ బాధ్యతను భుజాలపై వేసుకుని, పెద్దలందరి సహకారంతో నిర్వహించటం ముదావహమన్నారు. భాగస్వాములైన అందరికీ అభినందనలు తెలియజేశారు. జూనియర్స్ కేటగిరీలో బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి-శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత అత్యధిక దూరం బండలాగి విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి కింద రూ.80 వేల పారితోషికాన్ని అందుకున్నారు. అత్తోట శిరీష చౌదరి-శివకృష్ణచౌదరి, బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన పోపూరి శ్రీనివాసరావుల ఎడ్ల జత ద్వితీయ బహుమతిని గెలిచి రూ.70 వేల నగదు బహుమతిని అందుకున్నారు.

సీనియర్స్ విభాగంలో..

సీనియర్స్ విభాగంలో కృష్ణాజిల్లా పెనమలూరు మండల గ్రామం కానూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత 2407.9 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. సుబ్బారావుకే చెందిన మరో ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని సాధించింది. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండల గ్రామం నాదర్‌గుల్‌కు చెందిన యేల్చుల ప్రసాదరెడ్డి, గుంటూరు జిల్లా తాడేపల్లి మండల గ్రామం లంకిరెడ్డి నిక్షిత్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 2148.5 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెలుచుకుంది.

హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబు ఎడ్ల జత తృతీయ బహుమతిని గెలిచి రూ.60 వేల నగదును అందజేశారు.కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్‌రావు ఎడ్ల జతకు నాలుగో బహుమతి లభించింది. ఈ విభాగంలో మొత్తం 10 ఎడ్ల జతలకు వరుసగా నగదు బహుమతులను అందజేశారు. అంతకుముందు సీనియర్స్ విభాగంలో పోటీలను కొల్లిపర పాల సొసైటీ అధ్యక్షుడు నెర్ల కుటుంబరెడ్డి, ఈమని హరికోటిరెడ్డి ప్రారంభించారు.రెండు తెలుగు రాష్ట్రాల్నుంచి 13 ఎడ్ల జతలు పోటీలకు వచ్చాయి. రాత్రి పొద్దుపోయేవరకు ఈ పోటీలు కొనసాగాయి. అల్లం బాపిరెడ్డి, అవుతు హర్షవర్ధన రెడ్డి, చెంచల రామిరెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈదా హర్షవర్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, కొల్లిపర సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీ చిలువూరు ఝాన్సీ, కేసని శ్రీలత, తూములూరు ఎంపీటీసీ మర్రెడ్డి మాధవి, నెర్ల కుటుంబరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, ఎస్ఐ రవీంద్రరెడ్డి, బొంతు వేణుగోపాలరెడ్డి, అడపా నారాయణరెడ్డి, జొన్నల శివారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి పాల్గొన్నారు.

స్త్రీ శక్తి

సూపర్ ఫైటర్


● అవని చతుర్వేది

సవాలుకు దీటైన సమాధానం విజయంలోనే దొరుకుతుంది.

'అమ్మాయిలు బైక్ నడపడం కష్టం' అనే మాట విన్నప్పుడు పట్టుదలగా బైక్ నడపడం నేర్చుకుంది.

'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ప్రవేశించడం చాలా కష్టం' అనే మాట విన్న తరువాత ఫైటర్ పైలట్ కావాలనుకునే లక్ష్యానికి బీజం పడింది.

'మిగ్-21 బైసన్' యుద్ధ విమానాన్ని నడిపి చరిత్ర సృష్టించిన స్క్వాడ్రన్ లీడర్ అవని చతుర్వేది జపాన్‌లో జరగబోయే ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌లలో పాల్గొనబోతోంది...

ఇండియా, జపాన్ దేశాలు కలిసి ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించనున్నాయి. ఎయిర్ డిఫెన్స్‌కు సంబంధించి పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకునే లక్ష్యంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్(ఐఏఎఫ్), జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్(జేఏఎస్‌డీఎఫ్)లు గగనతల విన్యాసాలకు శ్రీకారం చుట్టనున్నాయి. జపాన్‌లో హైకురీ ఎయిర్‌బేస్ కేంద్రంగా జరిగే ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌లు (వీర్ గార్డియన్ 2023) ఈ నెల 12 నుంచి 26 వరకు జరగనున్నాయి. మన దేశానికి సంబంధించి సుఖోయ్-30 ఎంకేఐ, సీ-17 హెవీ-లిఫ్ట్ ఎయిర్ క్రాఫ్ట్‌లు దీనిలో భాగం అవుతాయి. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ఫస్ట్ ఉమెన్ ఫైటర్ పైలట్‌గా స్క్వాడ్రన్ లీడర్ అవని చతుర్వేది చరిత్ర సృష్టించనుంది. మన దేశంలో జరిగిన కంబాట్ ఎక్సర్‌సైజ్‌లలో మహిళా ఫైటర్ పైలట్‌లు పాల్గొన్న సందర్భాలు ఉన్నప్పటికీ, వేరే దేశంలో జరిగే దానిలో ఒక మహిళా ఫైటర్ పైలట్ పాలుపంచుకోడం ఇదే తొలిసారి.

మధ్యప్రదేశ్‌కు చెందిన అవని చతుర్వేది జైపూర్‌లో బీటెక్ చేసింది. విమానాలపై ఉన్న ఆసక్తితో రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీ 'ఫ్లయింగ్ క్లబ్'లో చేరింది. అక్కడ మొదలైన ఆమె ప్రయాణం విజయపరంపరలతో సాగుతూనే ఉంది. 'మిగ్-21 బైసన్' యుద్ధ విమానాన్ని నడిపిన తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా 2018 చరిత్ర సృష్టించింది అవని. రాష్ట్రపతి చేతుల మీదుగా 2020లో 'నారీశక్తి' పురస్కారాన్ని అందుకున్న అవని, వైమానిక రంగంలో పనిచేయాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకోవడానికి ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తిని ఇచ్చింది. అవని తండ్రి నీటిపారుదలశాఖలో ఇంజనీరు. సోదరుడు సైన్యంలో పనిచేస్తున్నాడు. సోదరుడి స్ఫూర్తితోనే సైన్యంలోకి వచ్చింది అవని. భారతీయ వైమానికదళంలో పనిచేయాలనే తన లక్ష్యాన్ని ఇతరులతో పంచుకున్నప్పుడు 'ఫ్లైయింగ్ క్లబ్‌లో చేరినంత సులువు కాదు' అని వెక్కిరించిన వాళ్లు ఉన్నారు. అయితే వాటిని అవని సీరియస్‌గా తీసుకోలేదు. ఎఫ్‌సిఏటీ పరీక్షలో రెండో స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది. దుండిగల్(హైదరాబాద్)లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కఠినమైన శిక్షణ పొందింది. సాహసాలతో చెలిమి చేసింది. అవనికి బాస్కెట్‌బాల్, చెస్ ఆడడం, పెయింటింగ్ అంటే ఇష్టం. బాస్కెట్‌బాల్ వల్ల తెగువ, చెస్‌తో లోతైన ఆలోచన, పెయింటింగ్‌తో సృజనాత్మక శక్తులు తనలో వచ్చి చేరాయి. 'ప్రతిరోజూ ఒక కొత్త విషయం నేర్చుకోవాలనేది నా విధానం. మంచి ఫైటర్ పైలట్‌గా పేరు తెచ్చుకోవాలనేది నా లక్ష్యం' అంటోంది అవని చతుర్వేది. 'కఠినమైన ఫైటర్-ఫ్లయింగ్ షెడ్యూల్స్' అంటూ ఒకప్పుడు ఐఏఎఫ్ మహిళలను కంబాట్ స్ట్రీమ్‌లోకి తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే ఇప్పుడు ఐఏఎఫ్ ఆలోచన ధోరణిలో మార్పు వచ్చింది. దీనికి తాజా ఉదాహరణ జపాన్‌లో జరిగే ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌కు అవని చతుర్వేదిని ఎంపిక చేయడం.

ప్రదర్శన


రంగస్థలంపై పాకుడు రాళ్ళు

'పాకుడు రాళ్ల' మీద స్థిరంగా నిలవడం కష్టం.
పాకుడు రాళ్లు పట్టుకుని
పైపైకి ఎగబాకడమూ కష్టమే.
సినిమా రంగంలో స్త్రీల కెరీర్
పాకుడు రాళ్లపై నడక వంటిదని
రావూరి భరద్వాజ రాసిన నవల 'పాకుడు రాళ్లు'
జ్ఞానపీఠ్ అవార్డు గెలుచుకుంది.
తెలుపు నలుపు కాలం నాటి నటీమణి
జీవితాన్ని ఆధారం చేసుకుని
1978లో రాసిన ఈ నవల ఇప్పుడు నాటకంగా
ప్రదర్శితమవుతోంది. ఒక భారీ నవలను
నాటకంగా మలచడం కష్టమైనా
దర్శకురాలు నస్రీన్ ఇషాక్ విజయం సాధించింది.
ఒక మహిళ ప్రధాన పాత్ర వహించే ఈ నాటకానికి
మరో మహిళ దర్శకత్వం వహించడం,
వస్తువు ఈ కాలానికి కూడా
రిలెవెంట్‌గా ఉండటంతో
ఇప్పటికి ఆరు ప్రదర్శనలు పూర్తి చేసుకుంది.
నస్రీన్ ఇషాక్ పరిచయం...
నవలను నాటకంగా మలచడంలో
ఆమె సాధక బాధకాలు...

గుంటూరు జిల్లాలోని ఒక ఊరిలో నాటకాలు ఆడే అమ్మాయి మంగమ్మ మొదట చెన్నైకి చేరి, అక్కడ 'మంజరి'గా మారి, నటిగా టాప్‌స్టార్ అయ్యి, ఆ తర్వాత బొంబాయిలో ఎదిగి, భారతదేశం తరఫున సాంస్కృతిక రాయబారిగా అమెరికా వరకూ వెళ్లగలి గింది. అయితే ఆమె ముగింపు? ఆత్మహత్య. సినిమా రంగపు పాకుడురాళ్లు ఆమెను చివరకు పతనం అంచునే పడేస్తాయి. ఈ మంగమ్మ అను మంజరి కథనే రచయిత రావూరి భరద్వాజ 'పాకుడురాళ్లు' నవలగా రాశారు. నవల వచ్చాకగాని ఆ తర్వాతగాని ఈ మంజరి ఎవరి కథ అనేది ఆయన బహిరంగ పర చలేదు. మూకీల నుంచి టాకీలుగా సినిమా మారు తుండగా టాప్‌స్టార్ అయిన ఒక హీరోయిన్ కథ అని కొంతమంది, 1950లలో టాప్‌స్టార్ అయిన మరో హీరోయిన్ కథ అని మరి కొంతమంది అంటూ ఉంటారు. అయితే రచయిత రావూరి భరద్వాజ జర్నలిస్టు కూడా కావడం వల్ల తనకు తెలిసిన సమా చారంతో, ముగ్గురు నలుగురు హీరోయిన్ల జీవితాన్ని ఒక మంజరికి ఆపాదించి రాశారని నవలలోని ఘటనలను బట్టి అర్థమవుతుంది. ఇది ఒక రకంగా కొంతమంది హీరోయిన్ల ఉమ్మడి బయోగ్రఫీ. అందుకే ఆ నవలకు అంత బలం, చారిత్రక విలువ.

ఇప్పుడు నాటకంగా

'పాకుడురాళ్లను నాటకంగా చేయడం చాలా పెద్ద సవాలు. దీనిని గంటన్నర నిడివి గల నాటకంగా చేద్దామనుకున్నాను. కానీ గంటా యాభై నిమిషాల కంటే తగ్గించలేకపోయాను' అంటారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ థియేటర్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న 52 ఏళ్ల నస్రీన్ ఇషాక్. ఈమె దర్శకత్వం వహించిన 'పాకుడు రాళ్లు' నాటకం మొన్న జనవరి ఒకటిన విశాఖలో హౌస్‌ఫుల్‌గా ప్రదర్శితమైంది. దానికి ముందు హైదరాబాద్, అద్దంకిలలో కూడా ప్రదర్శితమైంది. షోస్ రిపీట్ అవుతున్నాయి కూడా. 'ఈ నాటకంలో మంజరి ఎదుర్కొన్న ఘటనలు నేటికీ సినిమా రంగంలో అలాగే ఉన్నాయి. ఆ మధ్య వచ్చిన మీటూ ఉద్యమాన్ని కూడా చూశాం. భరద్వాజ గారు ఈ నవలను విస్తృత ఘటనలతో రాశారు. మంజరి తానే బాధితురాలిగా ఉండి ఆ తర్వాత ఎదుటివారిని ఆడించే శక్తిమంతురాలు అవుతుంది. నవలలో ఆమె పాత్ర అంతర్గత పెనుగులాటను, దాని గాఢతను రచయిత రాయలేదు. మంజరి పాత్రను సహానుభూతితో అర్థం చేసుకునేలా నాటకం ముగింపును మలచడానికి నవలను శోధించాల్సి వచ్చింది' అంటారు నస్రీన్ ఇషాక్. 'పైకి చూడటానికి ఈ నవల మంజరి తన శరీరాన్ని చూపిస్తూ ఇతరులతో ఆడిన ఆటగా ఉంటుంది. కాని లోన చూస్తే ఆ ఆట వల్ల ఆమె పడే వేదన తెలుస్తుంది' అంటారు ఆమె.



● 'పాకుడురాళ్ళు' నాటకం పోస్టర్


● దర్శకురాలు నస్రీన్ ఇషాక్

18 మంది నటీనటులు

వేదిక మీద 18 మంది నటీనటులు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారు. నవలలో ఎదురు పడే ముఖ్య పాత్రలు- కల్యాణి, రాజమణి, చంద్రం, చలపతి, మాధవరావు... ఈ పాత్రలన్నీ మంజరితో తలపడతాయి. నాటకంలో ఐదు పాటలు ఉన్నాయి. మంజరి పాత్రను భావనా వఝపాండల్ పోషించింది. 'ఒక నటి బయోపిక్‌ను స్టేజ్ మీద ఏ మేరకు నిజాయితీగా చూపించగలమో ఆ మేరకు పాకుడురాళ్లలో చూపించాం' అంటారు నస్రీన్ ఇషాక్.


● నాటకంలో దృశ్యం

తెలుగు రాకపోయినా

నస్రీన్ ఇషాక్‌ది ఢిల్లీ. అక్కడే ఢిల్లీ యూనివర్సిటీలో వీధి నాటకాల నుంచి నాటకరంగం మీద ఆసక్తి పెంచుకున్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో సీటు సాధించి చదువుకున్నారు. 2009 నుంచి హైదరాబాద్‌లో ఉన్నారు. 'మొదట నేను ఇంగ్లిష్, హిందీ నాటకాలు వేయించేదాన్ని. కాని ఇక్కడ ఉన్నదంతా తెలుగు నటులు. మాతృభాషలో నాటకం ఆడటం నటులకు చాలా ముఖ్యం. అందుకని తెలుగు సాహిత్యం నుంచి నాటకాలను ఎంచుకోవాలని నిశ్చయించుకున్నాను. మొదట 'మైదానం' నవలను నాటకం చేశాను. ఇప్పుడు 'పాకుడు రాళ్లు' చేశాను. నాటకం చేయాలని అనుకున్నాక ఒక నెల రోజులపాటు రీడింగ్ సెషన్స్ ఉంటాయి. మా నటీనటులు ఒక్కో చాప్టర్ చదువుతూ దాని సారాంశం నాకు హిందీలోనో ఇంగ్లిష్‌లోనో చెబుతూ వెళతారు. నవల ఆత్మను పట్టుకుంటే నాటకం వేయడానికి భాష అడ్డంకి కాదు అని నా భావన. సన్నివేశాల వరుస, నటీనటుల ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జీ, ఇన్‌వాల్వ్‌మెంట్, ఫీలింగ్, వేరియేషన్స్... వీటిని నేను చూసుకుంటాను. నాకు తెలిసిపోతాయి' అంటారు నస్రీన్.

ఆమె భర్త నౌషాద్ ముహమ్మద్‌ది కేరళ. అతను సెంట్రల్ యూనివర్సిటీ థియేటర్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

'పాకుడురాళ్లు నాటకాన్ని మరెన్నో ప్రదర్శనలు వేయాలని ఉంది' అంటున్న నస్రీన్ కోరిక నెరవేరాలని కోరుకుందాం.

ముగ్గు - ముచ్చట

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరి పేరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





అడపాల మహాలక్ష్మి
టాటానగర్
బెంగళూరు
21 చుక్కలు, 11 వచ్చే వరకు
మధ్య చుక్క




బొడ్డు రూనీస్,
చౌటుప్పల్, యాదాద్రి
భువనగిరి జిల్లా
11 చుక్కలు, 11 వరుసలు,
సరిచుక్క

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె
జనవరి 11 నుంచి


● మెత్తళ్ల సీడ్‌ను చూపుతున్న రైతు




● ఒడిషాలో మెత్తళ్ల సీడ్ ఉత్పత్తికి ఉపయోగించిన ప్రత్యేక ట్యాంకులు

విటమిన్ 'ఎ' చిరుచేపలు!

2 అంగుళాల చిరు చేపల్లో పెద్ద చేపల్లో కన్నా విటమిన్ 'ఎ' 20 రెట్లు ఎక్కువ!

సహజ నీటి వనరుల్లో పెరిగే 2 అంగుళాల మెత్తళ్ల (ఆంగ్లంలో 'మోల' (Amblypharyngodon mola)) వంటి చిరు చేపలను తినే అలవాటు ఆసియా దేశాల్లో చిరకాలంగా ఉంది. ఎండబెట్టిన మెత్తళ్లను నిల్వ చేసుకొని ఏడాదంతా తింటూ ఉంటారు. ఈ చిరు చేపల్లో అద్భుతమైన సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉండటంతో పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో వీటి పాత్ర విశిష్టమైనది. అయితే, వీటి సైజు వేలెడంతే ఉండటం వల్ల కృత్రిమ విత్తనోత్పత్తి ఇన్నాళ్లూ అసాధ్యంగా మిగిలిపోయింది. అయితే, ఈ పెనుసవాలును శాస్త్రవేత్తలు ఇటీవలే ఛేదించారు. చేపల విత్తనోత్పత్తి రంగంలో ఇది పెద్ద ముందడుగని చెప్పొచ్చు.

జర్మనీకి చెందిన స్వచ్ఛంద సంస్థ జి.ఐ.జడ్. ఆర్థిక తోడ్పాటుతో 'వరల్డ్‌ఫిష్' సంస్థ శాస్త్రవేత్తలు మన దేశంలో మెత్తళ్ల విత్తనోత్పత్తికి సులభమైన సాంకేతిక పద్ధతులను రూపొందించడంలో కొద్ది నెలల క్రితం ఘనవిజయం సాధించారు. దీంతో మెత్తళ్లు, తదితర చిరు చేపలను మంచినీటి చెరువుల్లో సాగు చేసుకునే అవకాశం విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది.


● 2 అంగుళాల చిరు చేపలు.. మెత్తళ్లు

మెత్తళ్ల చేప పిల్లలను ఒక్కసారి వేస్తే చాలు!

'మోల' చేపలు చూపుడు వేలంత పొడవుండే అద్భుత పోషకాల గనులు .. వీటిని మనం మెత్తళ్లు /సీత్త పరిగెలు /కొడిపెలు /ఈర్నాలు అని పిలుచుకుంటున్నాం . ● గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని, రక్తహీనతను, రేచీకటిని పారదోలే వజ్రాయుధాలు ఆ చిరుచేపలు. ● మంచినీటి ఆక్వా చెరువుల్లో బొచ్చె, రాగండి, మోసు, శీలావతి వంటి పెద్ద చేపలతో కలిపి లేదా విడిగానూ ఈ చిరుచేపలను సునాయాసంగా సాగు చేయొచ్చు. ● గ్రామ చెరువులు, కుంటల్లో, పెరటి తోటల్లోని తొట్లలో, మిద్దెల పైన ఫైబర్ టబ్‌లలోనూ ఎంచక్కా చిరు చేపలను పెంచుకోవచ్చు. ● వానాకాలంలో వాగులు, వంకల్లో కనిపించే సహజ దేశవాళీ చేపలివి. ● మెత్తళ్లు చేప తన సంతతిని తనంతట తానే(సెల్ఫ్ బ్రీడర్) వృద్ధి చేసుకుంటుంది.. ఈ చేప పిల్లలను ఒక్కసారి చెరువులో/తొట్లలో వేసుకుంటే చాలు.. నిరంతరం సంతతి పెరుగుతూనే ఉంటుంది. ● ప్రతి 10-15 రోజులకోసారి వేలెడంత సైజుకు పెరిగిన చేపలను పెరిగినట్లు పట్టుబడి చేసి వండుకు తినొచ్చు. ● వాణిజ్య స్థాయిలో పెంపకం చేపట్టి స్థానిక మార్కెట్లలో అమ్ముకొని ఆదాయం కూడా పొందవచ్చు. ● మగ చేపలు 5.0-5.5 సెం.మీ. (2 అంగుళాలు) పొడవు, ఆడ చేపలు 6.0-6.5 సెం.మీ. పొడవు పెరిగేటప్పటికి పరిపక్వత చెందుతాయి. ఆ దశలో పట్టుబడి చేసి వండుకొని తినొచ్చు, ఎండబెట్టుకొని దాచుకోవచ్చు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యలో ఈ చేపల్లో సంతానోత్పత్తి జరుగుతుందని కేంద్రీయ మత్స్య విద్యా సంస్థ (సి.ఐ.ఎఫ్.ఇ.) ఎమిరిటస్ సైంటిస్ట్ డాక్టర్ అప్పిడి కృష్ణారెడ్డి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. నిజానికి, మెత్తళ్ల విత్తనోత్పత్తి ఆవశ్యకత గురించి ఆయన రాసిన వ్యాసాన్ని 'సాక్షి సాగుబడి' ఐదేళ్ల క్రితమే ప్రచురించింది.

నేచురల్ సూపర్ ఫుడ్స్

భారత్ సహా దక్షిణాసియా దేశాల్లో ప్రజల్లో సూక్ష్మపోషకాల లోపాన్ని ఆహారం ద్వారా సహజమైన రీతిలో అధిగమించేందుకు ఇదొక సువర్ణ అవకాశంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. మాంసకృత్తులు, ఖనిజాలు, విటమిన్లు, ఎస్సెన్షియల్ ఫాటీ ఆసిడ్స్ కలిగి ఉండే మెత్తళ్లు నేచురల్ సూపర్ ఫుడ్స్ అని వరల్డ్‌ఫిష్ అభివర్ణించింది. పౌష్టికాహార లోపంతో మన దేశంలో 36% మంది పిల్లలు వయసుకు తగినంతగా ఎదగటం లేదు. 32% మంది తక్కువ బరువు ఉన్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చెబుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి మెత్తళ్లు భేషుగ్గా ఉపయోగపడుతాయని 'వరల్డ్‌ఫిష్' చెబుతోంది.

విటమిన్ ఎ లోపం వల్ల వచ్చే కంటి జబ్బులు, చర్మ వ్యాధులు మెత్తళ్లు తింటే తగ్గిపోతాయి. ఈ చిరు చేపల్లో ఐరన్, జింక్, కాల్షియం, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్, అమినో యాసిడ్స్ ఉన్నాయి. పిల్లలు, గర్భిణీ స్త్రీలను పీడించే సూక్ష్మ పోషక లోపాలు మెత్తళ్లను తింటే తగ్గిపోతాయి.

70 లక్షల సీడ్ ఉత్పత్తి

అధిక పోషకాలున్న మెత్తళ్ల వంటి చిరు చేపల సాగు ప్రోత్సాహానికి ఒడిషా, అస్సాం రాష్ట్రాల్లో, బంగ్లాదేశ్‌లో వరల్డ్‌ఫిష్ సంస్థ గత దశాబ్దకాలంగా కృషి చేస్తోంది. ఒడిషాలోని జగత్సింగ్‌పూర్ జిల్లాలో గల బిశ్వాల్ ఆక్వాటిక్ హేచరీతో కలిసి వరల్డ్‌ఫిష్ చేసిన పరిశోధనలు ఫలించాయి. ఇండ్యూస్‌డ్ బ్రీడింగ్ టెక్నిక్ ద్వారా మెత్తళ్ల సీడ్ ఉత్పత్తిలో అవరోధాలను 2022 జూన్‌లో అధిగమించటం విశేషం.

70 లక్షల మెత్తళ్ల సీడ్‌ను ఉత్పత్తి చేయగలిగారు. ప్రత్యేకంగా నిర్మించిన చిన్న చెరువుల్లో ఆక్సిజన్‌తో కూడిన నీటిని ఎయిరేషన్ టవర్ ద్వారా అందిస్తూ ప్రయోగాలు చేశారు. ఆ నీటిలో గుడ్ల నుంచి వెలువడిన చిరుపిల్లలు చక్కగా బతికాయి. గుడ్డు నుంచి బయటికి వచ్చిన 3-4 రోజుల్లోనే అతిచిన్న పిల్లలు అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. వీటిని కొద్ది రోజులు నర్సరీ చెరువుల్లో పెంచి తర్వాత సాధారణ చేపల చెరువుల్లోకి మార్చాల్సి ఉంటుంది. తొలి విడత మెత్తళ్ల పిల్లలను ఒడిషా రైతులు, మహిళా స్వయం సహాయక బృందాలకు అందించారు.

మెత్తళ్ల చేప పిల్లలను తెలుగు రాష్ట్రాల్లోనూ చేపల రైతులకు, మహిళా బృందాలకు అందుబాటులోకి తేవాలి. నగరాల్లో/గ్రామాల్లో ఇంటి పంటలు /మిద్దె తోటల సాగుదారులకు కూడా మెత్తళ్ల చేప పిల్లలను అందించాలి. ప్రజలకు పౌష్టికాహార భద్రతను చేకూర్చడంలో చిరు చేపలు ఎంతగానో దోహదపడతాయి.

ఆయుర్వేద పశు వైద్యానికి 'శ్రీ'కారం

● రూ. 50 నుంచి రూ. 200 ఖర్చుతోనే పశు వ్యాధులకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స ● పొదుగు వాపు, ముద్ద చర్మం(లంపీ స్కిన్) వ్యాధి సహా 15 రకాల వ్యాధులకు రైతులే ఇంటిపట్టున చికిత్స చేసుకుంటున్న వైనం ● 3 రాష్ట్రాల రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీజ పాడి ఉత్పత్తిదారుల సంస్థ


ఆవులు, గేదెలకు సంక్రమించే వ్యాధుల్లో చాలా వరకు రైతులే సులభంగా తయారు చేసుకోగలిగే సంప్రదాయ ఆయుర్వేద మిశ్రమాలతో నయం చేసుకోవచ్చు.పాడి రైతులను బాగా ఇబ్బందిపెట్టే పొదుగు వాపు దగ్గరి నుంచి ఇటీవల కాలంలో రైతులను తిప్పలు పెడుతున్న ముద్ద చర్మం (లంపీ స్కిన్) వ్యాధి వరకు ఏ వ్యాధినైనా సరే.. వంటింట్లో అందుబాటులో ఉండే పసుపు, వెల్లుల్లి, కలబంద వంటి మూలికలతోనే ఖాయంగా నయం చేసుకోవచ్చు. ఇంకా వివరంగా చెప్పాలంటే.. ఖరీదైన యాంటీబయోటిక్ ఔషధాలు వాడనవసరం లేకుండా, కేవలం రూ. 50-200ల ఖర్చుతోనే పశు వ్యాధులకు ప్రభావవంతమైన ఆయుర్వేద వైద్యం చేసుకోవచ్చు. యాంటీబయోటిక్ రసాయనిక అవశేషాలు లేని ఆరోగ్యదాయకమైన పాలు, పాల ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చు.. ఇవన్నీ ఆకాంక్షలు కావు.. దేశవ్యాప్తంగా కోట్లాది పాడి రైతుల అనుభవాలు..

పశు వ్యాధులు సంప్రదాయ ఆయుర్వేద చికిత్సలతో.. యాంటీబయాటిక్స్ వాడకుండానే.. తక్కువ ఖర్చుతోనే.. ఇంటిపట్టునే నయమవుతున్నాయి. ఈ దిశగా దేశవ్యాప్తంగా విశేష కృషి చేస్తూ, రైతులకు శిక్షణ ఇస్తూ సత్ఫలితాలు సాధిస్తున్న ప్రముఖ సంస్థల్లో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఒకటి. తిరుపతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఈ ఎఫ్.పి.ఓ. పశు ఆయుర్వేద వైద్యంపై గత నాలుగేళ్లుగా పాడి రైతులను చైతన్యవంతం చేస్తోంది. తద్వారా సత్ఫలితాలు వస్తుండడంతో యాంటిబయాటిక్స్ ఉపయోగించటమే మానుకున్నామని రైతులు చెబుతున్నారు. వ్యాధులు సత్వరమే నయం కావడంతో పాటు పశువుల ఆరోగ్యంపై ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని రైతులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ), బెంగళూరులోని ట్రాన్స్ డిసిప్లనరీ యూనివర్సిటీ (టీడీయు) శాస్త్రవేత్తలు పరిశోధించి రూపొందించిన ఆయుర్వేద మిశ్రమాలనే శ్రీజ ఎఫ్.పి.ఓ. రైతుల్లోకి తీసుకువెళ్తోంది.


● పొదుగు వాపు సోకిన ఆవు పొదుగుకు కలబంద, పసుపు, సున్నం, నిమ్మరసం, బెల్లంతో తయారు చేసిన మిశ్రమాన్ని పూస్తున్న మహిళా రైతు

15 రకాల వ్యాధులకు ఆయుర్వేద మందులు

పొదుగువాపు, ముద్ద చర్మం (లంపీ స్కిన్) వ్యాధి వంటి మొండి జబ్బులతో పాటు 15 రకాల పశు వ్యాధులను ఆయుర్వేద మిశ్రమాలతోనే తగ్గిస్తున్నాం. తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయమవుతున్నాయి. పొదుగువాపు వ్యాధిని పాలలో కొవ్వు 3% కన్నా తగ్గినప్పుడే కనిపెట్టి నయం చేస్తున్నాం. ముద్ద చర్మం వ్యాధి వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తోంది. దీని ప్రభావం 20 రోజులుంటుంది. ఈ వ్యాధి ప్రస్తుతం రెండో దశలో తక్కువ తీవ్రతతో ఉంది. ఇమ్యూనిటీ తక్కువ ఉన్న ఆవులు ఒకటి రెండు శాతం మృత్యువాత పడుతున్నాయి. గోట్ పాక్స్ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలి. దాంతో పాటు మొదటి, రెండు డోసుల ఆయుర్వేద మిశ్రమాలను తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. 10 రోజుల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. చర్మంపై బొబ్బలు మానకుంటే పూత మందు వాడాల్సి ఉంటుంది.
18005322600కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.


- డా. భాను ప్రకాష్ రెడ్డి
(91545 67180),
శ్రీజ మహిళా పాడి ఉత్పత్తిదారుల సంస్థ, తిరుపతి

యాంటి బయోటిక్స్ లేని పాలు అందిస్తున్నాం


పశువుల్లో వచ్చే వ్యాధుల చికిత్సలో సాధారణంగా యాంటిబయోటిక్ ఔషధాలను ఎక్కువగా ఇస్తున్నారు. వాటి అవశేషాలు పాల ద్వారా మనుషుల దేహాల్లోకి చేరుతున్నాయి. వారి రోగనిరోధక శక్తి తగ్గిపోతోంది. ఈ సమస్య నుంచి బయటపడటానికి యాంటి బయోటిక్స్‌లేని పాలను అందించే దిశగా శ్రీజ సంస్థ పనిచేస్తోంది. అందుకోసం వంటింటిలో తయారు చేసుకునే ఆయుర్వేద మిశ్రమాలతో పశువులకు వైద్యం అందిస్తున్నాం. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు మాకు సహకరిస్తోంది. వంద శాతం ఆయుర్వేద వైద్యంతో యాంటిబయోటిక్స్‌లేని ఆరోగ్యకర, స్వచ్ఛమైన పాలను అందిస్తున్నాం. రైతులకు ఖర్చు తగ్గించి, ఆదాయం పెంచే దిశగా ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నాం.
- జయతీర్థాచారి, సీఈవో,
శ్రీజ మహిళా పాడి ఉత్పత్తిదారుల సంస్థ, తిరుపతి

24 గంటలూ ఉచిత ఫోను సదుపాయం

2018లో తంజావూరులో ఎన్‌డీడీబీ ఆధ్వర్యంలో పశు వ్యాధులకు ఆయుర్వేద వైద్యంపై శ్రీజ డైరీ ప్రతినిధులు శిక్షణ పొందారు. ఆ పద్ధతిలో అతితక్కువ ఖర్చుతో పశు వ్యాధులను నయం చేస్తున్నారు. రైతులను చైతన్యం చేసేందుకు ఇప్పటికే 80 వేల శిక్షణా శిబిరాలు నిర్వహించారు. పశు వ్యాధులకు ఆయుర్వేద చికిత్సతో తక్కువ ఖర్చే కాకుండా పాల దిగుబడి పెరుగుతోందంటున్నారు. రైతులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయడం కోసం శ్రీజ డెయిరీ రైతులకు ఉచిత ఫోన్ నెంబర్ 18005322600ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కేంద్రంలో సిబ్బంది 24గంటలూ అందుబాటులో ఉంటారు. పాడిరైతుల సమస్యలపై తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో సమాధానాలిస్తారు. ఎన్.డి.డి.బి. యూట్యూబ్ ఛానల్‌లో సంప్రదాయ ఆయుర్వేద పశువైద్య పద్ధతులపై తెలుగు వీడియోలు కూడా అందుబాటులో ఉన్నాయి.

3 రాష్ట్రాలు.. 1.15 లక్షల మంది మహిళా రైతులు..

శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ అంచెలంచెలుగా ఎదిగి అతిపెద్ద మహిళా పాడి రైతుల సమూహంగా మారింది. మూడు రాష్ట్రాల్లోని 1,15,695 మంది మహిళా పాడి రైతులు సభ్యులుగా ఉన్నారు. 95 శాతం మంది ఒకటి లేదా రెండు ఆవులున్న చిన్న, సన్నకారు రైతులే. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, కడప, ఒంగోలు జిల్లాలతో పాటు తమిళనాడు రాష్ట్రం వేలూరు, కాంచిపురం, తిరువణ్ణామలై, విల్లుపురం, క్రిష్ణగిరి జిల్లాలు, కర్నాటక రాష్ట్రం కోలార్, బుల్‌బాగల్ ప్రాంతాలలో శ్రీజ పనిచేస్తోంది. ప్రస్తుతం శ్రీజ టర్నోవర్ రూ. 850 కోట్లకు పైమాటే. 3,880 గ్రామాల్లో సుమారు 2 లక్షల ఆవుల నుంచి పాల సేకరణ జరుగుతోంది. ఈ గ్రామాలను 30 క్లస్టర్లుగా విభజించి మేనేజర్ స్థాయి, వైద్యుల పర్యవేక్షణలో పాడి ఆవుల పెంపకం సాగుతోంది. ప్రత్యేక చొరవతో పాడి రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఆయుర్వేద మందులపై గత నాలుగేళ్ల నుంచి వివరిస్తూ మార్పు తేవటం ప్రశంసనీయం.

- తలపోల శరణ్‌కుమార్,
సాక్షి, తిరుపతి అలిపిరి

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



రాణించిన రిజ్వాన్: తొలి వన్డేలో పాక్ గెలుపు

న్యూజిలాండ్ జట్టుతో కరాచీలో జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 256 పరుగుల విజయలక్ష్యాన్ని పాక్ 48.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రిజ్వాన్ (77 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ బాబర్ ఆజమ్ (66; 5 ఫోర్లు, 1 సిక్స్), ఫఖర్ జమాన్ (56; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 255 పరుగులు సాధించింది. నసీమ్ షా (5/57) కివీస్‌ను దెబ్బ తీశాడు.



తొలి రౌండ్‌లోనే సానియా జోడీ ఓటమి

కొత్త సంవత్సరాన్ని భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఓటమితో ప్రారంభించింది. సోమవారం మొదలైన అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టోర్నీలో సానియా మీర్జా-అనా డానిలినా (కజకిస్తాన్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సానియా-డానిలినా ద్వయం 6-3, 3-6, 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ స్టార్మ్ హంటర్ (ఆస్ట్రేలియా)-క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) జోడీ చేతిలో ఓడిపోయింది. సానియా-డానిలినా జోడీకి 4,350 డాలర్ల (రూ. 3 లక్షల 58 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

వన్డేలకు మోగిన విజిల్

వన్డే వరల్డ్‌కప్‌నామ సంవత్సరమిది... అదీ భారత గడ్డపై... ఈ నేపథ్యంలో అక్టోబరుకు ముందు ఇకపై జరిగే వన్డేలన్నీ భారత్‌కు సన్నాహకాలే... మధ్యలో ఐపీఎల్ రూపంలో టి20లు ఉన్నా, వన్డే జట్టు ఎంపికకు, తుది జట్టు కూర్పు కొరకు ఈ మ్యాచ్‌ల ప్రదర్శనే కీలకం అవుతుందనడంలో సందేహం లేదు. ఆసియాకప్ కాకుండా టీమిండియా కనీసం 15 వన్డేలు ఆడాల్సి ఉంది. ఈ క్రమంలో నేటినుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌లో శ్రీలంకను భారత్ ఎదుర్కొంటుంది.

- నేడు భారత్, శ్రీలంక తొలి పోరు
- అన్ని విభాగాల్లో పటిష్టంగా టీమిండియా
- ఆత్మవిశ్వాసంతో లంక బృందం
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

గువహటి: శ్రీలంకతో జరిగిన టి20 సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకున్న భారత జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌పై దృష్టి పెట్టింది. నేడు జరిగే తొలి వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల రాకతో భారత బృందం మరింత పటిష్టంగా మారగా... లంక దాదాపు అదే జట్టుతో మరో పోరాటానికి సిద్ధమైంది. తొలి రెండు టి20లు హోరాహోరీగా సాగినా... చివరి మ్యాచ్‌లో ఏకపక్ష విజయంతో భారత్ తమ స్థాయి ఏమిటో ప్రదర్శించింది. అయితే ఆ సిరీస్‌లో చూపిన ప్రదర్శన లంక జట్టులో ఆత్మ విశ్వాసం పెంచింది. 2017 తర్వాత స్వదేశంలో శ్రీలంకతో భారత్ వన్డే సిరీస్ ఆడుతోంది.

ఓపెనర్‌గా గిల్...

బంగ్లాదేశ్‌తో చివరి వన్డేలో అద్భుత బ్యాటింగ్‌తో 'డబుల్ సెంచరీ' సాధించినా... ఇషాన్ కిషన్‌కు ఈ మ్యాచ్‌లో మాత్రం చాన్స్ లేదు. కెప్టెన్ రోహిత్ రాకతో అతనిపై వేటు ఖాయమైంది. ఇషాన్‌కు అవకాశం ఇవ్వలేమని రోహిత్ స్పష్టం చేసేశాడు కూడా. వన్డేల్లో ఓపెనర్‌గా తనను తాను నిరూపించుకున్న శుబ్‌మన్ గిల్‌తో పాటు రోహిత్ ఓపెనింగ్ చేస్తాడు. టి20ల్లో ఆడని కోహ్లి తనకు బాగా అచ్చి వచ్చిన ఫార్మాట్‌లో మళ్లీ చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. లంకపై ఏకంగా 8 సెంచరీలు, 11 అర్ధ సెంచరీలు చేసిన ఘనమైన రికార్డు కోహ్లికి ఉంది. గత ఏడాది 55.69 సగటుతో 724 పరుగులు చేసిన శ్రేయస్ అయ్యర్‌కు మిడిలార్డర్‌లో చోటు ఖాయం కాగా... వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ కూడా బరిలోకి దిగుతాడు. దాంతో టి20ల్లో విధ్వంసం సృష్టించిన సూర్యకుమార్‌కు చోటు కష్టమే. పైగా వన్డేల్లో ఇప్పటి వరకు సూర్య ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది. రాహుల్, శ్రేయస్‌లలో ఒకరిని తప్పించి సూర్యను ఆడించే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. ఆరో స్థానంలో ఆల్‌రౌండర్‌గా కొత్త వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. బౌలింగ్‌లో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో జట్టు కూర్పు ఉండవచ్చు. అక్షర్ పటేల్ ఖాయం కాగా... రెండో స్పిన్నర్‌గా చహల్, కుల్దీప్ యాదవ్‌ల మధ్య పోటీ ఉంది. సీనియర్ పేసర్ షమీ, సిరాజ్‌లతో పాటు మూడో పేసర్‌గా అర్ష్‌దీప్, ఉమ్రాన్‌లలో ఒకరికి చాన్స్ దక్కుతుంది. బంగ్లా చేతిలో సిరీస్ ఓడినా... ఓవరాల్‌పై లంకపై భారత్‌దే పైచేయిగా కనిపిస్తోంది.



షనక

162 ఇప్పటి వరకు భారత్, శ్రీలంక జట్ల మధ్య 162 వన్డేలు జరిగాయి. 93 మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. 57 మ్యాచ్‌ల్లో శ్రీలంక నెగ్గింది. ఒక మ్యాచ్ 'టై'కాగా... 11 మ్యాచ్‌లు రద్దయ్యాయి. ఇక భారత గడ్డపై ఈ రెండు జట్లు 51 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 36 మ్యాచ్‌ల్లో టీమిండియా గెలుపొందగా... 12 మ్యాచ్‌ల్లో శ్రీలంక విజయం సాధించింది. మూడు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

అందరూ అంతంతే...

శ్రీలంక జట్టు గత కొంత కాలంగా వన్డేల్లో కాస్త మెరుగైంది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో సిరీస్ గెలవడం ఆ జట్టు చెప్పుకోదగ్గ ప్రదర్శన. అయితే సమస్యంతా ఒక్కొక్క ఆటగాడి వన్డే రికార్డుతోనే. ప్రస్తుతం ఉన్న జట్టులో అంతా టి20ల్లో ఆకట్టుకున్నవారే అయినా... వన్డేల్లో రెగ్యులర్‌గా తమను తాను నిరూపించుకున్నవారు ఎవరూ లేరు. టి20లతో పోలిస్తే వన్డేల్లో సుదీర్ఘ సమయం పాటు క్రీజ్‌లో నిలిచి ఇన్నింగ్స్‌ను నిర్మించే సమర్థుడైన బ్యాటర్ గానీ... 10 ఓవర్ల పాటు నిలకడగా ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగల బౌలర్ గానీ జట్టులో కనిపించడం లేదు. టి20ల్లో సత్తా చాటిన షనక వన్డే రికార్డు పేలవం. పైగా అతను ఇప్పటి వరకు భారత గడ్డపై వన్డే ఆడనే లేదు. అదే తరహాలో జట్టు ప్రధాన అస్త్రం హసరంగ కూడా వన్డేల్లో అంతంతే. ఇద్దరు పేసర్లు రజిత, కుమారలు ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోగా, మదుషంక వన్డేలో అరంగేట్రం చేయలేదు. ఇలాంటి స్థితిలో భారత్‌కు లంక ఏమాత్రం పోటీ నిస్తుందో చూడాలి.

పిచ్, వాతావరణం

బర్సపర స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలం. ఈ గ్రౌండ్‌లో 2018లో ఒకే ఒక వన్డే జరిగింది. విండీస్ 322 పరుగులు చేసినా, భారత్ 42.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్, షమీ, సిరాజ్, అర్ష్‌దీప్.

శ్రీలంక: షనక (కెప్టెన్), కుశాల్ మెండిస్, నిసాంక, అవిష్క, ధనంజయ, అసలంక, హసరంగ, కరుణరత్నే, తీక్షణ, రజిత, కుమార.

'నేను టి20ల నుంచి తప్పుకోలేదు'

గువహటి: వచ్చే టి20 వరల్డ్‌కప్ కోసం జట్టును సిద్ధం చేస్తున్నామని ఇటీవల కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో సీనియర్లు రోహిత్, కోహ్లి టి20ల భవిష్యత్తుపై సందేహాలు రేగాయి. వారిని పక్కన పెట్టి జట్టును పునర్నిర్మిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే దీనిపై కెప్టెన్ రోహిత్ స్పందించాడు. తానేమీ అంతర్జాతీయ టి20ల నుంచి తప్పుకోలేదని, ఐపీఎల్ తర్వాతే దీనిపై ఆలోచిస్తానని అతను అన్నాడు. 'మనం ఈ ఏడాది ఆరు టి20లు ఆడాల్సి ఉంటే మూడు ముగిశాయి. మిగతా మూడులో ఏం చేయాలో తెలుసు. అయితే ఒకటి మాత్రం స్పష్టం. నేను అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై చెప్పలేదు. ఐపీఎల్ తర్వాతే దీనిపై ఆలోచిస్తా. అయితే ఈ ఏడాది మా అందరి దృష్టీ వన్డేలపైనే ఉంది. అందరూ అన్ని మ్యాచ్‌లు ఆడలేరు. సీనియర్లకు పని భారం తగ్గించడంలో భాగంగానే లంకతో సిరీస్‌లో కొత్త ఆటగాళ్లు ఆడారు. నేను కూడా విశ్రాంతి తీసుకున్నవారిలో ఉన్నాను' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.



రోహిత్

తిరగబెట్టిన బుమ్రా గాయం

లంకతో వన్డే సిరీస్‌కు దూరం



గువహటి: జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, ఫిట్‌గా ఉన్నాడంటూ గత మంగళవారం సెలక్టర్లు శ్రీలంకతో వన్డేల కోసం అతడిని జట్టులోకి ఎంపిక చేశారు. అయితే తొలి వన్డేకు ఒకరోజు ముందు పరిస్థితి మారింది. గత రెండు రోజులుగా ముంబైలో ప్రాక్టీస్ చేస్తున్న అతనికి వెన్ను గాయం తిరగబెట్టింది. దాంతో సహచరులతో పాటు బుమ్రా గువహటికి వెళ్లలేదు. 'లంకతో వన్డే సిరీస్‌లో బుమ్రా ఆడటం లేదు. అతను పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసేందుకు మరికొంత సమయం అవసరం. ముందు జాగ్రత్తగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. అతని స్థానంలో ఎవరినీ ఎంపిక చేయడం లేదు' అని బీసీసీఐ ప్రకటించింది. అయితే ప్రస్తుత గాయం తీవ్రత ఏమిటనే దానిపై స్పష్టత లేదు. లంకతో సిరీస్ కాదన్నా... 18 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో ఆడతాడా అనేదీ చెప్పలేని పరిస్థితి! అయితే ఈ రెండింటికి మించి ఫిబ్రవరి 9 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌లో అతను బరిలోకి దిగడం ఎంతో అవసరం. పరిస్థితి చూస్తుంటే అదీ సందేహంగానే ఉంది. ముందుగా తొలి టెస్టుకు దూరం కావచ్చని అనిపించినా... సిరీస్ మొత్తం కూడా దూరమయ్యే ప్రమాదమూ లేకపోలేదు. బుమ్రా విషయంలో ఏమాత్రం తొందరపడదల్చుకోలేదని, స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్ కోసం అతను ఉంటే చాలని బోర్డు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ క్రికెట్‌కు ప్రిటోరియస్ గుడ్‌బై

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ డ్వెయిన్ ప్రిటోరియస్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని 33 ఏళ్ల ప్రిటోరియస్ స్పష్టం చేశాడు. 2016లో దక్షిణాఫ్రికా తరఫున అరంగేట్రం చేసిన ప్రిటోరియస్ 3 టెస్టులు, 27 వన్డేలు, 33 టి20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 7 వికెట్లు తీసి 83 పరుగులు చేసిన అతను... వన్డేల్లో 35 వికెట్లు పడగొట్టి 192 పరుగులు... టి20ల్లో 35 వికెట్లు నేలకూల్చి 261 పరుగులు సాధించాడు.



అంతర్జాతీయ టి20ల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన దక్షిణాఫ్రికా బౌలర్‌గా ప్రిటోరియస్ (2021లో పాకిస్తాన్‌పై 5/17) ఘనత వహించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ప్రిటోరియస్ ఇక నుంచి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న టి20 లీగ్‌లపై, ఇతర పొట్టి ఫార్మాట్‌లపై దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపాడు. ప్రస్తుతం ప్రిటోరియస్ ఐపీఎల్ (చెన్నై సూపర్‌కింగ్స్), ద హండ్రెడ్ (వెల్ష్ ఫైర్), కరీబియన్ ప్రీమియర్ లీగ్, ఎస్‌ఏ20 (డర్బన్ సూపర్ జెయింట్స్) లీగ్‌లలో భాగంగా ఉన్నాడు.

సింధు పునరాగమనం

నేటి నుంచి మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: గాయంతో ఐదు నెలలు ఆటకు దూరంగా ఉన్న భారత బ్యాడ్మింటన్ స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించాలనే పట్టుదలతో ఉంది. నేటి నుంచి జరిగే మలేసియా ఓపెన్ సూపర్-1000 టోర్నీతో 2023 బ్యాడ్మింటన్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులందరూ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో భారత్ తరఫున పీవీ సింధు, ఆకర్షి కశ్యప్, సైనా నెహ్వాల్, మాళవిక ... పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, లక్ష్య సేన్ పోటీపడుతున్నారు. గత ఏడాది ఆగస్టులో కామన్వెల్త్ గేమ్స్‌లో చివరిసారి బరిలోకి దిగిన సింధు మహిళల సింగిల్స్‌లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. ఆ తర్వాత చీలమండ గాయంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌తోపాటు ఇతర టోర్నీలకు ఆమె దూరంగా ఉంది. సింధు బుధవారం జరిగే తొలి రౌండ్‌లో మూడుసార్లు ప్రపంచ చాంపియన్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్ (స్పెయిన్)తో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో మంగళవారం తొలి రౌండ్ మ్యాచ్‌లో కెంటా నిషిమోటో (జపాన్)తో కిడాంబి శ్రీకాంత్ ఆడతాడు. 12 లక్షల 50 వేల డాలర్ల (రూ. 10 కోట్ల 29 లక్షలు) ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 87,500 డాలర్ల చొప్పున (రూ. 72 లక్షలు) అందజేస్తారు.

సినిమా



● రామజోగయ్యశాస్త్రి, నవీన్ యెర్నేని, గోపీచంద్ మలినేని, వై. రవిశంకర్

బ్లాక్ బస్టర్.. రాసిపెట్టుకోండి

- దర్శకుడు గోపీచంద్ మలినేని

''వీరసింహా రెడ్డి'కి తమన్ అత్యద్భుతమైన పాటలు ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా వేరే లెవెల్‌లో ఉంటుంది. ఇందులో అన్ని పాటలు రామజోగయ్య శాస్త్రిగారు రాశారు. 'మాస్ మొగుడు..' చివర్లో తీసిన పాట. అప్పుడు మా కెమెరామేన్ రిషి పంజాబీ డిఐ వర్క్‌లో వుండటం వలన నా 'క్రాక్' సినిమా కెమెరామేన్ జీకే విష్ణు ఈ పాటని చేశారు. బాలయ్యబాబుని చాలా కలర్‌ఫుల్‌గా చూపించారు'' అన్నారు గోపీచంద్ మలినేని. నందమూరి బాలకృష్ణ హీరోగా శ్రుతీహాసన్ హీరోయిన్‌గా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వీరసింహారెడ్డి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రంలోని 'మాస్ మొగుడు..' పాట ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, మనో, రమ్య బెహరా ఆలపించారు. ఈ కార్యక్రమంలో గోపీచంద్ మలినేని మాట్లాడుతూ– ''ఇటీవల ఒంగోలులో జరిగిన వేడుకలో విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్‌కి ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఇది జస్ట్ శాంపిల్ మాత్రమే. సినిమాలో మామూలుగా ఉండదు. 'వీరసింహా రెడ్డి' ష్యూర్ షాట్ బ్లాక్ బస్టర్... రాసిపెట్టుకోండి'' అన్నారు. రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ– ''నేను బాలకృష్ణగారికి అభిమానిని. ఈ చిత్రానికి సింగిల్ కార్డ్ రాసే చాన్స్ ఇచ్చిన గోపీచంద్ మలినేనికి, మైత్రీ మూవీ మేకర్స్‌కి కృతజ్ఞతలు. అన్ని పాటలూ అద్భుతంగా ఉంటాయి. బాలకృష్ణగారి మార్క్ ఫైర్ బ్రాండ్ సినిమా ఇది'' అన్నారు.

అందుకే ఒక అడుగు వెనక్కి తగ్గా!

- 'దిల్' రాజు

''వారసుడు'ని ఈ నెల 11న విడుదల చేయాలనుకున్నాం. అయితే బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి, చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య' సినిమాలు 12, 13న రిలీజ్ అవుతున్నాయి. ప్రతి థియేటర్‌లో ముందు మన తెలుగు పెద్ద స్టార్స్ సినిమాలు ఆడాలి, ఆ సినిమాలకు అన్ని చోట్ల థియేటర్లు దొరకాలని మా 'వారసుడు'ని రెండు రోజులు ఆలస్యంగా 14న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వారసుడు'. తమిళంలో 'వారీసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించారు. సోమవారం జరిగిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ముందు అనుకున్నట్లే 'వారీసు' ఈ నెల 11న తమిళంలో విడుదలవుతోంది. తెలుగులో వస్తున్న సంక్రాంతి సినిమాలకి మా 'వారసుడు' పోటీ కాదని చెబుతూనే ఉన్నాను. నిర్మాతలు బాగుండాలని కోరుకుంటాను. అందుకే 'వారసుడు' రిలీజ్ విషయంలో నేనే ఒక అడుగు వెనక్కి తగ్గాను. అయితే అందరూ నా మీద పడి ఏడుస్తున్నారు. పండ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలుంటాయి. నా నిర్ణయంపై ఇండస్ట్రీ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు'' అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ– ''11న తమిళ్‌లో విడుదలవుతున్న 'వారీసు' పెద్ద హిట్ కాబోతోంది. ఒకచోట విజయం సాధిస్తే ఆ చిత్రాన్ని ఆదరించడానికి మన తెలుగు ప్రేక్షకులు సిద్ధంగా ఉంటారు. రీసెంట్‌గా వచ్చిన 'కాంతార, లవ్ టుడే' చిత్రాలు ఇదే నిరూపించాయి'' అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ– ''మన తెలుగు స్టార్స్‌కి గౌరవం ఇస్తూ.. ఇన్ని కోట్లు ఖర్చు చేసి తీసిన సినిమాని 14కి వాయిదా వేసినందుకు 'దిల్' రాజుగారికి హ్యాట్సాఫ్. 'వారసుడు' లేటుగా వచ్చినా సూపర్ డూపర్ హిట్ అవుతుంది'' అన్నారు.



● శ్రీకాంత్, 'దిల్' రాజు




● గుణశేఖర్, సమంత, నీలిమ గుణ

ఓపిక లేకపోయినా వచ్చాను

- సమంత

''జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఒక్కటి మాత్రం మారలేదు. సినిమాను నేను ఎంతలా ప్రేమిస్తానో... సినిమా కూడా నన్ను అంతలా ప్రేమిస్తోంది. 'శాకుంతలం'తో మీ ప్రేమ మరింత పెరుగుతుందని నమ్ముతున్నాను'' అని సమంత అన్నారు. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ– ''ఓపిక లేకపోయినా గుణశేఖర్‌గారిపై ఉన్న అభిమానం, గౌరవంతో నా బలం మొత్తాన్ని కూడగట్టుకుని ఇక్కడికి వచ్చాను. కొందరికి సినిమా అనేది జీవితంలో ఓ భాగం. కానీ, గుణశేఖర్‌గారికి సినిమానే జీవితం. ప్రతి సినిమాలానే 'శాకుంతలం'ని కూడా ఆయన ప్రాణం పెట్టి తీశారు. ఏ కథ విన్నా సినిమా బాగా రావాలని నటీనటులు కోరుకుంటారు. కొన్నిసార్లు ఆ ఊహను దాటి ఎన్నో అద్భుతాలు జరుగుతాయి..'శాకుంతలం' చూశాక నాకు అదే భావన కలిగింది'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గుణశేఖర్‌గారు 'శాకుంతలం' కథ చెప్పినప్పుడు లీడ్ రోల్‌లో సమంత అయితే సరిపోతారనుకున్నాం. కథ విని, సమంత కూడా ఓకే అన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో తెరకెక్కిన ఒరిజినల్ పాన్ ఇండియా సినిమా ఇది'' అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ– ''శాకుంతలం'లో ముగ్గురు హీరోలున్నారు. కథకు హీరో దేవ్ మోహన్, సినిమాకు హీరో సమంత, తెర వెనక హీరో 'దిల్' రాజుగారు. ఇండియాలో వచ్చిన హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాల్లో అతి పెద్ద బడ్జెట్ సినిమా 'శాకుంతలం'. ఓ హీరోయిన్‌ని నమ్మి ఇంత బడ్జెట్ పెట్టిన రాజుగారికి థ్యాంక్స్. (చెమర్చిన కళ్లతో)'' అన్నారు. గుణశేఖర్ మాటలకు సమంత భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. ''మా నాన్న ఎన్నో విజువల్స్ వండర్స్ సృష్టించారు. 'శాకుంతలం' ఆయనకు పూర్వ వైభవం తెస్తుంది'' అన్నారు నీలిమ గుణ.



● అడివి శేష్

ఆల్ఫ్స్ పర్వతాలకు...

ఓ మిషన్ మీద ఒక గూఢచారి ఇండియా నుంచి ఆల్ప్స్ పర్వతాలకు వెళతాడు. ఆ మిషన్ ఏంటి? ఎలా విజయం సాధించాడు? అనేవి తెలియడానికి ఇంకా సమయం ఉంది. గూఢచారి పాత్రలో అడివి శేష్ హీరోగా రూపొందనున్న చిత్రం 'గూఢచారి 2'. ఈ చిత్రం ఫస్ట్ లుక్, ప్రీ విజన్ వీడియోను రిలీజ్ చేశారు. 'గూఢచారి'కి సీక్వెల్‌గా 'గూఢచారి 2' రూపొందనుంది. కాగా తొలి భాగం భారతదేశంలో జరిగితే రెండో భాగం కథ ఇండియా నుంచి ఆల్ప్స్ పర్వతాలకు ప్రయాణిస్తుంది. అడివి శేష్ కథ అందించిన ఈ చిత్రం ద్వారా ఎడిటర్ వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించనున్నారు.



● సూర్య వశిష్ఠ, అనికా

పేరు లేని ఊరులోకి...

చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కునే అమ్మాయి సత్య. మొబైల్ ఫోన్‌ని అంటిపెట్టుకుని ఉండే సత్య ఒకసారి ఓ ఆటోడ్రైవర్‌తో మాట్లాడుతుంది. ఆ పరిచయం ప్రేమదాకా దారి తీస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది 'బుట్టబొమ్మ'లో చూడాలి. అనికా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని 'పేరు లేని ఊరులోకి..' అంటూ సాగే తొలి పాటను సోమవారం రిలీజ్ చేశారు. స్వీకర్ అగస్తి స్వరపరిచిన ఈ పాటను సనాపతి భరద్వాజ్ పాత్రుడు రచించగా, మోహనా భోగరాజు ఆలపించారు. నూతన దర్శకుడు శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వంలో ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నెల 26న విడుదల కానుంది.

అన్నీ మరచిపోతాడు



● సుధీర్‌బాబు

సుధీర్ బాబు హీరోగా మహేష్ దర్శకత్వంలో వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన చిత్రం 'హంట్'. ఈ నెల 26న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రంలోని యాక్షన్ సీక్వెన్సెస్‌ని ఫ్రాన్స్‌కి చెందిన క్యాంపస్ యూనివర్స్ కాస్‌కేడ్స్ టీమ్ డిజైన్ చేసింది. సుధీర్‌బాబు మాట్లాడుతూ – ''ఈ చిత్రంలోని రిస్కీ ఫైట్స్‌కి డూప్ వాడలేదు. రోప్, బెడ్‌లాంటివి ఏవీ లేకుండానే ఫైట్స్ చేశాం. ఈ సినిమాలో అన్నీ మరచిపోయే రెండు షేడ్స్ ఉన్న అర్జున్ పాత్ర చేశాను. జ్ఞాపకశక్తి కోల్పోక ముందు కోల్పోయాక.. ఇలా నా పాత్ర ఉంటుంది'' అన్నారు. ''హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. హాలీవుడ్ మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన పలు చిత్రాలకు వర్క్ చేసిన రేనాడ్ ఫవెరో, బ్రయాన్ విజియర్ 'హంట్'కి స్టంట్స్ కంపోజ్ చేశారు. 'జాన్ విక్ 4'కి చిత్రానికి కూడా వాళ్లే స్టంట్ కొరియోగ్రాఫర్స్. ఈ ముగ్గురికీ తొలి భారతీయ చిత్రం ఇది'' అన్నారు ఆనందప్రసాద్. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: అరుల్ విన్సెంట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అన్నే రవి.

కథే మా ధైర్యం

- అనిల్ కుమార్ ఆళ్ల



''సంక్రాంతికి చిరంజీవిగారు, బాలకృష్ణగారు వంటి స్టార్ హీరోల చిత్రాలు (వాల్తేరు వీరయ్య, వీరసింహా రెడ్డి) విడుదలవుతున్నాయి. అయినప్పటికీ చిన్న సినిమా అయిన మా 'కళ్యాణం కమనీయం'ని విడుదల చేస్తున్నామంటే మా ధైర్యం కథే'' అని డైరెక్టర్ అనిల్ కుమార్ ఆళ్ల అన్నారు. సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజవుతోంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న అనిల్ కుమార్ ఆళ్ల చెప్పిన విశేషాలు.

● నేను పుట్టి, పెరిగింది గుంటూరులో. చదువు పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చి సినిమా ప్రయత్నాలు ప్రారంభించాను. వారాహి సంస్థలో 'తుంగభద్ర' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. 'కళ్యాణం కమనీయం' లైన్ అనుకున్నాక నా స్నేహితుడు అజయ్ కుమార్ రాజు ద్వారా యూవీ క్రియేషన్స్‌తో పరిచయం ఏర్పడింది. వారికి కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మించారు. ● పెళ్లయ్యాక భర్తకు జాబ్ లేకుంటే భార్య ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటుంది? తమ చుట్టూ జరిగే ఈగో (అహం) గేమ్స్‌ను ఈ జంట ఎలా ఎదుర్కొంది? అనేది ఆసక్తిగా ఉంటుంది. శివ, శ్రుతి పాత్రల్లో సంతోష్, ప్రియ నటన ఆకట్టుకుంటుంది. 'కళ్యాణం కమనీయం' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ● నా దృష్టిలో సినిమా అంటే మనల్ని మనం పోల్చుకోవాలి. నా లైఫ్‌లో జరిగిన వాస్తవ ఘటనలు కూడా ఈ చిత్రానికి స్ఫూర్తినిచ్చాయి. నా ఫేవరెట్ డైరెక్టర్స్ చాలామంది ఉన్నారు. ఎమోషన్ చూపించాలంటే మణిరత్నంగారు, ఒక హైలోకి తీసుకెళ్లాలంటే రాజమౌళిగారు, సొసైటీకి మంచి చెప్పే చిత్రాల విషయంలో శంకర్‌గారు, యాక్షన్ అంటే బోయపాటిగారు ఇలా.. చాలా మంది అభిమాన దర్శకులున్నారు. నేను ఏ సినిమా చేసినా ఎమోషన్‌ని మాత్రం మిస్ కాను. ఇక నాకు ఉన్న కలల్లో ప్రభాస్‌గారితో సినిమా చేయాలనే కల ఒకటి.

సాక్షి బిజినెస్
మంగళవారం
10-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
847	242
60,747	18,101

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,792	▲	223
డోజోన్స్	33,827	▲	196
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,725	▲	25
డాక్స్	14,793	▲	183
షాంఘై	3,176	▲	18
నికాయ్ (శుక్రవారం ముగింపు)	25,974	▲	153

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,259
బంగారం (99.5 స్వచ్ఛత)	56,034
వెండి (కిలో)	68,791

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయముక	81.55	83.22
£	బ్రిటన్ పౌండ్	ధాయముక	98.30	101.64
€	యూరో	ధాయముక	86.39	89.48
¥	జపాన్ ఎన్ (100)	ధాయముక	61.67	63.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధాయముక	55.90	58.31
S$	సింగపూర్ డాలర్	ధాయముక	60.92	62.94
SAR	సౌదీ రియాల్	ధాయముక	20.97	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయముక	21.53	23.32
¥	చైనా యువాన్	ధాయముక	11.02	13.05

కొచ్చర్ దంపతులకు బెయిల్

అరెస్ట్‌ను తప్పుపట్టిన హైకోర్ట్



ముంబై: రుణ మోసం కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో, ఎండీ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లకు బాంబే హైకోర్టు సోమవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ''క్యాజువల్ మరియు మెకానికల్'' ధోరణిలో ఈ అరెస్ట్ జరిగిందంటూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)ను తప్పు పట్టింది. అరెస్టులో తగిన చట్టపరమైన విధానం, వైఖరి అవలంబించలేదని 49 పేజీల ఉత్తర్వుల్లో న్యాయమూర్తులు రేవతి మోహితే దేరే, పీకే చవాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. వీడియోకాన్-ఐసీఐసీఐ బ్యాంక్ రుణం కేసుకు సంబంధించి 2022 డిసెంబర్ 23న కొచ్చర్‌లను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం వారు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కాగా, కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసింది.

టీటీకే ప్రెస్టీజ్ సూపర్ సేవర్ ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ కిచెన్ ఉపకరణాల బ్రాండ్ టీటీకే ప్రెస్టీజ్ 'సూపర్ సేవర్ ఆఫర్ 2022-2023' ను పరిచయం చేసింది. స్టవ్‌లు, బర్నర్లు, కుక్‌టాప్, గ్రైండర్లు, ఎలక్ట్రిక్ కెటిల్స్ వంటి గది ఉపకరణాలు, వంట సామగ్రిలను నమ్మశక్యం కాని గొప్ప తగ్గింపుతో అందుబాటులోకి తెచ్చింది. కొత్త ఏడాది, సంక్రాంతి సంబరాలను మరింత రెట్టింపు చేసుకునేందుకు అద్భుతమైన డీల్స్, భారీ తగ్గింపు, ఉచిత బహుమతులెన్నో ప్రకటించింది. వంటను సులభంగా, తర్వితగతిన చేసే వినూత్న ఉత్పత్తులను అందించే లక్ష్యంగా ప్రతి ఏడాదిలాగే ఈసారి సూపర్ సేవర్ ఆఫర్లు ప్రకటించామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దినేష్ గార్గ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-1-2023	
విశాఖ	562-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	554-00
విజయవాడ	554-00
రిటైల్ ధర (డజను)	78.00
9-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	553-00
వరంగల్	555-00
రిటైల్ ధర	6.10

సఖాలిన్-1 క్షేత్రాల్లో ఓవీఎల్‌కు 20 శాతం వాటాలు

న్యూఢిల్లీ: రష్యాలోని సఖాలిన్-1 చమురు, గ్యాస్ క్షేత్రాల్లో తిరిగి 20 శాతం వాటాలను తీసుకున్నట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం ఓఎన్‌జీసీ విదేశ్ వెల్లడించింది. ఈ ప్రాజెక్టు ఆపరేటర్ అయిన అమెరికన్ సంస్థ ఎక్సాన్‌మొబిల్ అనుబంధ కంపెనీ ఎక్సాన్ నెఫ్టేగాజ్‌ను పక్కకు తప్పించి, దానికి సంబంధించిన అసెట్స్ అన్నింటిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గతేడాది కొత్త ఆపరేటర్‌కు బదలాయించారు. గతంలో తమకున్న వాటాలను తిరిగి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలంటూ అప్పట్లో షేర్ హోల్డర్లయిన జపాన్ సంస్థ సోడెకో కన్సార్షియం, ఓవీఎల్‌కు రష్యా ప్రభుత్వం సూచించింది. దానికి అనుగుణంగానే ఓవీఎల్ దరఖాస్తు చేసుకోగా, తదనుగుణంగా గతంలో దానికి ఉన్నంత వాటాలను కేటాయించింది. సోడెకో కూడా తన వాటాను అట్టే పెట్టుకుంది. అయితే, ఎక్సాన్‌మొబిల్ విషయంలో స్పష్టత రాలేదు. గతంలో సఖాలిన్1లో ఎక్సాన్ నెఫ్టేగ్యాస్, సోడెకో సంస్థలకు చెరి 30 శాతం, రాస్‌నెఫ్ట్‌కు 20 శాతం వాటాలు ఉండేవి. 2001లో ఓవీఎల్ ఇందులో 20 శాతం వాటాలు తీసుకుంది. గతేడాది అక్టోబర్‌లో ఈ ప్రాజెక్టును సఖాలిన్-1 లిమిటెడ్ లయబిలిటీ కంపెనీకి రష్యా బదలాయించింది. ఈ కొత్త కంపెనీలో ఓవీఎల్, రాస్‌నెఫ్ట్‌కు చెరి 20 శాతం, సోడెకోకు 30 శాతం వాటాలు ఉండగా.. ఎక్సాన్‌మొబిల్ వాటా విషయంలో ఇంకా ఏమీ తేలలేదు. ఉక్రెయిన్ మీద దాడికి ప్రతిగా రష్యాపై ప్రపంచ దేశాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో గతేడాది ఏప్రిల్‌లో సఖాలిన్-1 నుంచి ఉత్పత్తిని ఎక్సాన్ నెఫ్టేగాజ్ నిలిపివేసింది. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు సఖాలిన్-1లో రోజుకు 2,20,000 బ్యారెళ్ల (బీపీడీ) చమురు ఉత్పత్తయ్యేది. నవంబర్ నుంచి మళ్లీ 1,40,000-1,50,000 బీపీడీ మేర ఉత్పత్తి మొదలుపెట్టారు.

శుక్రవారం ప్రధాని ప్రీ బడ్జెట్ భేటీ!



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఆర్థివేత్తలు, వివిధ రంగాల నిపుణులతో ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. నీతి ఆయోగ్‌లో జరగనున్న ఈ భేటీలో దేశ ఆర్థిక వ్యవస్థ, వృద్ధి పురోగతికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై ప్రధాని చర్చించనున్నారని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నట్లు సమాచారం. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన 2023-24 వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని భావిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) భారత్ ఎకానమీ వృద్ధి రేటు 6.5-7.0 శ్రేణిలో నమోదవుతుందని అంచనా.

టీసీఎస్ క్యూ3 భేష్!

- నికర లాభం రూ. 10,846 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 58,229 కోట్లు
- వచ్చే ఏడాది 1.5 లక్షల మందికి ఉపాధి
- షేరుకి రూ. 75 చొప్పున డివిడెండ్



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల టాటా గ్రూప్ దిగ్గజం టీసీఎస్ ఈ ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 11 శాతం పుంజుకుని రూ. 10,846 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 9,769 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 19 శాతం ఎగసి రూ. 58,229 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 48,885 కోట్ల టర్నోవర్ నమోదైంది. కార్యకలాపాల్లో వృద్ధి, ఫారెక్స్ లాభాలు తాజా త్రైమాసికంలో కంపెనీ లాభదాయకతకు సహకరించాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 75 చొప్పున డివిడెండ్‌ను ప్రకటించింది. దీనిలో రూ. 67 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. వెరసి డివిడెండ్ రూపేణా రూ. 33,000 కోట్లను పంచనుంది. డాలర్ల రూపేణా ఆదాయం 8 శాతం మెరుగుపడినట్లు టీసీఎస్ పేర్కొంది.

భారీగా ఉద్యోగాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం(2023-24)లో అత్యంత భారీగా ఉద్యోగ సృష్టికి తెరతీయనున్నట్లు టీసీఎస్ వెల్లడించింది. సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి కల్పించే యోచనలో ఉన్నట్లు తెలియజేసింది. డీల్ పరిస్థితులు, పైప్‌లైన్ ఆశావహంగా ఉన్నట్లు సీవోవో ఎన్.గణపతి సుబ్రమణ్యం పేర్కొన్నారు. 7 నుంచి 9 బిలియన్ డాలర్ల మధ్య డీల్స్‌ను లక్ష్యంగా పెట్టుకోగా.. వీటికి మధ్యస్థంగా కాంట్రాక్టులు పొందినట్లు వెల్లడించారు. థర్డ్‌పార్టీ, ఇతర వ్యయాలు పెరగడంతో లాభాల మార్జిన్లు ప్రభావితమైనట్లు సీఎఫ్‌వో సమీర్ సేక్సరియా పేర్కొన్నారు. గతేడాది స్థాయిలోనే 25 శాతం ఇబిటా మార్జిన్లు సాధించగలమని తెలియజేశారు.

తగ్గిన సిబ్బంది...

చాలా ఏళ్ల తదుపరి క్యూ3లో టీసీఎస్ మొత్తం సిబ్బంది సంఖ్య 2,197 తగ్గి 6,13,974కు పరిమితమైంది. ఉపాధి కల్పనకు మించి ఉద్యోగ వలస దీనికి కారణమైనట్లు హెచ్ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ తెలియజేశారు. ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో 42,000 మంది ఫ్రెషర్స్‌ను తీసుకోగా.. క్యూ4(జనవరి-మార్చి)లోనూ మరికొంతమందికి ఆఫర్ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. వచ్చే ఏడాది(2023-24)లోనూ 40,000 మంది కొత్తవారిని నియమించుకోనున్నట్లు వెల్లడించారు. పూర్తి ఏడాదిలో 1.25-1.5 లక్షల మందిని ఎంపిక చేసుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేశారు.

ఇతర హైలైట్స్

- నిర్వహణ లాభ మార్జిన్లు 0.5 శాతం బలపడి 24.5 శాతాన్ని తాకాయి.
- క్యూ3లో 7.9 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది.
- ఉద్యోగుల వలస(అట్రిషన్) స్వల్పంగా తగ్గి 21.3 శాతానికి చేరింది.
- కొత్త ఏడాదిలో 40,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రకటన.

మార్కెట్లు ముగిశాక టీసీఎస్ సాయంత్రం ఫలితాలు విడుదల చేసింది. క్యూ3 పనితీరుపై అంచనాలతో టీసీఎస్ షేరు బీఎస్ఈలో 3.35 శాతం ఎగసి రూ. 3,320 వద్ద ముగిసింది.

క్లౌడ్ దన్ను

సీజనల్‌గా బలహీన త్రైమాసికంగా పేర్కొనే క్యూ3లోనూ పటిష్ట ఫలితాలు సాధించాం. ఇందుకు ప్రధానంగా క్లౌడ్ సర్వీసుల్లో వృద్ధి దోహదపడింది. స్వల్పకాలిక అనిశ్చితులున్నప్పటికీ ఉత్తర అమెరికా, ఇంగ్లండ్‌లలో బలపడిన బిజినెస్ సైతం ఇందుకు జత కలిసింది. యూరోపియన్ క్లయింట్ల ఐటీ వ్యయాలను రాజకీయ, భౌగోళిక ఆందోళనలు ప్రభావితం చేస్తున్నాయి.

– రాజేష్ గోపీనాథన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

సెన్సెక్స్.. బౌన్స్‌బ్యాక్

- 847 పాయింట్లు హైజంప్
- 60,747 వద్ద ముగింపు
- మూడు రోజుల నష్టాలకు చెక్
- నిఫ్టీ 242 పాయింట్లు ప్లస్
- రూపాయి 31 పైసలు అప్



ముంబై: గ్లోబల్ మార్కెట్ల సానుకూలతలు, ఇన్వెస్టర్ల మూకుమ్మడి కొనుగోళ్లతో దేశీ స్టాక్ మార్కెట్లు కదం తొక్కాయి. వెరసి మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ క్యూ3 ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఐటీ కౌంటర్లకు డిమాండ్ పుట్టింది. ముందురోజు నాస్‌డాక్ (యూఎస్) జోరందుకోవడం ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చింది. సెన్సెక్స్ 847 పాయింట్లు జంప్ చేసింది. 60,747 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 242 పాయింట్లు ఎగసి 18,101 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 989 పాయింట్లు దూసుకెళ్లి 60,889ను తాకింది. నేటి ట్రేడింగ్‌లో ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో సానుకూల ట్రెండ్ నెలకొంది. దీంతో సెంటిమెంటు బలపడినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. వేతన వృద్ధి మందగించడం, సర్వీసుల రంగం బలహీనపడటంతో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు వేగానికి క్లెం పడనున్నట్లు అంచనాలు పెరిగాయి. డాలరుతో మారకంలో రూపాయి 31 పైసలు బలపడింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 82.35 వద్ద ముగిసింది.

మూడు మాత్రమే

ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్‌లో మూడు కౌంటర్లు మాత్రమే డీలా పడ్డాయి. ప్రధానంగా హెచ్‌సీఎల్ టెక్, ఎంఅండ్‌ఎం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్, ఆర్ఐఎల్, యాక్సిస్ బ్యాంక్ లాభపడ్డాయి. బ్లూచిప్స్‌లో కేవలం టైటన్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ వెనకడుగు వేశాయి. టెక్నాలజీ, ఐటీ 2.6 శాతం జంప్‌చేయగా.. పవర్, మెటల్, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ఇండస్ట్రియల్స్ 1.8-1.2 శాతం మధ్య ఎగశాయి. కేవలం కన్జూమర్ డ్యురబుల్స్ నీరసించింది. మిడ్ క్యాప్ ఇండెక్స్ 1 శాతం, స్మాల్ క్యాప్ 0.5 శాతం చొప్పున బలపడ్డాయి. గత వారం దిద్దుబాటు తదుపరి గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న సానుకూల ట్రెండ్ దన్నుతో ఇన్వెస్టర్లు షార్ట్ కవరింగ్ చేపట్టినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

తెలంగాణలో ఉజ్జీవన్ బ్యాంక్

- అయిదు శాఖల ఏర్పాటు; వచ్చే ఏడాది ఏపీలోకి విస్తరణ
- బ్యాంక్ సీఈవో డేవిస్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తాజాగా తెలంగాణకు కార్యకలాపాలు విస్తరిస్తోంది. తొలుత అయిదు శాఖలను ప్రారంభించనుంది. వీటిలో నాలుగు వచ్చే వారంలోనూ, మరొకటి వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో ఇతిరా డేవిస్ సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. వచ్చే ఏడాది వీటి సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు, అలాగే తమ టాప్ 10 మార్కెట్లలో తెలంగాణ కూడా ఒకటిగా నిలవగలదని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. అటు వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లోకి కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు డేవిస్ తెలిపారు. ప్రస్తుతం 71 లక్షలకు పైగా కస్టమర్లకు సర్వీసులు అందిస్తున్నామని, కొత్త వాటితో కలిపి ప్రస్తుతం తమకు దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 598 శాఖలు ఉంటాయని వివరించారు.

పసిడి, ట్రాక్టర్ లోన్స్‌పై దృష్టి..

బంగారం రుణాలు, ద్విచక్ర వాహనాల రుణాలు, ట్రాక్టర్ లోన్స్‌పైనా దృష్టి పెడుతున్నట్లు డేవిస్ చెప్పారు. ప్రస్తుతం తమ పోర్ట్‌ఫోలియోలో సూక్ష్మ రుణాల విభాగం 71 శాతంగా ఉండగా మిగతాది అఫోర్డబుల్ హౌసింగ్ మొదలైన విభాగాల్లో ఉంటోందని పేర్కొన్నారు. వచ్చే అయిదేళ్లలో సూక్ష్మ రుణాల పోర్ట్‌ఫోలియోను 50 శాతానికి తగ్గించుకోవడం ద్వారా సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య సమతౌల్యం సాధించాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆఖరు నాటికి శాఖల సంఖ్యను 625కి పెంచుకోనున్నామని డేవిస్ చెప్పారు. తెలంగాణ శాఖల్లో తొలుత 30 మంది వరకు సిబ్బంది ఉంటారు. మరోవైపు, మాతృ సంస్థను విలీనం చేసుకునే రివర్స్ మెర్జర్ ప్రక్రియ జూన్-సెప్టెంబర్ మధ్యలో పూర్తి కావచ్చని భావిస్తున్నట్లు వివరించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ హైకోర్టులో 39 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కోర్టు మాస్టర్, పర్సనల్ సెక్రటరీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 39
- **అర్హత:** డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/కామర్స్),ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, హయ్యర్ గ్రేడ్ ఇంగ్లిష్ టైప్ రైటింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. ▪ **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్),ఆంధ్రప్రదేశ్ హైకోర్టు,నేలపాడు,అమరావతి, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.01.2023.
- **పరీక్ష తేది:** 04.02.2023.
- **ఫలితాల వెల్లడి తేది:** 08.02.2023.
- **వెబ్‌సైట్:** hc.ap.nic.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 97 రికార్డు అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 97
- **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్ణీత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ ఉన్న అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సర్టిఫికెట్లు అందజేయాలి.
- **వయసు:** 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.22,240 నుంచి రూ.67,300 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)/ఓమ్మార్ పరీక్షలో 100 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 60, జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 40ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 15.02.2023. ▪ **పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 163 ప్రాసెస్ సర్వర్ పోస్టులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 163
- **అర్హత:** పదో తరగతి లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు దరఖాస్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను పేర్కొనడంతోపాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి.
- **వయసు:** 18నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.22,900 నుంచి రూ.69,150 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష(45 మార్కులు), ఇంటర్వ్యూ(5 మార్కులు) ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ఓమ్మార్ పరీక్షలో 45 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 30,జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 15 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 15.02.2023
- **పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

నార్త్ వెస్ట్రన్ రైల్వేలో 2026 అప్రెంటిస్‌లు

జైపూర్(రాజస్థాన్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీఎస్ఈ)-నార్త్ వెస్ట్రన్ రైల్వే ఎన్‌డబ్ల్యూఆర్ వర్క్‌షాప్/యూనిట్లలో వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 2026
- **డివిజన్ల వారీగా ఖాళీలు:** డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, అజ్మీర్-413, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, బికనీర్-423, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, జైపూర్ డివిజన్-494, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, జోధ్‌పూర్ డివిజన్-404, బీటీసీ క్యారేజ్, అజ్మీర్-126, బీటీసీ లోకో, అజ్మీర్-65, క్యారేజ్ వర్క్‌షాప్, బికనీర్-31, క్యారేజ్ వర్క్‌షాప్, జోధ్‌పూర్-70.
- **ట్రేడులు:** ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్ తదితరాలు.
- **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో పదో తరగతి,సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:**15నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 10.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2023.
- **వెబ్‌సైట్:** www.rrcjaipur.in

సీఆర్‌పీఎఫ్‌లో చేరే మార్గం ఇదిగో!

» ఏఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్‌ల ద్వారా ఎంపిక ప్రక్రియ
» పే లెవల్-5, 4లతో ప్రారంభ వేతన శ్రేణి
» కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ

పోలీస్ కొలువుల అభ్యర్థుల ముంగిట మరో జాబ్ నోటిఫికేషన్! ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కోరుకునే వారికి చక్కటి అవకాశం! ఇంటర్మీడియెట్ అర్హతతోనే అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ), హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1,458 పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నేపథ్యంలో.. సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాల గురించి తెలుసుకుందాం...

సాయుధ దళాల్లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ విభాగంలో అడుగుపెడితే జాతీయ స్థాయిలో సీఆర్‌పీఎఫ్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అవకాశం లభిస్తుంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలోని పోలీస్ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు.. అదే సన్నద్ధతతో సీఆర్‌పీఎఫ్ పోస్టులకు కూడా పోటీ పడొచ్చు.

మొత్తం 1,458 పోస్టులు

సీఆర్‌పీఎఫ్ తాజా నియామక ప్రకటనను పరిశీలిస్తే.. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్ఐ), హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) హోదాల్లో మొత్తం 1,458 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో 143 ఏఎస్ఐ, 1,315 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- జనవరి 25, 2023 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జనవరి 25, 2023 నాటికి 18-25 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ(స్టెనో), హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) పోస్టులకు సంబంధించి ఎంపిక ప్రక్రియను మూడు దశల్లో నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. దీంతోపాటు డాక్యుమెంట్ వెరిఫికేషన్, డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

రాత పరీక్ష


ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో వంద ప్రశ్నలు-వంద మార్కులకు ఉంటుంది. ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్/హిందీ 25 ప్రశ్నలు-25 మార్కులు, జనరల్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-25 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-25 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. సెక్షన్-ఎలో అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు ఇంగ్లిష్ లేదా హిందీ లాంగ్వేజ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. మిగతా విభాగాలకు ఇంగ్లిష్ లేదా హిందీ మాధ్యమంలో హాజరు కావచ్చు.

స్కిల్ టెస్ట్

- ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే రాత పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.
- ఏఎస్ఐ పోస్టుల అభ్యర్థులకు షార్ట్‌హ్యాండ్ పరీక్ష నిర్వహిస్తారు. నిమిషానికి 80 పదాలు చొప్పున పది నిమిషాలపాటు డిక్టేషన్ ఇస్తారు. ఆ డిక్టేషన్‌ను ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో 50 నిమిషాల్లో, హిందీ లాంగ్వేజ్‌లో 65 నిమిషాల్లో సవివరంగా కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది.
- హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కంప్యూటర్ టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీలో నిమిషానికి 30 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.
- స్కిల్ టెస్ట్ కేవలం అర్హత పరీక్షగానే ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లలో అర్హత సాధించిన వారికి తదుపరి దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 165 సెం.మీ. ఎత్తు ఉండాలి. మహిళా అభ్యర్థులు 150 సెం.మీ ఎత్తు కలిగి ఉండాలి.
- ఛాతి విస్తీర్ణం కనీసం 77 సెం.మీ ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు 82 సెం.మీగా నమోదవ్వాలి. (ఈ విభాగం నుంచి మహిళా అభ్యర్థులకు మినహాయింపు కల్పించారు)



పోలీస్ జాబ్స్

చివరగా డీఎంఈ

మూడు దశల్లోనూ విజయం సాధించిన వారికి చివరగా డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్(డీఎంఈ) పేరుతో శారీరక, ఆరోగ్య ధ్రుడత్వ పరీక్షలు నిర్వహిస్తారు. దీనికంటే ముందుగా సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. డీఎంఈలోనూ విజయం సాధించిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ప్రారంభ వేతనం

- ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌గా నియామకం ఖరారు చేసుకున్న వారికి ఏడో వేతన సవరణ ప్రకారం-పే లెవల్ 4, 5లతో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- ఏఎస్ఐ పోస్టులకు ఎంపికైన వారికి పే లెవల్ 5తో రూ.29,200-రూ.92,300 వేతన శ్రేణి ఉంటుంది.
- హెడ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి పే లెవల్ 4తో రూ.25,500-రూ.81,100 వేతన శ్రేణి ఉంటుంది.

పదోన్నతులు ఇలా

సీఆర్‌పీఎఫ్‌లో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి పదోన్నతులు ఉంటాయి. హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులు ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు. అదే విధంగా ఏఎస్ఐ నుంచి అసిస్టెంట్ కమాండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లలో విజయం సాధించిన వారికి మరింత వేగంగా పదోన్నతులు లభిస్తాయి. ప్రతి పదోన్నతికి కనీసం అయిదేళ్లు,గరిష్ఠంగా 18 ఏళ్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

సిలబస్ అంశాలపై పట్టుతో

జాతీయ స్థాయిలో పోటీ నెలకొనే సీఆర్‌పీఎఫ్ నియామక పరీక్షలో రాణించేందుకు.. అభ్యర్థులు ఆయా సిలబస్ అంశాలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్ స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ ఆప్టిట్యూడ్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించేందుకు.. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలను ఔపోసన పట్టాలి. అదే విధంగా సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

స్కిల్ టెస్ట్

స్కిల్ టెస్ట్‌లో రాణించేందుకు.. అభ్యర్థులు కంప్యూటర్ టైపింగ్ ప్రాక్టీస్ మెరుగుపరచుకోవాలి. టైపింగ్ టెస్ట్‌లో.. మొత్తం పదాల్లో అయిదు శాతం కంటే ఎక్కువ తప్పులుంటే.. దానికి అనుగుణంగా అభ్యర్థుల ప్రతిభను గణించే నిబంధన విధించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**జనవరి 25,2023
- **అడ్మిట్ కార్డ్ విడుదల:** ఫిబ్రవరి 15, 2023
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** ఫిబ్రవరి 22 – ఫిబ్రవరి 28, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://crpfindia.com, https://crpf.nic.in

క్లుప్తంగా...

కుప్పంలో పోలీసులపై దాడి కేసుల్లో నలుగురి అరెస్ట్

కుప్పం(చిత్తూరు జిల్లా): ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన సందర్భంగా పోలీసులపై దాడులు, దౌర్జన్యానికి పాల్పడిన కేసుల్లో సోమవారం నలుగురిని అరెస్ట్ చేశారు. రామకుప్పం మండలంలోని 89 పెద్దూరుకు చెందిన శేషాద్రి, ఆరిమానిపెంటకు చెందిన బీఆర్ ప్రకాష్, వినాయకపురానికి చెందిన ఎస్.వాసు, శాంతిపురం మండలం ఎంకేపురానికి చెందిన జమీర్‌లను అరెస్ట్ చేసినట్లు కుప్పం రూరల్ సీఐ రియాజ్ తెలిపారు. నిందితులను కుప్పం కోర్టులో హాజరుపరిచి, మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

న్యాయపరమైన అంశాల్లో వ్యక్తిగత అభిప్రాయాలు బాధాకరం

- 834వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



నేలపై కూర్చొని రిలే దీక్ష చేస్తున్న బహుజన నేతలు

తాడికొండ: న్యాయపరమైన అంశాల్లో వ్యక్తిగత అభిప్రాయాలు వ్యక్తం చేయడం బాధాకరమని, ఆ కారణంగా ప్రజల హక్కులకు భంగం కలిగే అవకాశం ఉందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 834వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. కొంత మంది న్యాయమూర్తులు వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడిస్తూ కొంత మందికి ప్రయోజనం కలిగేలా వ్యవహరించడం బాధించే అంశం అన్నారు. సమాజాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రజా సమస్యలు విడనాడి చంద్రబాబు పొత్తులు, ప్యాకేజీల కోసం పాకులాడుతుండడం సిగ్గుచేటని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన ప్యాకేజీ స్టార్ పక్క పార్టీలకు అమ్ముడుపోయి కేవలం ప్రకటనలకే పరిమితమవడం వెనుక ఎంత డీల్ కుదిరిందో తేటతెల్లం చేయాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా బహుజన పరిరక్షణ సమితి దీక్షా శిబిరంలో స్టేజీ బల్లలు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి దొంగిలించడంపై పలువురు నాయకులు మండిపడ్డారు. కులవాదులు, టీడీపీ నాయకులు కలిసి.. పగబట్టి దీక్షలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులిదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక పేరుతో బాబు, పవన్‌ల నాటకాలు

- వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ బద్ధమైన పాలనను అందించి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అధికారం కోసం ప్రతి ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం, అధికారంలోకి వచ్చాక పొత్తులు పెట్టుకున్న పార్టీలతో విభేదించి మోసం చేయడం అలవాటుగా మార్చుకున్నారని దుయ్యబట్టారు. జనసేన దశ, దిశ లేని పార్టీ అని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కలిసి తమ స్వార్థ రాజకీయాల కోసం పొత్తులు పెట్టుకుని 2024 ఎన్నికల్లో మరో మారు రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.

'యువగళం' పాదయాత్రకు అనుమతివ్వండి

- డీజీపీకి టీడీపీ నేత వర్ల రామయ్య లేఖ

సాక్షి, అమరావతి: ఈ నెల 27వ తేదీ నుంచి తమ పార్టీ నేత నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చేపట్టనున్న పాదయాత్రకు అనుమతివ్వాలని టీడీపీ నాయకుడు వర్ల రామయ్య సోమవారం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. పాదయాత్రకు అనుమతి ఇవ్వడంతోపాటు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది పాదయాత్రకు సంబంధించిన అన్ని వ్యవహారాలు చూసుకుంటారని లేఖలో పేర్కొన్నారు. లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని ఇటీవల కొందరు సంఘవిద్రోహ శక్తులు బెదిరింపులకు పాల్పడ్డారని, రాజకీయ వ్యతిరేకులు, ఫ్యాక్షనిస్టుల నుంచి ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పాదయాత్రకు, రాత్రిళ్లు బస వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని కోరారు.

- ఏపీ నంబర్-1

సూపర్ మత్స్యం

చేపల ఉత్పత్తిలో గణనీయ పురోగతి సాధించిన ఏపీ



- దేశంలో సగటు వృద్ధిరేటు 6.61%
- ఏపీలో వృద్ధిరేటు 12.57%
- ఉత్పత్తిలో 30.82% వాటా ఏపీదే

ఎగుమతుల్లో మూడో వంతు ఆంధ్రప్రదేశ్ నుంచే

రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ చేపల ఉత్పత్తిలోనూ అగ్రగామిగా నిలిచింది. దేశవ్యాప్త రొయ్యల ఉత్పత్తిలో ఏపీ వాటా 76 శాతం కాగా.. చేపల ఉత్పత్తి, ఎగుమతుల్లోనూ గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. 2021-22లో చేపల ఉత్పత్తిలో 30.82 శాతం ఏపీ నుంచే కాగా.. ఎగుమతుల్లో 35 శాతం వాటాను ఆక్రమించింది.

చేపల ఉత్పత్తిలో ఏపీ పురోగతి ఇలా.. (లక్షల టన్నుల్లో)

సంవత్సరం	దేశంలో ఉత్పత్తి	ఏపీలో ఉత్పత్తి	ఏపీ వాటా శాతం
2014-15	102.60	19.78	19.28
2015-16	107.62	23.52	21.85
2016-17	114.31	27.66	24.20
2017-18	127.04	34.50	27.16
2018-19	135.73	39.91	29.40
2019-20	141.64	41.74	29.47
2020-21	149.98	46.23	30.82

సాక్షి, అమరావతి: చెరువులు, కాలువలు వంటి నీటి వనరుల్లో (ఇన్‌ల్యాండ్) చేపలను ఉత్పత్తి చేయడంలో అగ్రస్థాన నిలిచింది. ఇన్‌ల్యాండ్‌లో 42.19 లక్షల టన్నుల చేపల ఉత్పత్తితో ఏపీ మొదటి స్థానంలో నిలవగా.. ఆ తర్వాత 16.52 లక్షల టన్నులతో పశ్చిమ బెంగాల్, 8.09 లక్షల టన్నులతో ఉత్తరప్రదేశ్, 7.89 లక్షల టన్నులతో ఒడిశా, 7.62 లక్షల టన్నులతో బిహార్ వరుస స్థానాలు పొందాయి. కాగా, సముద్ర మత్స్య ఉత్పత్తుల్లో 7.02 లక్షల టన్నులతో గుజరాత్ మొదటి స్థానం, 6.01 లక్షల టన్నులతో కేరళ రెండోస్థానం, 5.95 లక్షల టన్నులతో తమిళనాడు మూడో స్థానంలో ఉండగా.. 5.94 లక్షల టన్నులతో ఏపీ నాలుగో స్థానంలో నిలిచింది.

జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ టాప్

చేపల ఉత్పత్తిలో 2021-22 సంవత్సరానికి సంబంధించి జాతీయ సగటు వృద్ధి రేటుతో పోలిస్తే.. ఆంధ్రప్రదేశ్ దాదాపు రెట్టింపు వృద్ధి రేటు నమోదు చేసింది. జాతీయ స్థాయిలో వృద్ధి రేటు 6.61 శాతంగా నమోదు కాగా.. ఆంధ్రప్రదేశ్ ఏకంగా 12.57 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. 20కి పైగా రాష్ట్రాల్లో ఏపీలో ఉత్పత్తి అవుతున్న చేపలకే డిమాండ్ అధికంగా ఉంది. స్థానికంగా ఉత్పత్తి అయ్యే చేపల్లో 20 లక్షల టన్నులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. 2021-22లో 48.13 లక్షల టన్నుల ఉత్పత్తితో రూ.59,188 కోట్ల జీవీఏ (జోడించబడిన స్థూల విలువ) సాధించింది.



ఎగుమతుల్లోనూ హవా

సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ ఏపీ హవా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 2020-21లో రూ.43,717 కోట్ల విలువైన 11.49 లక్షల టన్నులు ఎగుమతి కాగా.. ఏపీ నుంచి ఏకంగా రూ.15,832 కోట్ల విలువైన 2.80 లక్షల టన్నుల సముద్ర మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. కాగా, 2021-22లో రూ.57,586 కోట్ల విలువైన 13.69 లక్షల టన్నులు ఎగుమతి అయితే.. ఏపీ నుంచి రూ.20,020 కోట్ల విలువైన 3.24 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. ఈ కారణంగానే 2021-22 సంవత్సరానికి బెస్ట్ మారిటైం స్టేట్ అవార్డును ఆంధ్రప్రదేశ్ కైవసం చేసుకుంది.

గణనీయమైన పురోగతి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు, అందిస్తున్న ప్రోత్సాహం కారణంగా రాష్ట్రంలో మత్స్య రంగం గణనీయమైన పురోగతి సాధిస్తోంది. 2020-21తో పోలిస్తే 2021-22లో మంచి పురోగతి సాధించి బెస్ట్ మారిటైం స్టేట్‌గా మన రాష్ట్రం నిలిచింది. 2022-23లో కూడా రికార్డు స్థాయి ఉత్పత్తి, ఎగుమతులతో కొత్త రికార్డులను నెలకొల్పబోతోంది.

– కె.కన్నబాబు, కమిషనర్, మత్స్య శాఖ

విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించగలం

- పేద పిల్లల చదువుకు ధనవంతులు సాయంచేయాలి
- కౌండిన్య ట్రస్ట్ ఉపకారవేతనాల ప్రదానోత్సవంలో గవర్నర్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించగలమని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో సోమవారం కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉపకార వేతనాల ప్రదానోత్సవం నిర్వహించారు. గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అజ్ఞానపు చీకట్లను పారదోలే సాధనమే విద్య అని అన్నారు. నిరుపేదలు విద్యావంతులుగా ఎదగడం ద్వారానే ధనిక, పేదల మధ్య అసమానతలను రూపుమాపగలమన్నారు. విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ధనవంతులు, మనసున్న దాతలు భాగస్వాములై తమవంతు చేయూతను అందించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా విద్యారంగంలో తెచ్చిన సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. ఉపకారవేతనాలను పొందిన విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి, జీవితంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకున్నాక తిరిగి సమాజానికి తమవంతు మేలు చేయాలని సూచించారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు గవర్నర్ తన వ్యక్తిగతంగా రూ.రెండు లక్షలు విరాళం ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కాంతిరాణా మాట్లాడుతూ కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 17ఏళ్లుగా ఉపకారవేతనాలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ 2006లో ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలతో ఉపకారవేతనాల పంపిణీని ప్రారంభించామని, ఇప్పటివరకు ఆరువేల మందికి రూ.1.50 కోట్లు అందించామని వివరించారు. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని 450 మంది విద్యార్థులకు రూ.18 లక్షలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఓఎస్డీ ఆర్పీ సిసోడియా, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత అదనపు కమిషనర్ వై.సత్యనారాయణ, ట్రస్ట్ ప్రతినిధి వాకా రామ్‌గోపాల్‌గౌడ్, గౌడ జన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

చేనేత విభాగంలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: జాతీయ చేనేత అభివృద్ధి పథకంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఏడు టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులు, ఏడు క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ కమిషనర్, సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎంఎం నాయక్ సోమవారం ప్రకటించారు. ఈ పోస్టులు బనగానపల్లె (నంద్యాల జిల్లా), మురమండ, పులగుర్త (తూర్పుగోదావరి), పాలకొండ, నారాయణపురం (పార్వతీపురం మన్యం జిల్లా), బొబ్బిలి (విజయనగరం), పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా) క్లస్టర్లలో ఉన్నాయి. క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లొమాతోపాటు రెండేళ్ల అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి. టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టుకు టెక్స్‌టైల్ డిజైన్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు చేనేత రంగంలో డిజైన్లు, ఉత్పత్తుల ప్రమోషన్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి. ఏదైనా సంస్థ తమ డిజైనర్‌ను సిఫారసు చేసినట్లయితే ఆ అభ్యర్థి బయోడేటాతోపాటు సదరు సంస్థ లేదా ఏజెన్సీ వివరాలను సమర్పించాలి. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు 21రోజుల్లోపు మంగళగిరిలోని ఐహెచ్‌సీ భవనంలో ఉన్న చేనేత, జౌళిశాఖ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. పూర్తి వివరాల కోసం http://www.aphandtex.gov.in వెబ్‌సైట్‌ను చూడాలి.

పేపర్ మిల్లు ఎదుట ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దీక్ష

- యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా రాజమహేంద్రవరంలో బైఠాయింపు
- అర్ధరాత్రి కూడా కొనసాగుతున్న నిరసన



పేపర్ మిల్లు గేటు ముందు బైఠాయించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రా పేపర్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులతో యాజమాన్యం ముందస్తుగా పదవీ విరమణ చేయిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మండిపడ్డారు. కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలను అందనీయకుండా యాజమాన్యం, కార్మిక సంఘం నేతలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యంతో చర్చించడానికి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లు వద్దకు రాజా వెళ్లారు. అయితే యాజమాన్యం పట్టించుకోకపోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆందోళన నిర్వహించారు. అనంతరం కోటిలింగాలపేట పంప్‌హౌస్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నేత శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో కొందరు యువకులు పంప్‌హౌస్ పైకి ఎక్కి గోదావరిలో దూకేస్తామంటూ నినాదాలు చేయడంతో పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పంప్‌హౌస్ నుంచి తిరిగి పేపర్ మిల్లు గేటు వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే రాజా అక్కడే బైఠాయించి అర్ధరాత్రి కూడా నిరసన కొనసాగిస్తున్నారు. పేపరు మిల్లు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ కదలబోమని స్పష్టం చేశారు. యాజమాన్య నిరంకుశ ధోరణికి నిరసనగా కార్మికులు సైతం సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీయడానికి పేపర్ మిల్లు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయకృష్ణ, గుర్తింపు పొందిన కార్మిక సంఘం నేత పనిచేస్తున్నారని మండిపడ్డారు. మూడున్నరేళ్లుగా వేతన ఒప్పందం కుదరకపోవడంతో కార్మికులు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లులో పనిచేస్తున్న సీనియర్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ పేరిట బయటకు పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. వారి స్థానంలో నైపుణ్యం లేని కొత్త యువకులను నియమించుకుంటున్నారని విమర్శించారు.

కోవిడ్ మృతుల ఎక్స్‌గ్రేషియాకు రూ.10 కోట్లు

- మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున పంపిణీ
- జిల్లాల వారీగా నిధులు విడుదల
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: కోవిడ్-19తో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కోవిడ్-19తో చాలా మంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించింది. ఇంకా మిగిలిపోయిన మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున చెల్లించేందుకు జిల్లాల వారీగా రూ.10 కోట్లను విడుదల చేసింది. పరిహారం చెల్లించాక ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాల్సిందిగా కలెక్టర్లకు సూచించింది.

జిల్లాల వారీగా నిధులు ఇలా..

జిల్లా	నిధులు (రూ.లక్షల్లో)
శ్రీకాకుళం	7.00
అల్లూరి సీతారామరాజు	16.50
కాకినాడ	160.00
తూర్పుగోదావరి	114.50
బీఆర్ అంబేద్కర్ కోనసీమ	140.00
ఏలూరు	99.00
కృష్ణా	97.50
గుంటూరు	11.50
బాపట్ల	4.50
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	167.50
చిత్తూరు	80.00
వైఎస్సార్	16.00
కర్నూలు	86.00



3.38 కోట్ల హెల్త్ ఐడీలు

- రాష్ట్రంలో ఇంటింటి సర్వేతో ఆరోగ్య పరీక్షలు
- రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనత గుర్తించేలా ప్రాథమిక పరీక్షలు
- ఇప్పటికే 72% మందికి పైగా పరీక్షలు, హెల్త్ ఐడీల జారీ



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఆరోగ్య పరీక్షల్లో భాగంగా గత డిసెంబర్ చివరి నాటికి ఇంటింటి సర్వేతో రాష్ట్ర ప్రభుత్వం 3.38 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించి హెల్త్ ఐడీలను జారీ చేసింది. సాంక్రమిక, జీవనశైలి జబ్బుల నియంత్రణ కోసం 4.66 కోట్ల మంది జనాభాకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. హెల్త్ ఐడీలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు అనుసంధానించారు. ఇప్పటికే 72% మందికిపైగా పౌరులకు హెల్త్ ఐడీలు జారీ చేసిన నేపథ్యంలో మిగతావారికి కూడా త్వరగా ఆరోగ్య పరీక్షలు పూర్తి చేసి ఐడీల జారీకి చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్లతో సమీక్ష సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు.

ప్రతి ఇంటికి వెళ్లి..

ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనతతో పాటు ఇతర వ్యాధులను గుర్తించేందుకు ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. చిన్న పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు. ప్రాథమిక లక్షణాలను బట్టి వైద్యులతో పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారించిన వారందరికీ ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స అందేలా చర్యలు చేపట్టారు.

గత డిసెంబర్ చివరి నాటికి హెల్త్ ఐడీల జారీ ఇలా

జిల్లా	హెల్త్ ఐడీలు	తిరుపతి	14,28,692
ఏలూరు	16,10,327	గుంటూరు	14,90,449
అనకాపల్లి	11,69,604	శ్రీకాకుళం	15,30,608
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	16,90,232	అన్నమయ్య	11,46,130
పార్వతీపురం మన్యం	7,01,127	కర్నూలు	16,98,791
పల్నాడు	14,36,431	విజయనగరం	12,68,722
వైఎస్ఆర్	14,66,811	చిత్తూరు	12,62,899
డా.బి.ఆర్.అంబ్కర్ కోనసీమ	12,73,480	నంద్యాల	12,32,765
		కృష్ణా	12,05,678
ప్రకాశం	15,83,562	ఎన్టీఆర్	13,86,112
పశ్చిమగోదావరి	12,73,620	శ్రీ సత్యసాయి	12,29,590
బాపట్ల	10,68,494	అనంతపురం	14,97,824
తూర్పుగోదావరి	12,70,420	విశాఖపట్టణం	10,91,324
కాకినాడ	1491179	అల్లూరి సీతారామరాజు	391737

లైంగికదాడి కేసులో రాజీకి అనుమతినిచ్చిన హైకోర్టు

- రాజీకి ఆస్కారం లేకపోయినా పరిస్థితుల దృష్ట్యా అనుమతి.. ఓ యువకుడిపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేత

సాక్షి, అమరావతి: లైంగికదాడి కేసులో చట్ట ప్రకారం సాధారణంగా రాజీకి ఆస్కారం లేకపోయినప్పటికీ, ఫిర్యాదుకు దారి తీసిన పరిస్థితులు, ఇరుపక్షాలు రాజీ చేసుకుని ఎవరి జీవితాలు వారు గడిపేందుకు నిర్ణయించుకున్న నేపథ్యంలో ఓ యువకుడిపై ఓ యువతి పెట్టిన లైంగికదాడి కేసులో రాజీకి హైకోర్టు అనుమతినిచ్చింది. ఆ యువకుడిపై విశాఖపట్నం జిల్లా గాజువాక పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఇటీవల తీర్పు చెప్పారు. తనతో సంబంధాన్ని తెంచుకుని మరో యువతితో వివాహానికి సిద్ధమైన ఓ యువకుడిపై ఓ యువతి గత ఏడాది పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతనిపై లైంగిక దాడి, మోసం, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ అతను హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ యువతి కూడా హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. రాజీకి అనుమతించాలని కోర్టును కోరారు. ఇరువురూ కోర్టు ముందు హాజరయ్యారు. తనను వివాహం చేసుకునేందుకు నిరాకరించాడన్న కోపంతోనే ఫిర్యాదు చేశానని న్యాయమూర్తి ఎదుట యువతి చెప్పింది. తమ వివాదం ముగిసిందని, ఫిర్యాదు ఉపసంహరించుకుంటానని తెలిపింది. ఎవరి జీవితాలు వారు గడుపుతామని నివేదించింది. ఇరువురి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, అసలు లైంగిక దాడి కేసు రాజీ చేయడానికి వీల్లేదని జ్ఞాన్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. అయితే, అదే సుప్రీంకోర్టు దండపాణి కేసులో పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని చెప్పిందన్నారు. ప్రస్తుత కేసులో ఇరుపక్షాల అభ్యర్థన మేరకు రాజీకి అనుమతిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఎప్పటి ఖర్చుకు అప్పుడే బిల్లు!

- నెలవారీ బిల్లుల్లోనే ఇంధన సర్దుబాటు చార్జీలు
- 'ఆటోమేటిక్' వ్యవస్థ ఏర్పాటుకు 90 రోజుల గడువు
- విద్యుత్ నిబంధనలు 2005కి కేంద్రం సవరణలు.. అమలు చేయాలని డిస్కంలకు ఏపీఈఆర్సీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఇంధన సర్దుబాటు (ట్రూ అప్) చార్జీలను ఏడాది చివరిలో మదించి, వినియోగదారులపై భారం వేయకుండా, ఇకపై ఎప్పటికప్పుడు ప్రతి నెలా బిల్లుల్లో సర్దుబాటు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రెండు నెలల బిల్లుల్లో వేసి వసూలు చేసుకోవచ్చని, అంతకుమించితే వసూలు చేయడానికి వీల్లేదని చెప్పింది. ఇందుకోసం ఆటోమేటిక్‌గా బిల్లులు రూపొందించే ప్రత్యేక వ్యవస్థను 90 రోజుల్లోగా అందుబాటులోకి తేవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి సూచించింది. ఈ మేరకు విద్యుత్ నిబంధనలు 2005 చట్టంలో సవరణలు చేసింది. ఏపీఈఆర్సీలో విద్యుత్ వినియోగదారులు, సంస్థల మధ్య తలెత్తిన వివాదాలను 120 రోజుల్లోనే పరిష్కరించాలని కేంద్రం తాజా నిబంధనల్లో తెలిపింది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థలు ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరింది.కేంద్రం నిబంధనలను అమలు చేయాలని రాష్ట్రంలోని మూడు డిస్కంలను ఏపీఈఆర్సీ ఆదేశించింది. వినియోగదారులకు ప్రతినెలా నిర్ణీత సమయానికి రీడింగ్ తీసి విద్యుత్ బిల్లులివ్వాలని, ఇందుకోసం ప్రతి మీటర్‌ను రీడర్లు సందర్శించాలని స్పష్టం చేసింది. మొండి బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించింది.

నెలనెలా సర్దుబాటు

డిస్కంలు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి కరెంటు కొనుగోలుకు అయ్యే ఖర్చు వివరాలను ప్రతి ఏడాది చివర్లో ఏపీఈఆర్సీకి అందిస్తుంటాయి. దీనిపై బహిరంగ విచారణ అనంతరం ఖర్చులో కొంత మొత్తాన్ని వాయిదాల్లో బిల్లులతోపాటు వసూలు చేసుకునేందుకు డిస్కంలకు ఏపీఈఆర్సీ అనుమతిస్తుంది. దీనివల్ల డిస్కంలు ముందుగా పెట్టుబడి పెట్టాలి. చివరిలో వసూలు చేయడంవల్ల అవి విద్యుత్ చార్జీల పెరుగుదలగా, ప్రభుత్వాలు వేస్తున్న భారంగా వినియోగదారులు భావిస్తున్నారు. గత టీడీపీ హయాంలో డిస్కంలకు రావాల్సిన ట్రూ అప్ చార్జీలను వసూలు చేయకపోవడం వల్ల డిస్కంలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఇప్పటికీ ఇక్కట్లు పడుతున్నాయి. డిస్కంలు 2014-19 కాలానికి దాదాపు రూ.20,572 కోట్ల వాస్తవ అదనపు వ్యయం సర్దుబాటుకు విద్యుత్ నియంత్రణ మండలికి 2019 సంవత్సరం చివర్లో విన్నవించడాన్ని బట్టే టీడీపీ హయాంలో డిస్కంల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. కొందరు రాజకీయ దురుద్దేశాలతో న్యాయస్థానాలను తప్పుదోవపట్టించి, ట్రూ అప్‌ను నిలిపివేస్తున్న ఉదంతాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. ట్రూ అప్ వసూలు కాక ఉత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను డిస్కంలు సకాలంలో చెల్లించలేకపోతున్నాయి. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించడంతోపాటు వినియోగదారులపై ఒకేసారి పెనుభారం పడకుండా నెల నెలా ట్రూ అప్‌ను ఆటోమేటిక్‌గా బిల్లుల నుంచి వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలని కేంద్రం చెప్పింది.

తెలంగాణ

బోర్డు తిప్పేసిన గల్ఫ్ ఏజెంట్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఆర్‌కే టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుడు షేక్ బషీర్ కువైట్ వీసాల పేరిట సుమారు 600 మందికి పైగా నిరుద్యోగులను నిండా ముంచాడు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. ఒక్కొక్కరి వద్ద రూ.20వేల నుంచి రూ.60 వేల వరకు డబ్బులు వసూలు చేశాడు. మెడికల్ టెస్ట్‌ల పేరిట మరో రూ.5,600 చొప్పున వసూలు చేశాడు. రెండు నెలలుగా వేచి చూసిన బాధితులు వీసాల కోసం ఒత్తిడి చేయగా రాత్రికి రాత్రే బోర్డు తిప్పేశాడు. మొబైల్ ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. సోమవారం ఉదయం వీసాలు తీసుకుందామని వచ్చిన బాధితులు ట్రావెల్స్ మూసి ఉండటం, బోర్డు కూడా లేకపోవడంతో సుమారు 200 మంది డిచ్‌పల్లికి చేరుకుని ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ట్రావెల్స్‌లో పని చేసిన రాంపూర్ గ్రామానికి చెందిన లింబాద్రిని పట్టుకుని షేక్ బషీర్ అడ్రస్, వివరాలు చెప్పాలని నిలదీశారు. అయితే బషీర్ వద్ద తాను కేవలం జీతానికి పని చేశానని అతడు మోసం చేసి పారిపోతాడని తనకు తెలియదని తననేం చేయవద్దని మొరపెట్టుకున్నాడు. అక్కడి నుంచి బాధితులు డిచ్‌పల్లి– నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రోడ్డుపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మెడికల్ టెస్ట్‌ల పేరిట తమవద్ద రూ.5600 చొప్పున వసూలు చేసిన జిల్లా కేంద్రంలోని విజయ శ్రీ డయాగ్నోస్టిక్ సెంటర్ పై కూడా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి ఎస్సై కె గణేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు రాస్తారోకో విరమించారు. ఏజెంట్ బషీర్ ఎక్కడి వాడనే విషయంపై స్పష్టత రావడం లేదని పోలీసులు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943